# దేవుని అద్భుతమైన కృప

విలియమ్ మెక్‌డొనాల్డ్

అనువాదం:
శ్రీమతి టి. స్వరూపా అశోక్

Authentic™
HYDERABAD

*Devuni Adhbuthamaina Krupa*
(Telugu)

God's Amazing Grace
by William MacDonald

First Telugu edition 2014

ISBN: 978-93-83691-15-9

All rights reserved.
o part of this publication may be reproduced in any form or by any means, electronic, or mechanical, including photocopying, recording, or any information storage and retrieval system, without permission in writing from the publisher.

Published by
Authentic Books
Logos Bhavan, Suchitra Junction, Secunderabad 500 067, Andhra Pradesh.
www.authenticindia.in

Authentic Books is an imprint of Authentic Media, the publishing division of OM Books Foundation.

Printed and bound in India by
Authentic Media, Secunderabad 500 067

# విషయసూచిక


అద్భుతమైన కృప ........................................ 7

1. బ్రహ్మాండమైన ఓ సమస్య ........................................ 9
2. అసాధారణ పరిష్కారం ........................................ 13
3. ఇప్పుడు శుభవార్త ........................................ 21
4. నివ్వెరపరచే దేవుని కృప ........................................ 25
5. కృపను ఎలా ప్రశంసించాలి ........................................ 31
6. "సువార్త"గా ఉన్న ఒక దుర్వార్త ........................................ 49
7. నిజ విశ్వాసి ఎవరో చెప్పడం సులభం ........................................ 61
8. నీ మాటలే నిన్ను అప్పగిస్తాయి ........................................ 65
9. క్రియలతో వచ్చిన సమస్యేంటి? ........................................ 69
10. ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి ........................................ 71
11. దుర్వినియోగపరచబడి, తప్పుగా వాడబడిన కృప ........................................ 77
12. దేవుడు పరిశుద్ధతనెలా కలుగచేస్తాడు? ........................................ 81
13. అంతా కృపయే! ........................................ 89
14. సింహావలోకనం ........................................ 95

*తుది వివరణలు ........................................ 103*

# అద్భుతమైన కృప

కష్టాలతో కూడిన బాల్యం, యౌవ్వనం గడిచిన తరువాత జాన్ న్యూటన్ మధ్యదరా సముద్రపు వర్తకంలో నున్న తన తండ్రి ఓడలో చేరాడు. అతడు అవినీతి, వ్యభిచారం, దేవునిపై నమ్మకం లేకుండా ఉండడం వంటి గుంటలలో పడిపోయాడు. పలికినదే మళ్ళీ పలుకకుండా రెండుగంటల సేపు శపించగలడని, ఒట్టువేసుకోగలడని ఎవరో చెప్పారు. తండ్రిచే గద్దించబడ్డాక, అతడు బానిసల ఓడలో పనిచేశాడు. అక్కడ అతడు తన అధికారియొక్క ఆఫ్రికన్ భార్యకు నిజంగానే బానిస అయ్యాడు.

సముద్రంపై చెలరేగిన ఒక భీకరతుఫానులో చిక్కుకొని, ఇంచుమించు నశించే స్థితిలో ఉన్నపుడు, ప్రభువువైపుకు తిరిగాడు. తరువాత అతడెంతో హీనంగా చూచిన సువార్తకే, సువార్త పరిచారకుడయ్యాడు.

ఎంతో ప్రియమైన ఈ కీర్తనలో అతని వ్యక్తిగత రక్షణానుభవం నిక్షిప్తం చేయబడింది. వింతైన ఏర్పాటు ద్వారా ఈ కీర్తన కొన్నిసార్లు సంగీత ప్రపంచంలో బహుశా దేవుని అత్యద్భుత కృపను ఎరుగనివారి మధ్య హిట్‌లిస్ట్‌లో చోటు దక్కించుకుంది.

## "అమేజింగ్ గ్రేస్" (అద్భుతమైన కృప)

అద్భుతమైన కృప! ఆహా ఎంత మధురం ఆ స్వరం
నావంటి నీచుడిని రక్షించిన కృప!
ఒకప్పుడు తప్పిపోతిని, ఇప్పుడు దొరికితిని,
అంధునిగా ఉంటిని, ఇప్పుడు చూడగలను నేను.

నా హృదయానికి భయాన్ని నేర్పింది కృపే,
నా భయాలను తొలగించిందీ కృపే,
నేను మొదట నమ్మిన ఘడియలో
ఎంత ప్రశస్తంగా కనబడింది ఆ కృప.

ఎన్నో ప్రమాదాలు, కష్టాలు, ఉచ్చుల ద్వారా
నేనిప్పటికే పయనించి వచ్చాను.
నన్నింత దూరం క్షేమంగా తోడుకొని వచ్చింది కృపే,
నన్ను పరమగృహానికి నడిపిస్తుంది కృప.

సూర్యుని వలె కాంతివంతంగా ప్రకాశిస్తూ,
అక్కడ మనం వేవేల సంవత్సరాలు గడిపినా,
మొదటికన్నా తక్కువేమీ కావు,
దేవుని స్తుతిగీతాలు పాడే దినములు.[1]

ఒకటవ అధ్యాయం

# బ్రహ్మాండమైన ఓ సమస్య

దేవునికో సమస్య ఉంది. సమస్య అంటే, నా ఉద్దేశం అది కాదు. ఎంతో శక్తిమంతుడు, జ్ఞానవంతుడునైన గొప్ప దేవుడు సమస్యల్ని కలిగుండడమా? ఆయన సమస్యల్ని పరిష్కరిస్తాడు. కానీ, మానవ రక్షణార్థమైన ప్రణాళికను రచించడంలో ఆయనకు సమస్య ఉన్నట్టు మనకు అనిపిస్తుంది. ఆయనకు సమస్య వుందని చెప్తున్నామంటే మనం కేవలం మానవ పరిభాషనే ఉపయోగిస్తున్నామని అర్థం.

ఇప్పుడు మనం దానిని స్పష్టం చేసుకున్నాం గనుక, ఇంతకీ సమస్య ఏమిటి? నిజానికది దేవుని గొప్ప సుగుణాలైన ఆయన ప్రేమకు, ఆయన నీతికి మధ్య కనిపించే సంఘర్షణనుండి ఏర్పడినదే!

ఒకవైపు చూస్తే, దేవుడు ప్రేమగలవాడు ప్రజల్ని ఎంతో లోతుగా ప్రేమిస్తాడు. వారాయన విజయసూచకమైన చేతి పనివారుగా ఉన్నారు. సృష్టిలో గల ఎన్నో అద్భుతాలలో మానవాళితో ఆయన ప్రత్యేక విధానంలో ఆనందించాడు. నిత్యత్వమంతటిలో ఆయన ప్రతి పురుషుని యొక్క, స్త్రీ యొక్క, బాల బాలికల యొక్క సహవాసాన్ని, స్నేహాన్ని కోరుతున్నాడు.

కానీ మనమందరం పాపులం, దేవుడు నీతిమంతుడు కావడంతో సమస్య అక్కడే ఉత్పన్నమైంది. ఆయన పాపాన్ని అంగీకార దృష్టితో

చూడలేడు. పాపాన్ని క్షమించి వదిలెయ్యడు. గమనించకుండా ముందుకు వెళ్ళడు. లిప్తకాలం కన్నుమూయడు. పాపానికి శిక్ష విధించాల్సిందే! పాపానికి జీతం మరణమే! పాపులు పరలోకంలో దేవునితో నివసించడానికి వెళ్ళాలనుకుంటే మాత్రం, వారి పాపాలు ఏదోవిధంగా పోవాల్సిందే. పాపానికి శిక్ష చెల్లించాల్సిందే! దేవునితో జీవించడానికి ప్రజలు పవిత్రంగా, కల్మషం లేకుండా ఉండాలి.

కాబట్టి, అక్కడే నీకు బ్రహ్మాండమైన సమస్యవుంది. ఒకవైపు దేవుడు ప్రేమయై వున్నాడు. ఆయన ప్రేమే ఎవరిని నశించిపోవడానికి ఇష్టపడకుండా చేస్తోంది. ఏ ఒక్కరూ శాశ్వతంగా నశించిపోవడాన్ని ఆయన కోరడు. ప్రతి ఒక్కరూ పరలోకంలోని ఆనందాలను, శ్రేష్ఠమైన అద్భుతాలను ఎప్పటికీ ఆనందించాలని ఆయన కోరుకుంటున్నాడు. కానీ! దేవుడు వెలుగు కూడాను. ఆయన నీతి పాపుల పాపాలకు ప్రాయశ్చిత్తం జరగాల్సిందే నంటోంది. ఆయన మన ప్రతి చెడు ఆలోచనకు, మాటకు, క్రియకు పూర్తి నివృత్తి చేయాలని అధికారంతో అడుగుతున్నాడు. క్షమింపబడని ఏ పాపీ పరలోకంతో ఎన్నటికీ ప్రవేశించడు.

ఇప్పుడు దేవుడు తన ప్రేమను తృప్తిపరచుకొనేలా అదే సమయంలో తన నీతి విషయంలో రాజీపడకుండా రక్షణ ప్రణాళికను ఎలా చేయగలడు? ఒకే సమయంలో ఆయన న్యాయవంతుడైన దేవునిగాను, రక్షకునిగాను ఎలా వుండగలడు? ఆయన నీతిగల దేవునిగా వుండి, దుష్టులైన పాపుల్ని ఎలా క్షమించగలడు? సందిగ్ధస్థితి అదే!

ప్రఖ్యాతిగాంచిన గ్రీకు పండితుడైన సోక్రటీసు అప్పట్లో తన శిష్యుడైన ప్లేటోతో ఇలా అన్నాడు. “దేవుడు పాపాల్ని క్షమించవచ్చు కానీ ఎలా క్షమిస్తాడో అర్థం కావట్లేదు.”

## రక్షణకు సంబంధించిన ఏ ప్రణాళికకైనా నెరవేర్చవలసిన ఏడు షరతులు ఉన్నాయి

పతనమైన మానవాళిని రక్షించడానికి దేవుడు నిశ్చయించుకోవడ మనేది వర్ణించలేని గొప్పకార్యం. కానీ, ఒక్కసారి ఆయన నిర్ణయం తీసుకున్నాక, ఆయన తన ప్రేమను, పరిశుద్ధతను పూర్తిగా సంతృప్తిపరచుకొనేలా ప్రణాళికను ఏర్పరచుకోవాలి. ఆయన అందరినీ ప్రేమిస్తాడు కాబట్టి ఆయన రక్షణ...

1. అందరికీ ఇవ్వబడాలి. ఏ ఒక్కరినీ విడిచిపెట్టడం ఆయనకిష్టం లేదు.
2. అది అందరికీ సరిపోయినదై వుండాలి. ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ప్రతివ్యక్తి అవసరాన్ని అది తీర్చగలగాలి.
3. ప్రతి ఒక్కరూ దానికి అర్హులయ్యేవిధంగా ఆ ప్రణాళిక ఉండాలి. ఎటువంటి దుష్టత్వం వారిని దానిలో పాల్గొనకుండా చేయకుండా వుండగలగాలి.
4. ఎవరికైనా సులువుగా అర్థమయ్యేలా ఉండాలి. చేయడానికి అసాధ్యంగా వున్నవాటిని చేయమని అడగడంలో ఎలాంటి ఉపయోగం లేదు.
5. ఎవరైనా స్వీకరించగలిగేలా ఉండాలి. నిజమైన భక్తిలో ఎవరూ పాటించలేని షరతులు వుండకూడదు.
6. మానవులు పొగడుకొనే వాటికి అవకాశం లేనివిగా ఉండాలి. గర్వం పాపానికి తండ్రి. పరలోకంలో గర్వం ఉండదు. ఆత్మస్తుతిని బయటకు పంపడానికి, ప్రతి ఒక్కరికి పరలోకం చేరడానికి ఒకే విధమైన కొలత ఉండాలి.
7. ఆ ప్రణాళిక ఎలా ఉండాలంటే, ఒక వ్యక్తిని, అతడి స్వేచ్ఛా చిత్తానికి వ్యతిరేకంగా చేయమని దేవుడడిని ఒత్తిడి చేయనిదైయుండాలి.

## రెండవ అధ్యాయం

# అసాధారణ పరిష్కారం

దైవ సందిగ్ధతకు యోచించగల ఒకే ఒక పరిష్కారం వుంది. అది "ప్రత్యామ్నాయం" అనే పదంలోనే వుంది. ప్రజల పాపాలకు శిక్షను భరించేందుకు ఏదోవిధంగా ఒక సరియైన ప్రత్యామ్నాయం కావాలి. మనలో చాలామందికి ప్రత్యామ్నాయం అంటే బాగా తెలుసు. కొన్ని రకాల క్రీడలలో మైదానంలోనికి కోచ్ మరొక క్రీడాకారుని పంపిస్తాడు. పాతనిబంధన కాలంలోని ఒక సాధారణ హీబ్రూ విశ్వాసికి ప్రత్యామ్నాయమంటే ఏమిటో బాగా తెలుసు. అతడు బలిపశువును బలిపీఠం మీదికి తీసుకొని వచ్చి ఆ పశువు తలపై చేతులుంచినపుడు, అతడు తన పాపాల్ని తన స్థానంలో మరణించనున్న తన ప్రత్యామ్నాయంపై బదిలీ చేయడాన్ని చూపిస్తున్నాడు.

అవును, దైవిక సందిగ్ధతకు గల పరిష్కారం పాప పంకిలమైన మానవాళి స్థానంలో మరణించడానికి ఒక ప్రత్యామ్నాయాన్ని కలిగుండడం. కానీ ఇక్కడ కూడా ఆ ప్రత్యామ్నాయానికి కొన్ని షరతులున్నాయి.

### ప్రత్యామ్నాయం ఐదు పరీక్షలలో ఉత్తీర్ణం కావాలి

1. ఆ ప్రత్యామ్నాయం ఒక మానవుడై యుండాలి. లేకపోతే పరస్పర మార్పిడి సరియైనదిగా లేక సమానమైనదిగా వుండదు.

2. అతడు పాపరహితుడుగా ఉండాలి. లేకపోతే తన పాపానికి తానే మరణించాల్సి వస్తుంది.
3. ఆయన దేవుడై యుండాలి. కేవలం నిత్యుడైన వ్యక్తి మాత్రమే అసంఖ్యాకమైన ప్రజల లెక్కించలేని పాపాలకు ప్రాయశ్చిత్తం చేయగలడు. ప్రత్యామ్నాయం యొక్క విలువ మానవుల గత పాపాలను, ప్రస్తుత, భవిష్యత్ పాపాలను కప్పివేసేటంత ఉన్నతంగా వుండాలి.
4. ఆయన రక్తాన్ని చిందించాలి. ఎందుకంటే ధర్మశాస్త్ర దైవ సూత్రం రక్తప్రోక్షణ లేకుండా పాపక్షమాపణలేదని అధికార పూర్వక ఆదేశాన్నిచ్చింది. రక్తంలో జీవముంది. జీవానికి జీవాన్ని ప్రత్యామ్నాయంగా ఇవ్వాలి.
5. అతడు ఇష్టపూర్వకంగా దానిని చేయాలి. లేకపోతే, దుష్టులైన పాపుల స్థానంలో మరణించడానికి స్వచ్ఛందంగా ముందుకురాని ఒక బాధితుడిని అన్యాయంగా బలిచేయడంపై సాతానుడు దేవునిపై నేరారోపణ చేయగలడు.

## యేసే అన్నిటికీ సరిపోయినవాడు

విశ్వంలో ఈ షరతులన్నిటినీ తీర్చగల ఒకే ఒకవ్యక్తి యేసుక్రీస్తే!

- ఆయన బెత్లెహేములో కన్యకయైన మరియకు మానవునిగా జన్మించాడు. ఆయన పరిపూర్ణుడు.[1] ఆయన పరిపూర్ణతను గొప్ప క్రైస్తవ కీర్తనాకారుడైన ఛార్లెస్ వెస్లీ ఈ విధంగా వర్ణించారు. "మన దేవుడు ఒక కాలపరిమితికి ఒదిగిపోయాడు, గ్రహించలేనంతగా మానవుడయ్యాడు."
- ఆయన దేవుడు.[2] ఆయనకు దేవునికుండాల్సిన గుణగణాలన్నీ ఉన్నాయి. దేవుని బిరుదులన్నీ వున్నాయి. ఆయన తండ్రియైన దేవునితో సమానంగా వున్నాడు.

- ఆయన పాపము లేనివానిగా ఉన్నాడు. ఆయన అత్యున్నత ప్రతిభ నిరాకరించలేనిది. ఆయన పాపమెరుగనివాడు. పాపము చేయనివాడు. ఆయనలో ఎలాంటి పాపము లేదు.[3]
- ఆయన తన రక్తాన్ని పాపుల కొరకై ప్రత్యామ్నాయంగా కల్వరి సిలువపై చిందించాడు. ప్రతి పాపమును కడిగే దైవ కుమారుడైన యేసుక్రీస్తు రక్తాన్ని అనేక ప్రజాసమూహాలు తమకు తాము ఉపయోగించుకున్నారు.[4]
- ఆయన దానిని పాపుల రక్షణార్థం ఇష్టంతో చేశాడు. దానికి అయిష్టత, వెనక్కి తిరగడం వంటివి లేవు. దీనికి భిన్నంగా, దేవుని చిత్తానికి తనను తాను సంతోషంగా అప్పగించుకున్నారు.[5]

క్రీస్తు మన ప్రత్యామ్నాయమనే సత్యం బైబిలంతటా కనిపిస్తుంది. యెషయా ఈ విషయాన్ని ధైర్యంగా ఇలా ప్రకటించాడు: "మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములను బట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది."[6] బాప్తిస్మమిచ్చు యోహాను "ఇదిగో లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" అని ఎలుగెత్తి చెప్పాడు. అపొస్తలుడైన పౌలు[7] "...నన్ను ప్రేమించి నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసము వలన జీవించుచున్నాను"[8] అని నిశ్చయాత్మకంగా చెప్పాడు. పేతురు తన సాక్ష్యాన్ని దీనికి కలిపాడు. "ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను."[9] యేసు ప్రేమించిన అపొస్తలుడు "ఆయనే మన పాపములకు శాంతికరమైయున్నాడు. మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకు శాంతికరమైయున్నాడు[10] అని నిశ్చయంగా చెప్పాడు.

## దేవుని రక్షణ ప్రణాళిక అన్నిలెక్కలకు తగినది

ప్రభువైన యేసు ప్రత్యామ్నాయ త్యాగానికవసరమైన వాటన్నిటినీ సంపూర్ణంగా కలిగి వుండడం వలన, దేవుడిప్పుడు తన అద్భుతమైన రక్షణ ప్రణాళికను ఆయన కృపాసువార్తను వెల్లడి చేయగలడు. తమ పాపాలకు పశ్చాత్తాపపడి, తన కుమారుని ప్రభువుగా, రక్షకునిగా విశ్వాసంతో అంగీకరించిన ప్రతివారికీ ఆయన రక్షణను ఉచితవరంగా ఇవ్వగలడు.

- ఈ రక్షణ అందరికీ దొరుకుతుందనే విషయాన్ని గమనించండి. సువార్త ఇలా చెబుతోంది. "...విశ్వసించు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను."[11] ఒకవేళ అది ధనంపై ఆధారపడి ఉంటే, బీదలు వదిలిపెట్టబడి ఉండేవారు.
- అది అందరికీ సరిపోతుంది.[12] నిత్యుడైన ఈ రక్షకుని మరణానికి సర్వలోకపు పాపాలను శాంతికరం చేసే శక్తి వుంది. ఇది అత్యున్నతమైన సంతృప్తి గలది.
- దీనికి ప్రతిఒక్కరూ అర్హులే! కారణం ప్రతి ఒక్కడూ పాపే కనుక;[13] దేవుని రక్షణకు అర్హుల్ని చేసేది కేవలం ఆయన కృప మాత్రమే! నిత్య జీవమనే దేవుని కృపావరము కేవలం జ్ఞానులకు, ఐశ్వర్యవంతులకు, అందమైనవారికి లేక పేరు ప్రఖ్యాతులు గల వారికి మాత్రమే కాకపోవడం ఎంతో మంచిది. అలావుంటే, మనలో కొందరమెప్పటికీ అర్హులం కాము. అది కేవలం చదువరులకు, మాట్లాడడం, చూడడం, ఎక్కడం చేసేవారికే అయితే కొందరు దూరంగా ఉంచబడతారు. కేవలం సువార్త మాత్రమే సర్వలోకానికీ సరిపోతుంది.
- అది ఎవరికైనా అర్థమయ్యేటంత సరళంగా ఉంది. ఎవ్వరూ అంత ఆదిమమైన వారు లేక నిరక్షరాస్యులు కారు. సువార్తలో

ప్రభువైన యేసు "రండి"[14] అని చెబుతున్నాడు. దీని గురించి క్లిష్టమైనదేదీ లేదు. విలియం కూపర్ ఇలా చెబుతున్నాడు. "ఆహా! సంక్లిష్టమైన మానవుల క్రియలవలెకాక, పరలోకపు ప్రణాళిక ఎంత సులువుగా, సరళంగా భారంకానిదిగా వుంది!"

- ఎవరైనా దానిని పొందవచ్చు.[15] రక్షణ అనేది మారుమనస్సు ద్వారా వస్తుంది. ఎవరైనా దీనిని చేయొచ్చు. అది విశ్వాసం ద్వారా జరుగుతుంది. ఎవరైనా ప్రభువైన యేసుక్రీస్తును నమ్మవచ్చు. ఎవరూ ఆయనను మించినవారు కారు. ఒక ప్రాణికి తన సృష్టికర్తను నమ్మడానికి ఇంతకన్నా సహేతుకమైనదేదీలేదు.
- కృప బడాయిని బయటకు తరిమేస్తుంది. అది "పాపమంతా నేనే చేశాను. రక్షించడం క్రీస్తు చేశాడు. ఆయన ప్రతిభను నేను తీసుకుంటున్నాను. నా స్వంత ప్రతిభను కాదు. నేనేమిటో లేక నేనేమి చేశానో అనే దాన్నిబట్టి పరలోకంలో ప్రవేశించే హక్కు నాకు లేదు. క్రీస్తే క్రీస్తు మాత్రమే నా అధికార అనుమతి పత్రం" అని చెప్తుంది. మనమేదోవిధంగా మన చక్కని గుణగణాల్ని బట్టి లేక ఆచరణలో పెట్టిన వాటినిబట్టి పరలోకాన్ని పొందితే, మనం గొప్పలు చెప్పుకుంటాం. అందరిలోనూ బడాయి అనేది వివిధ స్థాయిల్లో ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఒకర్ని మించి ఒకరు చేయాలని తాపత్రయపడతారు. అప్పుడు పరలోకం శతృత్వంతో, అసూయతో, ద్వేషంతో చిన్న చిన్న విషయాలకోసం జగడమాడడం, ఎప్పుడూ ఒక్కరే అందరికీ పైగా వుండాలనే స్వార్థదృష్టితో నిండిన దృశ్యంగా కన్పిస్తుంది. దీనిని చక్స్మిత్ ఇలా వివరించారు. "నీవు చెప్పే కథలు వింటూ నేనక్కడ కూర్చుంటాను. అయినా నాలో నేను అబ్బ, అతడు చెప్పేదంత బోరుగా వుంది. కాసేపతడు నోరు మూసుకొనివుంటే, ఎంత బావుంటుందో" అని అతడికి చెప్పగల నని అనుకుంటాను. అలావుంటే అసలది పరలోకమే కాదు.

- దేవుని రక్షణను అంగీకరించేలా మానవుడు బలవంతం చేయబడలేదు.[16] సృష్టికర్త అతడిని స్వేచ్ఛానైతికత గల వ్యక్తిగా చేశాడు. ప్రతి ఒక్కరూ రక్షణ పొందాలని అనుకోకపోవడం వింతగా అన్పిస్తుంది. దేవుడు పరలోకాన్ని ఎవరిపైనా రుద్దడు. ఆయన ఎవరినీ అతడి/ఆమె ఇష్టం లేకుండా పరలోకానికి తీసుకొని వెళ్ళడు. హింస, బలవంతపు వత్తిడి, క్రూరత్వం మొదలైన లక్షణాలతో కూడిన ఏ మతమైనా నిజమైంది కాదని నీవు నిశ్చయించుకుంటావు.

కాబట్టి మనం దేవుని రక్షణ విధానం సంపూర్ణమైనదిగా ఉన్నట్టు చూశాము. దేవుడు కోరిన అంశాలన్నిటినీ తృప్తిపరచడాని కవసరమైన అన్ని షరతులకూ అది అంగీకారయుతంగా వుంది. అదే సమయంలో అది మానవాళికంతటికీ దొరికేదిగా వుంది. సిలువపై క్రీస్తుచేసిన పని. దేవునిని మానవాళిపై ఆయనకు గల ప్రేమను, ఆయన న్యాయంతో రాజీపడకుండా తన ప్రేమను వారికి పూర్తిగా అందేటట్లు చేసింది. ఈ విషయాన్ని కీర్తనాకారుడైన దావీదు భావుకతతో ఇలా చెబుతున్నాడు.

> "కృపాసత్యములు కలుసుకొనినవి నీతి సమాధానములు ఒకదాని కొకటి ముద్దుపెట్టుకొనినవి."[17]

దేవుని స్వభావాన్ని గురించి, మానవుని పాప స్వభావాన్ని గురించి తెలుసుకొన్నపుడు రక్షణకు ఇదే అవసరమైన మార్గమని స్పష్టమౌతోంది. ప్రజలు మరేవిధంగాను, ఎన్నటికీ రక్షణ పొందలేరు.

మేక్స్ లుకాడో ఇలా చెప్పారు:

> "ప్రపంచంలోని ఏ ఇతర మతం అటువంటి సందేశాన్నివ్వదు. మిగిలిన మతాలన్నీ కఠినమైన ఆచారాల్ని, సరియైన త్యాగాన్ని, సరియైన జపాలను, సరియైన అనుభవాల్ని అధికార పూర్వకంగా కోరతాయి. వారివి వ్యాపార సంబంధమైన వస్తుమార్పిడి విధానంతో, ప్రత్యక్షంగా

వస్తుసేవల్ని మార్చుకోవడం వంటివాటితో నిండివున్న రాజ్యాలు. నీవిది చేస్తే, దేవుడు నీకది ఇస్తాడు మొదలైనవి.

దాని ఫలితం గర్వం లేక భయం. దానిని నీవు సాధిస్తే గర్విస్తావు; సాధించలేకపోతే భయపడతావు.

క్రీస్తురాజ్యం దీనికి పూర్తిగా భిన్నమైనది. అది బీదలకొరకైన రాజ్యం. ఇక్కడ సభ్యత్వమివ్వబడుతుంది కానీ కొనుక్కోబడదు. నీవు దేవుని రాజ్యంలోనికి ప్రవేశపెట్టబడతావు దత్తపుత్రునిగా స్వీకరించబడతావు. ఇది తగినంత చేస్తేనే సంభవిస్తుందని లేదు నీవు తగినంత చేయలేకపోయానని ఒప్పుకున్నా అది జరుగుతుంది. దీని ఫలితంగా నీవు సేవ చేస్తావు. గర్వంతో లేక భయంతో కాదుకానీ, కృతజ్ఞతాహృదయంతో చేస్తావు. [18]

జాన్ మెకార్థర్ ప్రపంచంలో కేవలం రెండే రెండు మతాలున్నాయని అంగీకరిస్తారు:

ఇంతవరకూ మానవాళిచే లేక సాతానుచే స్థాపించబడిన ప్రతివిధమైన అబద్ధ మతమూ మానవ యోగ్యతకు చెందిన మతమే. అన్యమతం, మానవతావాదం, జంతువాదం (భౌతిక విషయాలకు ప్రాధాన్యత నిచ్చేవాదం), ఆఖరికి అబద్ధ క్రైస్తవ్యం కూడా ఈ రకానికి చెందినదే! ఇవన్నీ నీతిని పొందడానికి లేక తమ దేవతను శాంతింపచేయడానికి ప్రజలేం చేయాలో అనే విషయాలపై దృష్టిపెడతాయి.

బైబిలు సంబంధమైన క్రైస్తవ్యమేమిటంటే, దైవసంబంధమైన, విజయవంతంగా పూర్తిచేసిన పనికి సంబంధించిన మతం. ఇతర మతాలు ఇది 'జరిగించు'మని చెబుతాయి. కానీ క్రైస్తవ్యం "అది జరిగింద"ని చెబుతుంది (యోహాను 19:30). ఇతర మతాలు భక్తిగల వ్యక్తి పాప ప్రాయశ్చిత్తాన్ని పొందడానికి దేవతను శాంతిపరచడం లేక ఆమోదింపబడిన లక్ష్యాన్ని సాధించే ప్రతిభపై దృష్టిని పెడతాయి. [19]

స్పర్జన్ ఇలా అడుగుతున్నారు:

"అన్యాయస్తుడైన తిరుగుబాటుదారుని కోసం న్యాయవంతుడైన అధికారి చనిపోవడాన్ని గురించి ఎవరు ఆలోచించి వుండగలరు! ఇది మానవ పురాణగాథల బోధన లేక ఊహాజనితమైన కవిత్వం యొక్క కల కానీ కాదు. ఇది సత్యం కనుకనే చేసిన తప్పుకు శిక్షననుభవించే పద్ధతి మానవుల్లోనే తెలియబడింది. కల్పితాలు దానిని రూపించలేవు. దేవుడు తనంతట తానే దానినభిషేకించాడు. అది ఊహించి చెప్పిన విషయం కాదు.[20]

మూడవ అధ్యాయం

# ఇప్పుడు శుభవార్త

క్రియల మూలముగా కాక కృపద్వారానే రక్షణపొందడం అనే విషయం గురించి బహుశా బైబిల్లో అత్యంత స్పష్టమైన వచనాలు ఇవేననుకుంటాను:

> పనిచేయువానికి జీతము ఋణమేగాని దానమని ఎంచబడదు. పనిచేయక, భక్తిహీనుని నీతిమంతునిగా తీర్చువానియందు విశ్వాసముంచువానికి వాని విశ్వాసము నీతిగా ఎంచబడుచున్నది (రోమా 4:4–5).

ఈ వచనాలలోని క్రింది సత్యాలను గమనించండి:

ఒక వ్యక్తి పనిచేసి, తన జీతాన్ని తీసుకుంటే, అతడు తన యజమానుడు రుణపడివున్న దానినే తీసుకొంటున్నాడు. అది రుణమే కానీ కృప కాదు. దేవుని రక్షణలో అటువంటిది ఉండదు. నిర్ఘాంతపరచేదేమిటంటే, దేవుడు పనిచేయని వారిని రక్షిస్తాడు. అంటే రక్షణను సంపాదించుకోవడానికి ప్రయత్నించనివానికి, అర్హులు కాని వారికి కూడా అది అందించబడుతుంది ఎందుకంటే అది దేవుడిచ్చే ఉచిత బహుమానం.[1]

మరొక నిర్ఘాంతపరచే వార్తేమిటంటే ఆయన రక్షించేది దుష్టులనే! మంచివారిని కాదు, తమ శక్తి లోపం లేకుండా చేసేవారిని కాదు, కానీ ఎవరైతే తాము దుష్టులమని ఒప్పుకోవడానికిష్టపడతారో వారినే రక్షిస్తాడు.

"విశ్వసించుట" అనే మాటపై శ్రద్ధపెట్టండి. అదే క్లిష్టమైనది. విశ్వసించడం అంటే యేసుక్రీస్తును ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించడం. దాని అర్థం ఆయనను ఒకరి పాపాలకోసం శిక్షను చెల్లించినవానిగా అంగీకరించడం. దాని అర్థం పరలోకానికి గల ఒకే ఒక నిరీక్షణ ఆయనేనని ఆయనపై ఆధారపడడం. లేఖనం స్థిరంగా చెబుతున్న సాక్ష్యం క్రీస్తునందలి విశ్వాసం ద్వారానే రక్షణ లభిస్తుందని.[2]

ఒక వ్యక్తి ఆయనను నమ్మినప్పుడు, అతడు రక్షింపబడతాడు. అతడు దానిని తన ఫీలింగ్స్ ద్వారా కాక, తొట్రుపడని దేవుని వాక్యం ద్వారా తెలుసుకొనగలడు.

## రిక్త హస్తాలతో రండి

రక్షణ పొందడానికి ఒక వ్యక్తి తనను తాను రక్షించుకునే ఎటువంటి ఆశనైనా విడిచిపెట్టడమే కాక, అతడు లేక ఆమె తన రక్షణ కోసం తనవంతు కృషిగా ఏదైనా చెయ్యాలన్న తలంపును కూడ విస్మరించాలి. చాలామంది కీర్తన రచయితలు ఈ విషయాన్ని చక్కగా చెప్పారు. ఉదాహరణకు టోప్లాడీ రచించిన అత్యుత్తమ శైలిలో వున్న "రాక్ ఆఫ్ ఏజెస్" అనే ఈ గీతాన్ని చూడండి.

నీ ధర్మశాస్త్ర విధులను
నా చేతుల కష్టం నెరవేర్చలేదు
నా ఆసక్తి విరామ మెరుగక,
నా కన్నీళ్ళు నిత్యమూ ప్రవహిస్తూ ఉండినా
పాపమంతటికీ అవి ప్రాయశ్చిత్తం చెల్లించుకోలేవు
నీవు మాత్రమే నీవొక్కడివే నన్ను రక్షించాలి.
నా చేతితో నేనేమి తీసుకొని రాలేదు
కేవలం నీ సిలువనే నేనంటిపెట్టుకొని వున్నాను

దిగంబరినై, వస్త్రాలకోసం నీ దగ్గరకొచ్చాను
నిస్సహాయుడనై కృపకోసం నీ వైపు చూస్తున్నాను
మలినంతో నిండిన నేను ఊటయొద్దకు ఎగిరివస్తున్నాను
ఓ రక్షకా నన్ను కడుగు, లేనిచో నేను మరణిస్తాను.

మన విమోచనా కార్యాన్ని క్రీస్తు సంపూర్తిచేసాడని జేమ్స్ ప్రోక్టర్ మనకి గుర్తుచేస్తున్నాడు:

అలసిపోయి, శ్రమిస్తూ భారము మోయుచున్నవాడా
నీవెందుకలా కష్టపడుతున్నావు?
నీవలా చేయడం మానెయ్; చాలా పూర్వమే
సమస్తమూ పూర్తిచేయబడింది.

సామాన్య విశ్వాసం ద్వారా
యేసుచేసిన పనిని నీవు హత్తుకొనువరకు,
"చేతలు" అనేవి మరణకరమైనవి–
ఆ "చేతలు" ముగిసేది మరణంలోనే.

మరణకరమైన నీ చేతలను క్రిందపడెయ్
క్రీస్తు పాదాల చెంతనే పడవెయ్.
ఆయనలో నిలబడు, ఆయనలోనే నిలబడు,
మహిమకరంగా సంపూర్ణుడవై.

"సమాప్తమైనది," అవును, నిజంగానే,
సమాప్తిచేయబడింది ఒక్క పొల్లయినా పోకుండా;
ఓ పాపీ, ఇదే నీకవసరమైనదంతా,
ఏమంటావ్, అంతే కదా?

## నాల్గవ అధ్యాయం

# నివ్వెరపరచే దేవుని కృప

అద్భుతమైన కృప! దీని గురించి మనం పాడతాం, కానీ దాని అర్థం ఏమిటో మనకు తెలుసా?

మొదటిగా, కృప అంటే ఏమిటి? అది మనపట్ల దేవుని దయగా చెప్పుకోవచ్చు. కానీ అది అంతకన్నా ఎక్కువైనది. అది ఆయన అర్హులు కాని వారికి చూపే దయ. ఇప్పుడు మరొక అడుగు ముందుకు వేద్దాం. ఏ మాత్రం దయను పొందడానికి అర్హతలేనివారికి ఆయన చూపే షరతులు లేని దయ. అది ఆయన లోతును కొలువలేని సముద్రమంత ఉదాత్తమైన క్షమాగుణానికి, సానుభూతికి నిదర్శనం.

కృప, బహుమతి అనే ఈ రెండు పదాలు సన్నిహిత సంబంధం గల బంధువులవంటివి. కృప అనేది బహుమతి కనుక ఆ కారణం చేత దానినెవరూ సంపాదించుకోలేరు లేక అర్హులు కాలేరు. అప్పు పడడం లేక ప్రతిభవంటి భావాలు దాని గురించి నీలో కలిగిన మరునిమిషం నీవు కృపను తొలగించుకొంటున్నావు. దేవుని కృపావరం అతిపెద్దదైన పరిమాణాల్లో ఉంటుంది. దానిని ఏవిధంగానైనా తిరిగి చెల్లించాలనుకొంటే అది అసాధ్యమే అవుతుంది. అది మాటలలో చెప్పలేనిది. ఊహకందనిది.

ఇప్పుడు నిజమైన సువార్త అంటే కేవలం విశ్వాసంతో కృప ద్వారా కలిగిన రక్షణయే![1] కృప అంటే నీవు దానికి అర్హుడివికానిది. విశ్వాసమంటే నీవు దానిని ఖచ్చితమైన నీ స్వేచ్ఛాచిత్తంతో స్వీకరించవలసినది. కృపను అర్థం చేసుకోలేని వారెవ్వరూ సువార్తను నిజంగా ఎప్పటికీ అర్థం చేసుకోలేరు.

దేవుని కృప అద్భుతమైనది. అది పశ్చాత్తాపపడిన ఒక వేశ్యను క్షమించి పవిత్రపరచి నూతన స్త్రీగా మార్చగలదు. అంతేకాదు ఆమెను నిత్యమహిమలో యేసు సహవాసిగా గమ్యాన్ని చేరేటట్టు చేయగలదు. అది చనిపోతున్న ఒక దొంగను, తన ప్రాణాలు పోతున్న చివరి ఘడియలో రక్షించి, ఆ రోజే పరదైసులోనికి కొనిపోగలదు.

కృప పరలోకాన్ని మార్పుచెందిన హంతకులతో, వేశ్యలతో త్రాగుబోతులతో, దొంగలతో, అబద్ధికులతో నింపేస్తుంది. ఏ పాపీ దాని రక్షణార్థమైన శక్తికి అవతల లేదు.

కృప లక్షల కొద్దీ ప్రజలను నాశనకరమైన గుంటలో నుండి, జిగటగల దొంగ ఊబిలోనుండి పైకి లేవనెత్తి వారి పాదాల్ని బండపై నిలిపి, వారి అడుగులను స్థిరపరచింది; వారి నోట క్రొత్త పాటనుంచింది. వారి దేవుడిని మహిమపరచేలా చేసి క్రమంగా వారిని తండ్రి ఇంటిలోనున్న అనేక నివాసస్థలములకు కొనిపోయింది.[2]

ఆక్స్‌ఫర్డ్ మరియు కేంబ్రిడ్జ్ ప్రొఫెసర్ అయిన సి.ఎస్. లూయిస్‌గారు లండన్ అంతటిలోను నిర్లక్ష్యవైఖరితోను, కాలితో తన్నుతూ, అరుస్తూ, పోరాడుతూ మారటానికెలాంటి సుముఖతలేకుండా గాలిలో విసిరిన బాణం లాంటి తనను ప్రభువేవిధంగా తన స్వాధీనంలోనికి తీసుకున్నారో ఆ విషయాన్ని గూర్చి చెబుతూ ఇలా అన్నాడు:

"నిరంతరం కాలితో తన్నుతూ, అయిష్టతతో తన్నుకులాడుతూ, ఏ

> మాత్రం అవకాశం వున్నా అక్కడ్నుంచి తప్పించుకోవాలని గాలిలో విసిరే బాణంలా అన్ని దిక్కులకూ చూస్తూవున్న తప్పిపోయిన కుమారుని వంటి తనకు ఉన్నతమైన తలుపులను తెరచిన ఆ కృపను ఎవరు ఆరాధించకుండా వుండగలరు?"[3]

గీత రచయిత హేలర్డ్ లిల్లెనాస్ యేసు ప్రభుని అద్భుతమైన కృపను గూర్చి "మన అతిక్రమముల విస్తృతి కన్నా విశాలంగా ఉండి, మన పాపం, సిగ్గు కన్నా ఎంతో గొప్పదైనది" అని చెప్పడంలో కీలకమైన విషయం ఎంతో మంచిగా చెప్పారు.

నిజమైన ప్రతి విశ్వాసి తరచుగా క్రింది విధంగా చెప్పడానికి వత్తిడి చేయబడతాడు. "ప్రభువు నాపట్ల ఇంత కృపను ఎందుకు చూపించాడో నాకు తెలియదు. అటువంటి దయకు నేనెంతమాత్రం యోగ్యుణ్ణికాదు. నా కోసం ఆయన చెల్లించిన క్రయధనం ఖచ్చితంగా ఎంతో ఉన్నతమైనది."

కృప మానవ తర్కానికీ, వాదనలకు అతీతమైనదైనా, వాటినది వ్యతిరేకించదు. తర్కం అనేది గొఱ్ఱెలకోసం గొఱ్ఱెలకాపరి చనిపోవడాన్ని నిందితుని కోసం న్యాయాధిపతి మరణించడాన్ని ఒప్పుకోదు. తర్కశాస్త్రం పాపి తన పాపాలకోసం తానే చనిపోవాలని నొక్కిచెబుతుంది. ధర్మశాస్త్రాన్ని భంగపరచినపుడు కలిగే శిక్షను కొనసాగించాలని చెబుతుంది. కానీ కృప మన ఆలోచనకు అందని దానిని చేస్తుంది.

కృప అద్భుతాన్ని యెవరో ఈ విధంగా వర్ణించారు.

> "కృప తాను ఆమోదించగలిగే మంచివారికోసం చూడడం లేదు; మంచితనాన్ని అంగీకరించాలని చూసేది కృప కాదు, న్యాయమే. కృప నిందితులకొరకు, అపరాధులకొరకు, మాట్లాడలేని వారి కొరకు, నిస్సహాయులైన ప్రజలకొరకు–వారిని రక్షించి, పవిత్రపరచి, మహిమపరచాలని చూస్తోంది."

## కృప దయకన్నా గొప్పది

తప్పుచేసిన దుర్మార్గుడి శిక్ష తగ్గించబడినపుడు మనం అతడిపై ఆ న్యాయాధిపతి దయచూపించాడని అనుకొంటాం. మరణశిక్ష కన్నా జైలులో పెట్టడం దయచూపడం అవుతుంది. తప్పు చేసినవాడు తాను పొందతగిన శిక్షను పొందడు.

కృప దానికంటే గొప్పది. అది పాపియైన అపరాధిని వదిలివేస్తుంది. అతనికి నీతిని ఆపాదిస్తుంది. అది ధర్మశాస్త్రం యొక్క నిందించే శబ్దాన్ని అణచివేస్తుంది.

## కృప న్యాయం కన్నా గొప్పది

కృప న్యాయం ఒకదానికొకటి పూర్తిగా విరుద్ధమైనవి. ఒక వ్యక్తి "నేను మంచివాడిని నేను దేనికి పాత్రుడనో అది నాకు కావాలి" అని చెప్పినపుడతడు న్యాయంకోసం అడుగుతున్నాడు. అతడికి తగినది నరకమే. దేవునినెప్పుడూ న్యాయం కోసం అడుగకు.

కృప "నేను అపరాధిని, కానీ క్రీస్తు నా పాపాల కోసం శిక్షను భరించడానికి మరణించాడు. మరియు నేనాయనని ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించాను. నిత్యజీవానికి నేనర్హుడిని కాను కానీ దానిని నేను దేవుని నుండి ఉచిత బహుమతిగా పొందుతున్నాను" అని చెబుతుంది.

యేసు న్యాయానికి, కృపకు మధ్యగల తేడాను తెలియజేసే ఉపమానాన్ని చెప్పారు.[4] తన ద్రాక్షతోటలో పనిచేయడానికి పనివారి అవసరం వున్న వ్యవసాయకుడు ఒకరు వున్నారు. ఉదయాన్నే కొందరు పనివారు వచ్చి ఆ దినమంతా ఒక దేనారము చొప్పున పనిచేయడానికి ఒప్పుకున్నారు. వారతనితో ఈ విధంగా ఖచ్చితమైన ఒప్పందాన్ని చేసుకున్నారు. మధ్యాహ్నంవేళ అతడు మరికొందరిని అదే ఒప్పందంతో

పనిలో కుదుర్చుకున్నాడు. సాయంకాలం మొదటవచ్చిన వారికి దేనారం చొప్పున ఇవ్వబడింది. మిగిలిన వారికికూడా అదే సొమ్ము ఇవ్వబడింది. కానీ ఒక గంటపనికి అది ఎక్కువే! మొదటి పనివారికి న్యాయం జరిగింది మిగిలినవారికి కృప దొరికింది. కృప న్యాయం కన్నా గొప్పది.

## కృప ధర్మశాస్త్రాన్ని మించిన గొప్ప సూత్రం

ఒక వ్యక్తి నీతిగల జీవితాన్ని పొందడానికేమి చేయాలో ధర్మశాస్త్రం చెబుతుంది. కృప దేవుని ఎదుట అతనికి నీతిగల స్థానాన్నిస్తుంది, దానికి తగినట్లుగా నడుచుకోమని చెబుతుంది.

ధర్మశాస్త్రం "అలాచేస్తే నీవు బ్రతుకుతావని" చెబుతుంది. కృప "నీవు బ్రతికితే అలా చేస్తావని" చెబుతుంది.

ధర్మశాస్త్రం "ప్రయత్నించి విధేయత చూపు" అని చెబుతుంది. కానీ కృపయొక్క భాష "నమ్ము, విధేయత చూపు" అనేది.

ధర్మశాస్త్రం నీవేం చేయాలో చెబుతుంది కానీ, అలా చేయడానికి శక్తినివ్వదు. నీవలా చేయకపోతే నిన్నది శపిస్తుంది. కృప ఏం చేయాలో చెబుతుంది, అలా చేయడానికి శక్తినిస్తుంది, అలా చేసినందుకు ప్రతిఫలాన్నిస్తుంది.

ధర్మశాస్త్రం ఉత్తమమైనదానిని నిందిస్తుంది ఎందుకంటే ఎంతో ఉత్తమమైనది కూడా పది ఆజ్ఞలను పాటించలేదు. కృప ఎంతో చెడ్డవారిని కూడా నింద, నేరారోపణ లేకుండా చేస్తుంది.

ధర్మశాస్త్రం పాపాన్ని వెల్లడి చేస్తుంది. కృప పాపాన్ని తీసివేస్తుంది. ధర్మశాస్త్రం ఆత్మస్తుతిని ప్రోత్సహిస్తుంది. కృప ఆత్మస్తుతిని బయటకు పంపుతుంది.

ధర్మశాస్త్రం "నీవిది చేయాలి....నీవది చేయాలి....నీవిది చేయకూడదు" అని చెబుతుంది. కృప "నీవు చేయాలి... నీవు తప్పక చేయాలి"[5] అని చెబుతుంది. ఒకటి నేనేం చేయాలో చెబుతుంది. మరొకటి నా నూతన స్వభావం ఏం కోరుతుందో దానిని చేయమని చెబుతుంది.

ధర్మశాస్త్రం క్రింద పని ఎప్పుడూ ముగియదు. అయితే కృప "పూర్తి చేసిన పనిని" గూర్చి చెబుతుంది. చట్టం "నీవు ప్రేమించాలని అధికారపూర్వకంగా చెబుతుంది. కృప "దేవుడెంతో ప్రేమించాడని ..." ప్రకటన చేస్తుంది. ధర్మశాస్త్రం ప్రజలపై భారమైన బరువుల్ని పెడుతుంది. కృప పెట్టే బరువులు వెలుగే! ధర్మశాస్త్రం బానిసత్వ వ్యవస్థ అయితే కృప స్వేచ్ఛకు ప్రతీకగా వుంది. వత్తిడికి, సౌకర్యానికి మధ్యగల తేడా ఇదే!

ధర్మశాస్త్రంలో దయలేదు. అది స్నేహభావంలేని కఠిన వ్యవస్థ. కృప దయ చూపుటయందు ఐశ్వర్యవంతుడైన దేవుని గూర్చి చెబుతుంది.

ఐదవ అధ్యాయం

# కృపను ఎలా ప్రశంసించాలి

అతడు లేక ఆమె నాలుగు గొప్ప నిజాలను గుర్తించేవరకూ ఎవరూ ఎన్నడూ కృపను ప్రశంసించలేరు ఆ నిజాలు: యేసు ఎవరు? ఆయన ఏం చేసారు. ఎవరికోసం దానిని చేశారు; మరియు స్వీకరించినవానికి దాని అర్థం ఏమనిపిస్తుంది.

## యేసు ఎవరు

ఆయన కేవలం మనలాంటి మానవుడు కాదు, కానీ...

విశ్వాన్ని చెప్పశక్యం కాని అద్భుతాలతో నింపిన శక్తిమంతుడైన దేవుడు.

వందలకొద్దీ భాగాలను మన శరీరంలో నిర్మించి, మన మనసులో జ్ఞానాన్ని పెట్టిన సృష్టికర్త. ఆయన ద్వారా సమస్తమును ఉనికినిపొంది, మనగలుగుతున్నాయి.

సర్వశక్తి, సర్వజ్ఞానము గల సార్వభౌముడాయనే! ఒకే సమయంలో అన్ని చోట్లా వుండగల సర్వాంతర్యామి ఆయనే!

పాపమనేది అయన స్వభావానికి పూర్తిగా విరుద్ధమైనది. ఆయన పరిశుద్ధుడు.

నిత్యత్వమంతటి నుండి కోరబడుతున్న సమస్తంలో అంటే మహిమ, ఘనత, సార్వభౌమాధికారాలలో ఆయన ఐశ్వర్యవంతుడు. ఆయన సన్నిధిలో దేవదూతలు తమ ముఖాన్ని కప్పుకుంటాయి. ఆయన తనచేతి హస్తంలో నీటిని పట్టుకుంటాడు. భూమిని జానతో కొలుస్తాడు. నేలమట్టిని కొలిచి, లెక్కిస్తాడు. త్రాసుతో పర్వతాలను తూచగలడు. తూనిక చేత కొండలను తూచినవాడు ఆయనే!1 అటువంటి గొప్పదేవుడు మనపట్ల ఆసక్తి కలిగివుండడానికి మనకెలాంటి అర్హత లేదు.

## ఆయన ఏం చేశారు

మనమెలాంటి వారమో, ఎలా వుంటామో దాని గూర్చి పరిపూర్ణ జ్ఞానంతో నిండి, ఎటువంటి కారణం లేకుండానే ఆయన మనల్ని ప్రేమించాడు.

వేలకొలది పరిశుద్ధదూతల ఆరాధనకు కేంద్రబిందువుగానున్న ప్రభువు దుర్వాసనతో నిండివున్న పశువులపాకలో జన్మించడానికి పరలోక మహిమలను విడిచిపెట్టాడు. "ప్రకాశించే నక్షత్రాలతో నిండిన ఆకాశాలను సృజించినవాడు పశులతొట్టెలో పరుండియున్నాడు."

పశువుల పేడ, బురద, మురికితో నిండిన మానవజాతిలోనికి దిగి రావడం ద్వారా ఆయన తాను సృష్టించిన వారి నుండి అన్ని రకాల తిరస్కారాల్ని సహించాడు. దేవుని కుమారుడు తన ముఖాన్ని మురికితో నిండిన మానవుల ఉమ్మితో కప్పబడడానికి అంగీకరించడాన్ని ఊహించండి. త్రాగుబోతుల నోట్లో పాటగా మారిన ఆయనను గురించి ఆలోచించండి.

ఎవరూ ఎన్నడూ శ్రమపడనంతగా ఆయన శ్రమపడ్డాడు. గాయపరచబడ్డాడు; దెబ్బల్ని పొందాడు; పొడువబడ్డాడు. ఆయన వీపు దున్నబడిన పొలంలా కన్పించేటంతగా ఆయన కొరడాలతో కొట్టబడ్డాడు. ఆయన ముఖరూపం గుర్తుపట్టలేనంతగా గాయాలను పొందింది. ఆయన

హింసకులు ఆయన చెంపలనుండి వెంట్రుకల్ని లాగారు. ఆయన ఎముకల్ని కీళ్ళనుండి ఒక్క ఉదుటున సడలింపబడ్డాయి. గ్రాహం కెండ్రిక్ వ్రాసినట్లుగా "అంతరిక్షంలో నక్షత్రాలను వెదజల్లిన హస్తాలు క్రూరమైన మేకులకు అప్పగించబడ్డాయి."

వీటన్నిటితో పోలిస్తే, తన తండ్రిచేత విడిచి పెట్టబడడం దేవుని కుమారునికెలా అన్పించిందో! ఇదే ఆయనకు పై వాటన్నిటికన్నా ఎక్కువ బాధను కల్గించి ఉంటుంది. ఎందుకంటే, ఆయన ప్రార్థించినపుడు పరలోకం నిశ్శబ్దం వహించింది. ఒక విధంగా చూస్తే, దేవుడు మన పాప ఋణాన్ని తన ప్రియ కుమారునిపై మోపడం ప్రభువైన యేసు ఆ ఋణాన్ని పూర్తిగా చెల్లించేటంతవరకూ ఆయన తన ఉగ్రతా ప్రవాహాన్ని ఆయనపై కుమ్మరించడం మనమెప్పటికీ అర్థంచేసుకోలేము.

ఆయన ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా, ఇతరులు చేసిన పాపాలకు శిక్షను చెల్లించి వారికి ప్రత్యామ్నాయంగా తాను మరణించాడు. "పురాతనమైన, మోటైన, కఠినమైన సిలువపై నశించిపోయే పాపులతో నిండిన లోకం కొరకు అత్యంత ప్రియమైన శ్రేష్ఠుడు చంపబడ్డాడు."

అద్భుతాల్లో అద్భుతం! గొప్ప ఆశ్చర్యం!
ప్రకాశించే నక్షత్రాలను ఆకాశంలో నిర్మించినవాడు
నా కోసం రక్తం కార్చి, మరణించడం కన్నా
మిన్న అయిన అద్భుతమేదైనా ఉంటుందా?
అత్యద్భుతమైన, ఆశ్చర్యచకితుల్ని చేసే త్యాగం
మన ఆలోచననంతటినీ గజిబిజి చేస్తున్నది
అతిపెద్ద ఆశ్చర్యభరితమైన వెలను చెల్లించి,
మనకు విమోచనము తెచ్చింది.

–రచయిత తెలియదు

జె. ఆస్వాల్డ్ సేండర్స్ గారు ఇలా వ్రాశారు:

> "అన్నికాలాలలో వున్న సూక్ష్మబుద్ధిగల జ్ఞానులు సిలువపై క్రీస్తు మరణాన్ని గురించిన అంతరార్థాన్ని లోతుగా కొలవడంలో విఫలులై తమ ప్రయత్నాలను విరమించుకుంటూ పౌలు వలె, వారు కూడా ఇలా పలికారు: "ఆహా, దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరము; ఆయన తీర్పులు శోధింపనెంతో అశక్యములు; ఆయన మార్గములెంతో అగమ్యములు" (రోమా 11:33).

హెరాల్డ్ సెయింట్ జాన్ క్రీస్తు సిలువలో చూపబడిన దేవుని కృప మన శ్వాసను తీసేసి, జీవితంలో ఎంతో గొప్ప విషయం అయ్యే వరకూ అది మనకు కొంచెం కూడా అర్థంకాదని చెప్పాడు.

ఇదిగో ఆ అద్భుతాన్ని చూడండి అంటూ స్పర్జన్ మనల్ని ఆహ్వానిస్తున్నాడు:

> "యేసు మన తరపున మరణశిక్షను భరించాడు. అదిగో అక్కడ ఆయన సిలువపై వ్రేలాడుతున్నాడు! మీరెన్నడూ చూడని మహాగొప్ప దృశ్యం ఇది: దేవుని కుమారుడు, మనుష్య కుమారుడు! అక్కడ ఆయన న్యాయవంతునిగా వుండి అన్యాయస్థులకోసం -వారిని దేవుని యొద్దకు తీసుకొని రావడానికి చెప్పశక్యం కాని బాధను భరిస్తూ వ్రేలాడుతున్నాడు.
>
> ఆహా, ఆ దృశ్యం ఎంత మహిమాన్వితం! నిర్దోషి శ్రమపడుతున్నాడు! పరిశుద్ధుడు నిందితునిగా యెంచబడ్డాడు. నిరంతర ఆశీర్వాదమైనవాడు శాపగ్రస్తుడయ్యాడు! అనంతమైన మహిమగల వాడు అవమానకరమైన మరణాన్ని పొందాడు.[2]

రక్షకుని పట్ల, ఇంత క్రూరంగా వ్యవహరించడం తగదు. ఆయన చెల్లించిన ఆశ్చర్యాన్నిగొలిపే అతిపెద్ద వెలకు మనం అర్హులం కాము. అది చాలా

ఎక్కువ. దీనిని మనం పూర్తిగా గ్రహిస్తే "మన హృదయాల్ని కృతజ్ఞతతో కరిగించి మన కన్నులను కన్నీటి ధారలతో నింపుకుంటాము."

పూర్ణహృదయాలిక్కడ కేవలం విలపించలవు
దివ్యమైన కృపా లోతులలో మునిగిపోయినవై

ఆయన మరణంతో కథ ముగిసిపోలేదు. మూడు దినాల తరువాత ఆయన మృతులలో నుండి లేచాడు. ఆయన లేచివుండక పోతే ఆయన మరణానికి, ఇతరుల మరణానికి ఎటువంటి తేడా వుండేది కాదు. కానీ ఆయన మరణం భిన్నమైనది. ఇక ఎన్నడూ మరణించకుండా ఉండేలా ఆయన మృతులలో నుండి ఆదిసంభూతునిగా లేచాడు. మహిమ గల దేహంతో లేచిన మొదటి వ్యక్తి ఆయనే! ఆయన పునరుత్థానం ఆయన శక్తి గలిగిన దేవుని కుమారునిగా ఋజువుచేసింది. సిలువపై ఆయన చేసిన కార్యంతో దేవుడు పూర్తిగా సంతృప్తిచెందాడని చెప్పడానికి ఋజువదే! ఆయన యందు విశ్వసించిన వారందరూ, ఆయన పునరుత్థాన శరీరాన్ని పోలిన మహిమగల దేహంతో మృతులలోనుండి లేస్తారు.

## ఇదంతా ఆయన ఎవరికోసం చేశాడు

మనం దుష్టులైన పాపులం, కృతజ్ఞతలేని దౌర్భాగ్యులం; ఎన్నికలేని పురుగులవంటివారు. మనం నశించిపోయిన వారం, నిస్సహాయులం, ఆశలేనివారం, మనం నరకానికే అర్హులం. మనగురించి ప్రియమైనదేదీ లేదు. మనం ప్రభువుతో ఎటువంటి సంబంధం పెట్టుకోము. దేవ సంబంధమైన ఎలాంటి సర్వాధికార నియంత మన జీవితాలను నడిపించనక్కర్లేదు.

మనమెంత శ్రేష్టంగా ఉన్నామనుకున్నా, మన నీతి మురికి గుడ్డల వలె వుంది. మన చెడుతనమెలాంటిదంటే, మన దేవునిని కూడా చంపేటటువంటిది. "హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి గలది." అని చెప్పడంలో ప్రవక్త (యిర్మీయా) సరియైన

విధంగా చెప్పాడు.[3] దాని భ్రష్టత్వము యొక్క లోతును గ్రహించగల వారెవరూ లేరు.

ఇక్కడ మనం కొంచెం ఆగి, మనల్ని మనం చూసుకొనే విధానానికి, మనల్ని దేవుడు చూసే విధానానికి మధ్యగల తేడాను గుర్తించాలి. చాలామందికి దయతో కూడిన స్నేహశీల స్వభావం ఉండొచ్చు. వారు మంచి పొరుగువారిగా, క్రమంగా చర్చికి వెళ్ళే వారుగా ఉండొచ్చు. వారు బీదల దగ్గరకు వెళ్తూ వుండొచ్చు. అటువంటి వారు నీకు తెలిసేవుండొచ్చు. నీవు కూడా అట్టివారిలో ఒకరివైవుండొచ్చు-నీవు చట్టానికి లోబడిన పౌరునిగా, చక్కని స్నేహశీలిగా బాహ్యంగా ఎంతో గౌరవింపదగిన వ్యక్తిగా కనపడవచ్చు.

కానీ మనమెన్నడూ దేవుని ప్రమాణము పరిపూర్ణమైనదని మరచిపోకూడదు. మనమందరం ఆ ప్రమాణ స్థాయిని అందుకోలేనంత స్థితిలోవున్నాము.[4] మనలో ఏ ఒక్కరం పాపం చేయకుండా లేము. మనలో ఎవరికి మన ఆలోచనా జీవితం బయటికి తెలియడం ఇష్టంలేదు.

మనం పది ఆజ్ఞలన్నిటనీ అనుసరించి, వాటిని భంగపరచకపోయినా, మనమావిధంగా చేయడానికి సమర్థులం. మనం ఎప్పుడైనా చేసినదానికన్నా మనమెలాంటి వారమో అది చాలా చెడ్డది. కొందరు ఇతరులకన్నా మంచిగా వుండొచ్చు. కానీ! దేవుడు మన అందరినీ ప్రమాదాలలో వున్న నిర్భాగ్యపు పాపుల్లా చూస్తున్నాడు. అంతేకాదు మనకి రక్షణ పొందే అవసరం అత్యవసరమని చెబుతున్నాడు.

మనం పాపములలో, అపరాధములలో చనిపోయియున్నాము. మనం సాతానుచే నడిపించబడిన ఈ లోకపు ప్రవర్తానా పద్ధతి ప్రకారం నడుచుకొన్నాము. మనం మన శారీరక, మానసిక దురాశలననుసరించి నడచుకొంటూ అవిధేయులైన పిల్లలలా వున్నాము. స్వభావసిద్ధంగా క్రీస్తులేని దేవుడులేని ఎలాంటి ఆశ లేని ఉగ్రతాపిల్లల్లా వున్నాము.[5]

ఎవరికోసం క్రీస్తు మరణించాడో అటువంటి ప్రజల్లా మనమున్నాము. ఇక్కడ మనమెక్కువ గుర్తించాల్సిన విషయమేమిటంటే మనం చాలా తక్కువ వారంగా, తేలికగా ఉన్నాము. 10,000 అడుగుల ఎత్తునుండి దూరంగా చూస్తే మనమసలు కనపడం, కొన్ని బిలియన్‌ల కాంతి సంవత్సరాలకు దూరంగా చూస్తే మనమింకా అతిచిన్నగా అణువుల్లా కన్పిస్తాము. అయినా ఆయన మనల్ని ప్రేమిస్తున్నాడు. వెర్నోన్ సి. గ్రాండ్స్ క్రింది విషయంతో ఏకీభవిస్తున్నాడు:

> ఎటువంటి ప్రాముఖ్యతాలేని భూగోళాన్ని చూస్తే, నమ్మలేని విషయమేమిటంటే, విశాల విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త మానవ కుటుంబానికేమి జరుగుతుందోనని శ్రద్ధవహించడం-సూర్య వ్యవస్థలో సూర్యుని చుట్టూ తిరుగుతున్న కంటికి కనపడని భూగోళం, చర్మంపై గల అస్పష్టమైన దద్దుర్లను గుర్తించడం వంటిదని నమ్మకంలేని వ్యక్తి వర్ణించాడు.

దానికి గ్రౌండ్స్ కొద్దిగా కలిపి "అత్యాశ్చర్యకరమైన విషయమేమిటంటే దేవుడు శ్రద్ధ వహిస్తాడు" అనేదే! [6]

ఎవడైననూ సిలువదగ్గరకొచ్చి డి.టి. నైల్స్ గారి మాటల్లో "నేనది ఆయనకు చేశాను. ఆయన అది నా కోసమే చేశాడు" అని చెబితేనే తప్ప క్రీస్తు కృపను ఎవరూ ప్రశంసించలేరు. [7]

## విశ్వాసికి కృప ఏమనిపిస్తుంది

విశ్వాసులకు కృప తాను వాస్తవానికి చేసిన దానికన్నా తక్కువైనదే చేసి ఉండొచ్చు. ఉదాహరణకు, వయస్సు పెరగడం వల్ల కలిగే లోపాలు లేకుండా భూమిమీద వారికి అంతంలేని జీవితాన్ని యిచ్చి వుండొచ్చు. అదే మహా అద్భుతంగా వుండి వుండేది. అది స్త్రీ, పురుషులను నిత్యం మండే అగ్ని నుండి రక్షించి వుండొచ్చును. అదింకా ఎంతో అద్భుతంగా ఉండేదేమో!

కానీ దేవుడు ఏదో సగం కొలతతో తృప్తిచెందలేదు. తన కుమారుడినే బలిగా అర్పించడం ద్వారా తనకున్న శ్రేష్టమైనది ఇచ్చినవానిగా, తన మనసు ఊహించగల ఐశ్వర్యవంతమైన స్వాస్థ్యాన్ని బిగపట్టకూడదని ఆయన నిర్ణయించుకున్నాడు. ఇక్కడ కృపాసువార్తలో అంతర్భాగంగా ఉన్న కొన్ని ప్రయోజనాలున్నాయి:

**సంతోషము:** ఇది పరిస్థితులతో నిమిత్తం లేకుండా వున్న అసాధారణమైన అనందంతో కూడిన ఉద్వేగము. దీనికి వ్యతిరేకమైనది పాపం కాదు గాని విచారమే! ఇది దేవునితో గల సంబంధం నుండి ప్రభువైన యేసు నుండి ఉత్పన్నమవుతుంది. కాబట్టి ఇది ఆ సంబంధమెంత స్థిరమైనదో అంతే స్థిరంగా ఉంటుంది.

**సమాధానము:** ఎవరైతే విశ్వాసం ద్వారా నిందారహితులుగా తీర్చబడతారో వారే దేవునితో సమాధానాన్ని అనుభవిస్తారు. వారెప్పుడైతే సమర్పణా పతాకాన్ని ఎగురవేశారో, అప్పుడే సర్వశక్తిమంతునితో వారికి గల పోరాటం ముగిసిపోయింది. అప్పుడు స్వచ్ఛత, ప్రశాంతత, సమతుల్యతతో కూడిన మరో ప్రపంచం నిన్ను వెంబడిస్తుంది.

**నిరీక్షణ:** క్రొత్త నిబంధనలో "నిరీక్షణ" సాధారణంగా పరలోకంలోని విశ్వాసి భవిష్యత్‌కు సంబంధించినదిగా చెప్పబడింది. మనం సాధారణంగా తీసుకొనే అర్థంలో కాక, ఈ నిరీక్షణలో కొంచెం కూడా సందేహముండదు. ఎందుకంటే ఇది దేవుని వాగ్దానంపై ఆధారపడి ఉంది. విశ్వాసి ఇప్పుడే తాను పరలోకంలో ఉన్నంత నిశ్చయతను కలిగిఉంటాడు.

**విశ్రాంతి:** యేసు "నా యొద్దకు రండి...నేను మీకు విశ్రాంతిని కలుగచేతును" అని చెప్పినపుడు ఆయన ఆ విశ్రాంతిని రక్షణకు సంబంధించినదిగా చెబుతున్నాడు. ఒక వ్యక్తి నిత్యజీవం కోసం పనిచేయడాన్ని ఆపివేసి, క్రీస్తు పూర్తిచేసిన పనిపై విశ్రాంతి తీసుకొన్నపుడు వచ్చే విశ్రాంతి అదే! కానీ యేసు

మరొక విశ్రాంతిని గురించి కూడా చెప్పాడు. "...మీ మీద నా కాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి. అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును". ఈ విశ్రాంతి ప్రభువుని సేవించడంలోను, ఆయన చూపిన సాత్వికాన్ని దీనమనస్సును వెంబడించడంలోను దొరుకుతుంది.

**స్వతంత్రత/స్వేచ్ఛ:** సత్యము ప్రజలను స్వతంత్రులనుగా చేస్తుంది. ఈ స్వేచ్ఛ శరీరసంబంధమైన కోర్కెల్ని స్వేచ్ఛగా అనుభవించేది కాదు కానీ నీతిగా జీవించడానికి, దేవునిని సంతోషపెట్టడానికి, ఆయనను సేవించడానికి గల స్వేచ్ఛ. క్రైస్తవుడు ధర్మశాస్త్ర దాస్యం నుండి, పాపపు ఆధిపత్యం నుండి విడిపించబడ్డాడు. కానీ అతడు ధర్మశాస్త్రంలేని వాడు కాదు కానీ క్రీస్తు పట్ల ప్రేమతో బంధితుడైనవాడు.

**జీవితంలో లక్ష్యం:** ఒక వ్యక్తి తిరిగి జన్మించేవరకూ తన జీవితానికి నిజమైన అర్థాన్ని కనుగొనలేడు. అప్పుడే జీవితం అతడికి అర్థమవుతుంది. చివరికి అతడు తాను ఎవరికోసం జీవించాలో ఎవరికోసం చనిపోవాలో కనుగొంటాడు. చివరికి అతడు దేవునికుమారునికి పూర్తిగా సమర్పించుకోవడంలో సంతృప్తిని కనుగొంటాడు. ఇప్పుడతనికి పూర్వం నుంచి సృష్టి గురించి, పాపముండడాన్ని గురించి, మరణమనే సత్యాన్ని గురించి జవాబులు చెప్పగల పాండిత్యం గల జీవితం వుంది.

**సంతృప్తి:** ఒక విశ్వాసి ఎప్పుడూ తాను సాధించిన విజయాలనుబట్టి గానీ తనను గురించి గానీ సంతృప్తిచెందదు కానీ అతడు క్రీస్తుతోనే సంతృప్తి చెందుతాడు. ఈ విషయాన్ని డి. మార్టిన్ లాయిడ్ జోన్స్ ఇలా చెప్పారు. "ఆయన కన్నా నన్ను తృప్తిపరచేదేది నా హృదయం కోరుకోలేదు."[8]

కృప దీనినంతటినీ అనుగ్రహిస్తుంది. కానీ ఇంకా ఎక్కువైన దానిని, మరింత ఎక్కువైన దానిని ఇస్తుంది. పాపులు ప్రభువైన యేసును స్వీకరించిన మరుక్షణం వారు:

**నిత్యజీవాన్ని స్వీకరించినవారు:**[9] అమూల్యమైన ఈ బహుమానం స్వయాన

క్రీస్తు యొక్క జీవమే, రక్షకుడు మనకు వాగ్దానం చేసిన సమృద్ధియైన జీవమే.[10] రక్షణ పొందనివారు కూడా అంతంలేని జీవితాన్ని పొందుతారు, కానీ విశ్వాసులు మాత్రమే మహిమా నిరీక్షణ అయిన క్రీస్తును వారిలో కలిగుంటారు.[11] భౌతిక జీవితం పుట్టుకతో వస్తుంది అది చావుకు లోనైనది. నిత్యజీవం నూతన జన్మ ద్వారా వస్తుంది, అది మరణం లేనిది. నిత్యజీవం అంటే దేవునితో ఐక్యపరచబడటమే. ఆశ్చర్యంగా ఉంది కదూ!

**క్షమించబడతాము:**[12] కృపయొక్క అద్భుతం ద్వారా దేవుడు పాపాలను క్షమించి, వాటిని తూర్పునుండి పడమరకు తొలగించి, వాటిని మళ్ళీ ఎన్నటికీ జ్ఞాపకానికి తెచ్చుకోడు. శిక్షార్హులకు వ్యతిరేకంగా మోపబడిన నేరాలన్నీ సిలువలో మేకులతో కొట్టబడ్డాయి.[13] అవి వెళ్ళిపోయాయి. అందువలనే సామ్యూల్ డబ్ల్యు గేండీ ఇలా వ్రాయగలిగారు:

> నేను చేసిన చెడ్డవాటిని గురించి
> నేరారోపకుడు గర్జించడం నేను విన్నాను;
> అవన్నీ నాకు తెలుసు, ఇంకా వేలకొద్దీ తెలుసు;
> అయితేనేం, యెహోవాకు ఒక్కపాపమూ దొరకలేదు.

**విమోచింపబడతాము:**[14] పాపపు బజారులో బానిసలుగా వున్న ప్రజలు క్రీస్తు చెల్లించిన ప్రశస్తమైన రక్తం ద్వారా వెనక్కి తేబడ్డారని అర్థం. ఏ కొనుగోలు కూడా అంత ఖరీదైనది కాదు. మనసును అంతగా ఆశ్చర్యపరిచే పరస్పర మార్పిడి మరొకటి లేదు. ఇది ఎంత గొప్ప మార్పిడి! ఒక వ్యక్తికి అంతమంది ప్రజలు అంత ఎక్కువగా ఎప్పుడూ ఋణపడిలేరు.

**రక్షించబడ్డాము:**[15] విశ్వాసులు నరకంలో నిత్యశిక్షనుండి విడిపించబడడమే కాదు; వారు ప్రస్తుతపు దుష్టలోకపు వ్యవస్థనుండి రక్షించబడి, దేవుని పరలోక రాజ్యానికి భద్రం చేయబడ్డారు. వారు మొదట నమ్మినపుడు, పాపపు శిక్షనుండి వారు రక్షింపబడ్డారు. వారు పాపపుశక్తి నుండి

పరలోకంలో క్రీస్తు ప్రభుని ప్రస్తుత పరిచర్యద్వారా రక్షింపబడతారు. వారు తమ నిత్యగృహాన్ని చేరుకున్నపుడు దుష్టుల లోకంనుండి రక్షింపబడతారు.

**ప్రియునియందు అంగీకరింపబడ్డారు:**[16] దేవుడిప్పుడు క్రీస్తునందు విశ్వసించిన బిడ్డను చూస్తున్నాడు. దానిని బట్టే ఆ బిడ్డను స్త్రీ అయినా, పురుషుడైనా అంగీకరిస్తున్నాడు. క్రీస్తునందున్న వారెవరైనా దేవుని యెదుట ఆయన ప్రియకుమారుని అంగీకారత్వంతో నిలుస్తాడు. ప్రభువైన యేసులో, అతడు యేసు తండ్రికి ఎంత దగ్గర ఉంటాడో, అంతే దగ్గరగా వుంటాడు. ఇక్కడ అతడెవరో అనేది ముఖ్యం కాదు కానీ క్రీస్తులో అతడి ఐక్యతే ముఖ్యం. ఒక వ్యక్తి చేయదగిన పనినిబట్టి కాదు క్రీస్తు చేసిన "పూర్తి చేసిన పని"పై అతడి స్థానం ఆధారపడి ఉంది.

**క్రీస్తులో సంపూర్ణత:**[17] రక్షకుడిని విశ్వసించిన వ్యక్తి పరలోకానికి పూర్తిగా అర్హుడు అనే మాట నమ్మలేనిదిగా అనిపించినా అది పూర్తిగా సత్యం. దీనికి కారణం క్రీస్తే అతడి అర్హత. ఒక వ్యక్తి యేసును కలిగుంటే, తండ్రియింటికి వెళ్ళడానికి అతనికి ఏ ఇతరమైన అర్హత అవసరం లేదు. విశ్వాసి యేసుని ప్రతిభపై ఆధారపడి వుంటాడు. తన ప్రతిభపై కాదు. 1-10 స్కేలుపై అతడు 10 నంబర్‌పై ఉన్నాడు.

**క్రీస్తు ప్రేమించబడినట్టే ప్రేమించబడుట:**[18] నిజమైన క్రైస్తవుడు క్రీస్తు ప్రభువు దేవునికి ఎంతదగ్గరగా ఉన్నాడో అంత సన్నిహితుడే కాక, అతడు దేవునికి ప్రియమైనవాడిగాను ఉంటాడు. తండ్రి తన కుమారుని ఎట్టి ప్రేమతో ప్రేమిస్తున్నాడో, అదే ప్రేమతో అతడిని ప్రేమిస్తున్నాడు. కాబట్టి, దేవుడు తన స్వంత ప్రజల్ని తాను ప్రేమించినంతకన్నా ఎక్కువ ప్రేమించలేదని చెప్పడంలో అతిశయోక్తిగా మనం చెప్పడం లేదు. ఈ అద్భుతమైన సత్యము ఎక్కువగా తెలియవలసిన, నమ్మవలసిన, ఆనందించవలసిన అర్హతను కలిగుంది.

**నీతిమంతునిగా తీర్చబడుట:**[19] పశ్చాత్తాపం చెందని ఒక పాపి తన తీర్పరి యైన దేవుని యెదుట నిలబడినప్పుడు, అక్కడ ఒకే ఒక తీర్పు నిర్ణయం ఉంది- అది అతడు దోషి అని. కాని పశ్చాత్తాపపడిన విశ్వాసి బోనులో వున్నప్పుడు కనపడే దృశ్యం వేరుగా వుంటుంది. దేవుడే న్యాయాధిపతి కానీ యేసు ముద్దాయి తరపున వాదించే న్యాయవాదిగా వుంటాడు. నేరాలు మోపబడినపుడు, క్రీస్తు ముందుకు వచ్చి "యువరానర్, నా క్లయింట్ నేరస్థుడే" అని చెప్పి, తన చేతులు, కాళ్ళు, ప్రక్కలోని గాయాల ను చూపిస్తూ "కానీ అతడి నేరాలకు కలువరి సిలువలో నేను వెల చెల్లించాను. అతని తరపున నేను చేసిన ప్రత్యామ్నాయపు పని యొక్క అర్హతను మన్నించవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాను" అని చెబుతాడు.

న్యాయమూర్తి సంతృప్తిగా తల ఊపుతాడు. "నేరం మోపబడిన వ్యక్తిని నిర్దోషిగా విడుదల చేయడమైనది. అతడిని నీతిమంతునిగా తీర్పు తీరుస్తున్నాను. నరకానికి పంపడానికి అతడిలో ఏ దోషాన్ని నేను కనుగొనలేక పోతున్నాను గనుక "కేసు కొట్టివేస్తున్నాను" అని న్యాయమూర్తి తన తీర్పును వెలువరిస్తాడు.

హృదయాన్ని ఉత్తేజపరిచే ఈ సత్యమే డబ్ల్యు. నోయెల్ టామ్‌కిన్స్‌కు సవాలును విసిరే ధైర్యాన్నిచ్చింది.

దేవుని అత్యంత గౌరవనీయమైన స్థానం నుండి
మొదట ధన్యుడైన నా రక్షకుని చేరనివ్వు;
యేసులో ఒక్క పాపపు మచ్చ వుందేమో ఋజువుచెయ్
అప్పుడు నాకు "నేను అపవిత్రుడనని" చెప్పు

ఓ సెలవురోజు రోల్స్‌రాయ్ కారును డ్రైవ్ చేసుకొంటూ ఫ్రాన్సు వెళ్ళిన ఒక ఇంగ్లీషు వ్యక్తి గురించి రాయ్ హెసన్ ఇలా చెప్పారు. దురదృష్టవశాత్తూ, ఒక రోజాయన గతుకుల రోడ్డుపైనుండి వెళ్ళడం జరిగింది; అతడి కారు వెనుక చక్రాలకు బిగించిన ఇరుసు విరిగిపోయింది. స్థానిక మోటారు

వాహనాల్ని మరమ్మత్తు చేసేవారు దానిని వేరే ఇరుసుతో మరమ్మత్తు చేయలేకపోయారు. కానీ ఇంగ్లండులోని దాని తయారుదారుకు చేసిన ఫోన్‌కాల్ ఫలితంగా ఇద్దరు కార్మికులు క్రొత్త ఇరుసును తెచ్చి బిగించడానికి వచ్చారు. నెలల తరువాత ఎలాంటి బిల్లూ రాకపోవడంతో, ఆ ఇంగ్లీషు వ్యక్తి రోల్స్‌రాయిస్‌కి జరిగిన సంఘటనను గుర్తుచేస్తూ, బిల్లు పంపించమని ఉత్తరం వ్రాశాడు. దానికా కంపెనీ ఈ విధంగా జవాబు వ్రాసింది. "మేము మా రికార్డులన్నీ జాగ్రత్తగా తిరగేశాం, కానీ విరిగిన ఇరుసుగల రోల్స్‌రాయిస్ గురించిన రికార్డును కనుగొనలేకపోయాం". క్రీస్తునందు విశ్వాసికి కూడా అదేవిధంగా ఉంటుంది. దేవుడు తన రికార్డులను జాగ్రత్తగా వెతికినా, ఆ విశ్వాసికి సంబంధించిన పాపాన్ని గురించి ఎటువంటి విషయం నమోదు చేయబడడం కనుగొనలేదు. ముఖ్యంగా నేరం, శిక్షలకు సంబంధించినవి కనుగొనలేదు.

**పరిశుద్ధపరచబడుట:**[20]దేవుడు విశ్వాసులను పాపానికి దూరంగా తనదైన ప్రపంచానికి చెందినవానిగా నిలపడమనే సత్యాన్ని గూర్చిన వివరణ అనేది ఒక సైద్ధాంతిక అద్భుతం. వారు రక్షించబడగానే వారు ఒక స్థానంలో (హోదాలో) పవిత్రపరచబడతారు. ఆ స్థానంలో స్థిరంగా ఉండేటట్లు వారు పరిశుద్ధతలో జీవించాలని బోధింపబడతారు. అయినప్పటికీ, పరలోకంలోనే, పవిత్రపరచడం పూర్తి అవుతుంది.

**క్రీస్తు యొక్క పరిచర్య:**[21]గొప్ప ప్రధానయాజకునిగా, విజ్ఞాపనచేసేవానిగా, సహాయకునిగా, మన తరపున వాదించే న్యాయవాదిగా, ఆయన కృప నిస్తాడు; ఆదరణను, ప్రోత్సాహాన్ని ఇస్తాడు. తన స్వంతవారికై విజ్ఞాపన చేస్తాడు. వారు పాపం చేసినపుడు, వారిని తిరిగి సహవాసానికి పునరుద్ధరిస్తాడు. సాతాను చేసే నేరారోపణలకు వ్యతిరేకంగా తన ప్రజల కోసం దివారాత్రులు మొఱపెడతాడు.

**అంతరంగంలో నివాసం చేస్తాడు**[22] దేవుని బిడ్డ తిరిగి జన్మించిన

క్షణంలోనే, త్రిత్వంలోని మూడవ వ్యక్తి అతడి శరీరంలోకి ప్రవేశిస్తాడు. బలహీనమైన మానవశరీరం పరిశుద్ధాత్మకు ఆలయంగా మారడం ఎంతో అద్భుతం కానీ సత్యం. పరిశుద్ధతకు, ఆరాధనకు, సేవకు పరిశుద్ధాత్ముడే శక్తి. ఒక పరిశుద్ధుని జీవితంలో ఆశ్చర్యకరమైన మార్పును తెచ్చి, అతడిని తీర్చిదిద్దడం ఆత్మదే బాధ్యత.

**ఆత్మద్వారా బాప్తిస్మం పొందడం**[23] ఆత్మచేసే ఈ పరిచర్య మారుమనస్సు పొంది క్రీస్తునందెవరు విశ్వసిస్తారో వారిని ఆయన శరీరంలో సభ్యులుగా చేస్తుంది. రక్షణ పొందిన క్షణంలో విశ్వాసి ఈ భూమిపై సంఘం అనే ఎంతో గొప్పదైన సహవాసంలో సభ్యునిగా చేరే అసాధారణ భాగ్యాన్ని పొందుతాడు. ఈ క్రొత్త సమాజం క్రీస్తును శిరస్సుగాను, నిజ క్రైస్తవులందరినీ సభ్యులుగాను కలిగుంటుంది. క్రీస్తు అనుచరులకు అయనతో గల సన్నిహిత సంబంధాన్ని, ఒకరిపట్ల ఒకరికి గల సంబంధాన్ని మాటలలో వర్ణించలేము.

**ముద్రింపబడ్డారు**[24] వరుస క్రమంలో ఆత్మచేస్తున్న పరిచర్యలతో పాటు, ఆత్మకు ముద్ర కూడా ఇవ్వబడింది. ఈ ముద్ర శాశ్వత భద్రతకు హామీని, తనకు చెందిన వారిగా గుర్తించే ప్రాముఖ్యతను కలిగివుంది. రక్తంతో కొనబడిన పాపికి ఈ ముద్ర ఉంది.

**సంచకరువుగా ఇవ్వబడెను**[25] విశ్వాసి పరిశుద్ధాత్మను ఎంత ఖచ్చితంగా కలిగి ఉంటాడో, అంతే ఖచ్చితంగా మొత్తం స్వాస్థ్యాన్ని, అంటే పరలోకంలో మహిమగల శరీరాన్ని కలిగివుంటాడు. సంచకరువు ప్రమాణపూర్వక వాగ్దానాన్నిస్తాడు. ఈ విషయాన్ని వివరించడానికి కొన్నిసార్లు వివాహ నిశ్చితార్థపు ఉంగరంతో పోలుస్తారు.

**అభిషేకమునొందినవారు**[26] ఒక వ్యక్తి రక్షింపబడినపుడు, పరిశుద్ధాత్మను అభిషేకంగా స్వీకరిస్తాడు. దీనిలో రెండు ముఖ్యమైన పరిచర్యలున్నాయి. మొదటిది, మారిన వ్యక్తి సత్యానికీ, తప్పిపోవడానికి మధ్య తేడాను గుర్తించేలా బోధించే పరిచర్య. రెండవదిగా, అతడు సేవకై ప్రత్యేకింపబడ్డాడు. ఎలా

అంటే, పాతనిబంధనలో అభిషేకము పొందిన ప్రవక్తలు, యాజకులు, రాజులు మొదలైన వారిలా అభిషేంచబడడం.

**ప్రార్థనలో దేవునియొద్దకు ప్రవేశం**[27] దేవుని రాజ్యంలో అత్యల్పుడైన వ్యక్తికి స్థిరంగా, వెంటనే విశ్వానికి సార్వభౌముడైన వాని దగ్గర ప్రవేశం దొరకడం ఊపిరి బిగబట్టేటంత అద్భుతం కాదా! విశ్వాసం ద్వారా అతడు భూమినుండి పరలోకంలోని సింహాసనాగదికి, అతిపరిశుద్ధ స్థలానికి రాజుల రాజుతో, ప్రభువుల ప్రభువుతో మాట్లాడడానికి వెళ్తున్నాడు. ఈ సదవకాశం చౌకగా దొరకలేదు. అది ప్రభుయేసుని రక్తంతో కొనబడింది.[28]

క్రైస్తవుని ప్రార్థనా జీవతాన్ని ఎక్కువ స్పష్టంగా చేసేటందుకు క్లెయిర్‌వాక్స్‌కి చెందిన బెర్నార్డ్ గారు శతాబ్దాల క్రితమే క్రింది విధంగా సూచించారు: "వేలాదివేలమంది ఆయనను సేవిస్తూ ఉండగా ఉన్నత సింహాసనంపై నున్న ఆయన ఎదుటకు వెళ్ళి ఆయన సన్నిధిలో నిలచివుండడమే ప్రార్థన."

**నూతన పౌరసత్వం**[29] మారుమనస్సు పౌరసత్వంలో మార్పును తెస్తుంది. అది లోకసంబంధమైన పౌరసత్వం నుండి పరలోక సంబంధమైన పౌరసత్వానికి చెందినది. మునుపు లోకస్థులైన ప్రజలు యాత్రికులుగా, పరదేశులుగా వుంటారు. వారు నూతన పాలకుని గుర్తించి, ఉన్నతమైన ఆదేశాలకు విధేయత చూపిస్తారు; అదే సమయంలో వారు మానవ అధిపత్యాన్ని గౌరవించి స్థానిక చట్టాలకు విధేయత చూపిస్తారు. (ఉన్నత శ్రేణులతో విరుద్ధత రానంతవరకు చేస్తారు) వారి "పాతదేశం" ఉగ్రతకులోనై నాశనమైపోతుంది. వారి నూతనదేశం శాశ్వతమైనది.

**దేవుని పిల్లలు**[30] రక్షణ పితృత్వంలో కూడా మార్పును తెస్తుంది. విమోచింపబడిన వారి పుట్టిన తేదీ ధృవీకరణపత్రములో వారి తండ్రిగా దేవుని పేరు వ్రాయబడింది దీని గురించి ఆలోచించండి-ఒక అధ్యక్షుడు లేదా రాజు పిల్లలు కాదు కానీ విశ్వానికి ఆధారభూతుడు, సృష్టికర్తయొక్క బిడ్డగా వుండడం. ఇంతకన్నా ఉన్నతమైన గౌరవం ఏదీలేదు!

**దేవుని కుమారులు** [31]స్త్రీ అయినా పురుషుడైనా, విశ్వాసులు దైవిక కుటుంబాలలోనికి, అన్ని అవకాశాలతో, బాధ్యలతో పెద్దవారిగా చేర్చబడతారు. వారు చట్టబద్ధమైన బంధంతో కూడిన పిల్లలలా కాకుండా స్వేచ్ఛగల కుమారులుగా, కుమార్తెలుగా ఉంటారు.

**దేవుని వారసులు; యేసుక్రీస్తుతో సహవారసులు**[32] ఈ బిరుదులు స్వీయ–వివరణతో వున్నాయి; అయినా వాటిలోతు మనకు అర్థంకాకుండానే మిగిలిపోతుంది. తండ్రియైన దేవుని సంపదను, ఆయన కుమారుని సంపదను, ఐశ్వర్యాన్ని ఎప్పుడైనా ఎవరైనా కొలువగరా? వాటి మొత్తం నక్షత్ర సమూహమంతటిది కావచ్చునేమో! అయినా, ప్రభువును ప్రేమించే ప్రతివారికి చెందిన స్వాస్థ్యపు కొలత ఉంది.

**పరిశుద్ధజనమును, రాజులైన యాజక సమూహమునైయున్నారు** [33] పాతనిబంధనలో యాజకత్వం కేవలం ఒక తెగకు, కుటుంబానికి మాత్రమే చెంది వుంది. కానీ! నూతన నిబంధనలో విశ్వాసులందరూ యాజకులే! వారి విధి రెండువైపులా ఉంటుంది. మొదటిది దేవునికి తమ ప్రేమను, తమ జీవితాలను, స్తుతులను, ఆస్తులను, సేవలను అర్పించడం; తరువాత, వారు చీకటిలోనుండి ఆశ్చర్యకరమైన తన వెలుగు లోనికి పిలిచినవాని గుణాతిశయములను ప్రచురము చేయడానికై ఏర్పాటుచేయబడ్డారు.

**అత్యధికముగా విజయులు**[34] ఎవరైనా అత్యధికవిజయునిగా ఎలా ఉండగలడు? అతడు విజయాన్ని పొందవచ్చు లేక పొందకపోవచ్చు. విజయానికి మించి అతడేం చేయగలడు? ఇక్కడున్న ఆలోచన ఏమిటంటే, విశ్వాసులు ఇప్పటికే విజేతలుగా వున్నారు. వారు బలమైన యుద్ధంలో ఉన్నా సరే! ఫలితం నిశ్చయం. వారు విజయంవైపే వున్నారు. ఏదైనా ఒక ప్రత్యేక సమయంలో అలలు వారికి వ్యతరేకంగా ఉన్నట్టు కనిపించినా, అలను నిశ్చయంగా గెలవగలరు.

**ఆయనను పోలివుండడానికి నిశ్చయింపబడ్డాము**[35] నిత్యత్వమంతటికీ మచ్చలేని ఆయన వధువుగా ఆయనతో ఉండడానికి పిలువబడ్డాం. జె.ఎన్.డార్బీ దీనిని "అన్ని తలంపులకన్నా మించిన తలంపు" అన్నాడు- ప్రభువువారి నైతిక, ఆధ్యాత్మిక స్వరూపంలోనికి రూపాంతరం చెందడం. ఆశ్చర్యచకితుడై అతడు ఇలా అడిగాడు:

ఇది నిజమేనా- నేను నీ కుమారుని పోలి ఉంటానా?
ఆయన నా కోసం గెలిచిన కృప ఇదేనా?
మహిమ గల తండ్రి, (అన్ని తలంపులకు మించిన తలంపు)
మహిమలో ఆయన స్వారూప్యంలోనికి నన్ను తేవడమా!

క్లుప్తంగా చెప్పాలంటే, క్రీస్తునందు అత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదముతో ఆశీర్వదింపబడుట.[36] దేవుని స్నేహితులలో ఒకరు చెప్పినట్లు, "ఇక్కడ మనం కొంచెం ఆగి ఆరాధిద్దాం. కనీసం నేనైనా అలా చేయాలి, ఎందుకంటే నా ఆత్మ నేత్రాలు వెలిగే సూర్యుణ్ణి చూసినట్లుగా నొప్పిపెడుతున్నాయి"[37]. జేన్ ఆస్టిన్ పాత్రలలో ఒకరు ఉపయోగించిన మాటల్లో ఒకదాన్ని అప్పు తెచ్చుకొంటే, "విశ్వాసులు తమ అర్హతకు మించి ఆనందంగా ఉండటాన్ని భరించడం నేర్చుకోవాలి."[38]

## విస్తారమైన కృప

పాపమనేది ప్రవేశింపకపోతే క్రీస్తునందలి విశ్వాసి ఎన్నడూ లేనంత చక్కగా వుండేవాడు. మరోవిధంగా చెప్పాలంటే, అతడు క్రీస్తులో, పడిపోని ఆదాము కన్నా ఎంతో చక్కగా వుండేవాడు. ఈ చరణం సత్యం:

క్రీస్తునందు ఆదాము కుమారులు
వారి తండ్రి పోగొట్టుకొన్న ఆశీర్వాదాలకన్నా
ఎక్కువైన ఆశీర్వాదాలలో అతిశయిస్తారు

తన స్వభావ సిద్ధమయిన అమాయకత్వంలో ఆదాము ప్రియమైన లేక పరిపూర్ణమైన క్రీస్తులో ఎప్పటికీ అంగీకరింపబడి ఉండేవాడు కాదు.

పరలోకంలో గృహం వుంటుందనే నిరీక్షణ అతడికుండేదికాదు; లేక క్రీస్తు స్వారూప్యతకు సమమైన సారూప్యత ఉండేది కాదు. పైన వివరించిన ఆశీర్వాదాలనెపుడూ అతడు అనుభవించి ఉండేవాడు కాదు.

అతడు పాపం చేయనంతవరకూ, భూమిపై జీవితం కొనసాగుతుందనే నిశ్చయతతో ఉన్నాడు. కానీ అతడు క్రీస్తు జీవాన్ని కలిగి ఉండేవాడు కాదు. అతడు పరిశుద్ధాత్మశక్తిచే శాశ్వతంగా అంతరంగిక నివాసాన్ని కలిగివుండేవాడు కాదు. కృపచే రక్షించబడిన పాపికి చెందిన ఆధిక్యతలను అతడెన్నటికీ అనుభవించి ఉండేవాడు కాదు.

అంతేకాదు అతడు పాపం చేసి శిక్షకు గురి అయ్యే భయంకరమైన సాధ్యత ఎప్పుడూ ఉంటుంది. ఆదాము, హవ్వలపై మరణ భయం డెమాక్లిస్ ఖడ్గము వలె వ్రేలాడి ఉండేది. ఆదాము పాపము చేశాడని, అతడి పాపం, విచారం, శ్రమ, మరణంతో కూడిన మంచు ఖండాలను ఎదురుపడేటట్టు చేసిందని మనకు తెలుసు. కానీ దేవుడు మానవుల అంచనాకు మించిన విధంగా విశ్వాసుల్ని ఐశ్వర్యవంతుల్ని చేయడానికి, రక్షణ మార్గాన్ని ఏర్పాటు చేయడానికి తన కుమారుని పంపించాడు. కాబట్టి క్షమించబడిన పాపులు, వారు పాపమెన్నడూ చేయని వారి స్థితికన్నా ఉన్నత స్థితిలో ఉన్నారు. "... పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను."[39]

దేవుని అనుగ్రహం ఆదినుండి అంతం వరకు అత్యద్భుతమైన, కొలువలేనంత లోతైన, విస్తారమైన, ఊపిరిబిగపట్టే, మన పాపముల కన్న గొప్పదైన కృప.

## ఆరవ అధ్యాయం

# “సువార్త”గా ఉన్న ఒక దుర్వార్త

మరొక రకమైన సువార్త ఉంది. అది అసత్యసువార్త. అదెంతమాత్రం మంచివార్త కాదు, అయినా, ప్రపంచంలోని అసంఖ్యాకమైన ప్రజలు నమ్మే సందేశం అదే! అది మంచివారు పరలోకంలోనికి వెళ్తారని చెబుతుంది. అది నీవు రక్షణని సత్క్రియల ద్వారా సంపాదించుకొంటావని, లేదా మంచి గుణశీలాలు కలిగుంటే, దానికర్హుడివని చెబుతుంది. ప్రపంచంలోని చాలా మతాలు ఈ సిద్ధాంతాన్ని ఏదో ఒక రూపంలో బోధిస్తున్నాయి. అది ప్రజలకు సరియైనదిగా కన్పించొచ్చు కానీ బైబిలు దాని అంతం మరణమనీ, అంటే దేవునితో శాశ్వతమైన వేర్పాటని చెబుతోంది.[1]

ఇది క్రొత్తదేమీ కాదు; నిజానికది ఏదేను వనం వైపుకు వెళుతోంది. ఆదాము, హవ్వలు తమ పాపపు నగ్నత్వాన్ని అంజూరపు ఆకులతో కప్పుకోవాలని ప్రయత్నించారు. వారు ఏదో ఒకటి చేయడం ద్వారా తమని తాము దేవుని దృష్టికి సరియైనవారుగా కన్పించేలా చేసుకోవాలనుకున్నారు. కానీ దేవుడు వారికి అది పెద్ద తప్పని చూపించాల్సి వచ్చింది. కాబట్టి, ఆయన వారికి చర్మపు చొక్కాయిలను ధరింపచేశాడు. ఇలా చేయడానికి, జంతువులు మరణించాల్సి వచ్చింది. వాటి రక్తం చిందించబడాలి. ఆదాము, హవ్వ చేయాల్సిందల్లా విశ్వాసంతో దేవుని ఏ

ర్పాటును అంగీకరించడమే! పాపం దేవుని నుండి వేరుచేస్తుందని దేవుడు వారికి నేర్పిస్తున్నాడు. ఆ దూరాన్ని మానవుడు పూడ్చలేడు. పాపులు దేవుని దగ్గరకు ఎవరి రక్తం చిందించబడుతుందో ఆ రక్తాన్ని ప్రత్యామ్నాయపు త్యాగంగా ఆధారం చేసుకుంటేనే చేరగలరు.

కయీను తన తల్లిదండ్రుల తప్పునుండి ఈ విషయాన్ని నేర్చుకొని ఉండాల్సింది. బదులుగా అతడు దేవునికి రక్తంలేని తన చేతుల కష్టార్జితాన్ని అర్పణగా తెచ్చాడు. ఇది దేవుని మార్గాన్ని పూర్తిగా త్రోసిపుచ్చడం, దేవుని వాక్యాన్ని యిష్టపూర్వకంగా తిరస్కరించడమే! ఇది నిత్యమైన శిక్షకు కారణమయింది. అసత్యసువార్త సరియైనదిగా కనిపిస్తుంది కానీ అది మరణానికి నడిపిస్తుంది.

అయినా ఈ శతాబ్దాలన్నిటిలో, అది ఇంకా ఎన్నుకొనే మతంలా ఉంది. తన న్యాయసలహాదారులలో నంబర్ 2గా ఉన్న వ్యక్తి మరణించినపుడు అమెరికా అధ్యక్షుడు ఇలా చెప్పాడు. “నా ప్రగాఢమైన నిరీక్షణ ఏమిటంటే, అతని ఆత్మ–తాను చేసిన మంచి పనులు, జీవించిన మంచి జీవితం ద్వారా సంపాదించిన రక్షణను, కృపను అందుకోవాలనేదే!”

సానుకూలధోరణికి మారుపేరని ప్రసిద్ధిగాంచిన ఒక పాస్టరుగారు ఇలా చెప్పారు: “మనమెలా మంచి ఆలోచనలు చేస్తామో, మంచిని చేస్తామో, అలాగే అందరూ పరలోకానికి వెళ్తారని మేము నమ్ముతున్నాం.”

నమ్మకమైన ఒక పాదిరి 40 నిమిషాలపాటు కృపచేత విశ్వాసం ద్వారా మాత్రమే రక్షణ లభిస్తుంది కానీ క్రియల ద్వారా కాదని బోధింపవచ్చు. చివరిలో ఆయన ద్వారం దగ్గర నిలబడి వచ్చిన వ్యక్తిని “నీవు రక్షణ పొందావా?” అని అడిగితే, దానికతడు “నేను నా శాయశక్తులా పనిచేస్తున్నానండీ” అని జవాబు చెబుతాడు.

ఒక క్రైస్తవుడు తనకు పరిచయమైన ఒక వ్యక్తిని “నీవు రక్షింపబడ్డావా?” అని అడిగాడు. దానికతడు “అది ఎవరికైనా ఎలా తెలుస్తుంది?” అని

జవాబు చెప్పాడు. అతడు రక్షణ అనేది మంచి స్వభావం లేక క్రియల ద్వారా సంభవిస్తే ఎవరూ అతడు అర్హుడవునో కాదో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరని గ్రహించాడు. గమ్యం చాలా అనిశ్చితంగా అపాయం నుండి తెలివిగా తప్పించుకొనేదిగా ఉంది.

క్రియల ద్వారా రక్షణ అనేది మానవ మనస్సుపై ఎంత లోతైన ముద్రను వేసిందంటే, అది పోవడానికి దేవుని ఆత్మ చేసే అసాధారణమైన పని అవసరమవుతుంది. ప్రజలు తమను తాము రక్షించుకోగలమనీ లేక తమ రక్షణకొరకు ఏదైనా చేయగలమని నమ్మాలనుకుంటారు. అది వారి గర్వాన్ని తృప్తిపరుస్తుంది. వారు తమని గురించి కృపను లేదా దయను పొందే వారిగా ఆలోచించడానికిష్ట పడలేరు. వారు పరలోకాన్ని సంపాదించుకోలేకపోవడమనే ఆలోచనను వారు తప్పుగా భావించారు.

కాబట్టి వారు సత్‌క్రియలతో మంచి స్వభావం ద్వారా రక్షణను పొందవచ్చునే ఆలోచననే ధైర్యంగా అంటిపెట్టుకొని ఉంటారు. చాలామంది కృపద్వారా నిజంగా రక్షించబడినాక కూడా వారు రక్షణపొందడానికి కృషి చేయాల్సి వుంటుందనే భావనకు మళ్ళీ వెనక్కి తిరుగుతారు. నేటి సంఘం ఇటువంటి దుర్బోధతో పులిసిపోయింది.

ఈ అబద్ధపు సువార్తకు సమీప బంధువులైన పదాలు: ధర్మశాస్త్రాన్ని పాటించడం, క్రియలు, రుణం మొదలైనవి. మరొకవిధంగా చెప్పాలంటే, రక్షణ అనేది ఒక పాపి ధర్మశాస్త్రాన్ని పాటించడం వల్ల, లేదా అతడు చేసిన మంచి పనుల వల్ల దేవుడు తీర్చుకోవలసిన రుణమే.

దీని ఉద్దేశమేమిటంటే దేవుడు ఒక వ్యక్తి చేసిన సత్క్రియల్ని ఒకవైపున, చెడ్డపనుల్ని ఒకవైపున త్రాసులో నిలుపుతాడని, బరువుగా వున్న వైపే ఆ వ్యక్తి గమ్యం పరలోకమో నరకమో నిర్ణయిస్తుందన్నమాట; అయితే, అతడు చనిపోయేవరకూ త్రాసు ఎటువైపుకు ఎక్కువగా తూగుతుందో అతడు తెలుసుకోలేడు.

అది కృపకాదు. కృప, క్రియలు పూర్తిగా వ్యతిరేకమైనవి. వాటిని కలపాలని నీవు ప్రయత్నించిన మరునిమిషం అది కృప కానేకాదు.[2] ఉదాహరణకు, క్రైస్తవ జీవితాన్ని జీవించడం ద్వారా రక్షింపబడతామని చెప్పడం కృపకాదు. మనమెలాంటి క్రియల ద్వారానైనా రక్షింపబడ్డామని చెప్పడం కృప కాదు. మనం విశ్వాసం, క్రియల ద్వార రక్షింపబడతామని చెప్పడం కూడ కృపకాదు.

మనం విశ్వాసము + ఏమీ చేయకపోవడం ద్వారానే రక్షింపబడతామని చెబుతుంది కృప.

## ధనవంతుడే కానీ విచారంతో ఉన్న యౌవన అధికారి

ఒకప్పుడు క్రియల ద్వారా రక్షణవస్తుందని నమ్మే ధనికుడైన అధికారి ఉన్నాడు.[3] అతడు యేసునొద్దకు వచ్చి, నిత్యజీవానికి వారసుడనయ్యేందుకు నేనే మంచిపని చేయాలి? అని అడిగాడు. అతడు రక్షణను సంపాదించాల నుకొన్నాడు.

యేసు అతడికి పది ఆజ్ఞలలోని ఆరు ఆజ్ఞల్ని చెప్పి క్రియల ద్వారా పరలోకాన్ని పొందడం అసాధ్యమని చూపించినపుడు, ఆ యవనస్థుడు ఆ ఆజ్ఞలన్నిటిని అనుసరిస్తున్నానని గర్వంగా ఉప్పొంగుతూ చెప్పాడు. కానీ, నిజంగా అతడలా చేయలేదు. అతడు తన పొరుగువానిని తనలా ప్రేమించలేదు. అలా చేసి వుంటే, అతడు తన సంపదను పేదలతో పంచుకొని వుండేవాడు. అతనిలో స్పష్టంగా కనబడే పాపం లోభత్వం. అతడు 10 ఆజ్ఞలలో ఒక ఆజ్ఞను మీరడం ద్వారా, పది ఆజ్ఞలన్నిటినీ మీరాడు. ఎందుకంటే అవి ఒక గొలుసులో వున్న 10 లింకులు. అతడు కృప ద్వారా రక్షించబడాల్సిన అవసరముంది, క్రియల ద్వారా కాదు.

## పరలోకానికి నకిలీ టికెట్లు

మానవ మనస్సులో ఎంతో లోతుగా కూరుకుపోయిన భావన క్రియల ద్వారా రక్షణ పొందుతామని, మంచివారు పరలోకానికి వెళతారని; పరలోకానికి టిక్కెట్టు అని ప్రజలు భావించే క్రియలలో కొన్ని క్రియలు క్రింద ఇవ్వబడ్డాయి.

## మతసంబంధమైన ఆచారాలు:

**బాప్తిస్మము:** రక్షణపొందిన వారికే ఇది అవసరమని అర్థం చేసుకోవాలి. ఇది క్రీస్తును బహిరంగంగా ఒప్పుకోవడం; ఆయన మరణ, భూస్థాపన, పునరుత్థానములతో ఒకటిగా పాలు పొందడం.

**నిర్ధారణ (కన్ఫర్మేషన్):** ఇది ఒక సంఘ సంప్రదాయం; బైబిల్లో ఎక్కడా ఎప్పుడూ ఇది కనపడలేదు. కాబట్టి ఇది రక్షణ పొందే సాధనమని చాలా అరుదుగా భావించబడుతుంది.

**ఒప్పుకోలు:** మానవుని యొద్ద ఒప్పుకోవడం ద్వారా పాపాలు క్షమించబడవు. యేసుక్రీస్తును ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించడాన్ని వినడానికి దేవుడు ఎదురుచూస్తున్నాడు.

**ప్రభురాత్రి భోజనం:** బాప్తిస్మం లానే ప్రభురాత్రి భోజనం కూడా నిశ్చయింపబడిన క్రైస్తవుల కోసమే వుంది. ఇది ప్రభువు మరణాన్ని జ్ఞాపకం చేసుకోవడం.

**తప్పుచేసినందుకు శిక్ష:** ఇది ఒక వ్యక్తి తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెందే ప్రయత్నానికి సంబంధించిన ఎటువంటి క్రియాశీల చర్యనైనా చేయడానికి సంబంధిస్తుంది. ఈ పదం క్రొత్త నిబంధనలో లేదు. దేవుడు పాపులను పశ్చాత్తాపపడమని కోరాడు. అంటే, వారి పాపాన్ని ఒప్పుకొని, క్షమాపణకొరకు ఆయనవైపు తిరగమని.

**సంఘ సభ్యత్వం:** ప్రభువు లెక్కించే ఒకే ఒక సభ్యత్వ ఏమిటంటే

నిజమైన సంఘంలో నిజమైన విశ్వాసులందరితో ఏర్పడిన క్రీస్తు శరీరంలో సభ్యత్వం; ఇది రక్షణ పొందే సాధనం కాదు!

**సంఘ ఆరాధనలకు క్రమంగా హాజరవడం:** ఇది చూడడడానికి చక్కగానే ఉన్నా, దీనికి రక్షించే విలువ లేదు.

**పదియవ వంతు చెల్లించడం:** దేవుని అనుగ్రహం పొందడానికి సంబంధించి ఒక అవిశ్వాసి తన ఆదాయంలో కొంతశాతం సంఘానికి ఇవ్వడం నిరుపయోగమే అవుతుంది. నిజానికి దేవునికి అతడి డబ్బు అవసరం లేదు. దేవుడు అతడిలో విశ్వాసాన్ని, మారుమనస్సును చూడాలని కోరుతున్నాడు.

**ఉపవాసం:** తనను తాను ఉపేక్షించుకోవడం ఒక వ్యక్తి ఆరోగ్యానికి మంచిది కావచ్చు. క్రైస్తవులకు అది ఆధ్యాత్మిక ఏకాగ్రతకు సహాయం చేయవచ్చు. కానీ అవిశ్వాసులకు దేవునిని సంతోషపరచే సాధనంగా వుండడానికది నిరుపయోగం అవుతుంది.

**ప్రార్థనలు:** రక్షణపొందని వ్యక్తి నుండి దేవుడు వినాలని వేచి చూస్తున్న ప్రార్థనేమిటంటే, "దేవా, పాపినైన నన్ను కరుణించు. యేసు నిమిత్తం నన్ను రక్షించు".

**అత్యధిక మత అభినివేశం:** పవిత్రభావాన్ని చూపే మతసంబంధమైన ఈ కార్యక్రమంలో యాజకుడు క్లిష్టపరిస్థితులో వున్న ఒక వ్యక్తి స్వస్థతకొరకు, రక్షణకొరకు ప్రార్థిస్తాడు. విచారకరంగా, ఇది ఎటువంటి లేఖనాదికారం లేనిది. అందువల్ల ఈ భూమిపై జీవితాన్నిగాని, నిత్యజీవాన్ని గాని ఇస్తుందనే గ్యారంటీ లేదు.

### ఆజ్ఞలు పాటించుట

**పది ఆజ్ఞలు:** మనం తరువాతి అధ్యాయాల్లో చూడబోతున్నట్టుగా ఈ ఆజ్ఞల ఉద్దేశం పాపాన్ని బయలుపరచడమే తప్ప, వాటిని కడిగివేయలేవు.

**బంగారు నియమం:** ఇతరులు మనకేమిచేయాలని కోరుతున్నామో దానిని మనం వారికి చేయడమనేది ఆదర్శప్రాయమైన సూత్రం. కానీ దానికి పరిపూర్ణంగా లోబడడం మానవశక్తికి మించింది.

**ఇంకా ఇతరమైన నియమాలు:** ఒక వ్యక్తి తనను తాను రక్షించుకోవడానికి ప్రతిభను కలిగించేదేదీ చేయలేదని క్రొత్తనిబంధన నొక్కి చెబుతోంది.

## మంచి గుణశీలం:

**మంచి జీవితాన్ని జీవించడం:** మన జీవితం ఎంత మంచిది అయినా అది దేవుని ప్రమాణమైన ఆయన కుమారుడైన క్రీస్తు ప్రమాణానికి తక్కువగా ఉంటుంది. ఒక్క పాపం చాలు ఒక వ్యక్తి పాపిగా ఎంచబడటానికి. పాపం వలన వచ్చు జీతం మరణమే!

**ఇతరులకన్నా మంచిగా ఉండడం:** తాను మరొకరికంటే మంచివాడనని ఇంచుమించు ఎవరైనా చెప్పగలరు. స్తంభాన్ని ఎక్కేవాళ్ళలో ఎవరో ఒకరు ఎప్పుడూ క్రిందుగా ఉంటారు. క్షమించండి ఈ ఆత్మస్తుతి సరిపోదు. అది సరిపోతే, అప్పుడు ఎక్కడైనా జీవించివున్న ఎంతో చెడ్డవాడైన పాపివుంటే అతడు తప్ప, ప్రతి ఒక్కడూ రక్షింపబడి ఉండేవాడు.

## మంచి క్రియలు

**దాన ధర్మాలు:** అవసరంలో వున్న వారితో మనం పంచుకోవడానికి దయాగుణం అవసరం. దాన ధర్మాలకు వ్యతిరేకంగా మాట్లాడడమనేది మాతృత్వానికి వ్యతిరేకంగా మాట్లాడం లాంటిది. కానీ ముఖ్యమైన విషయమేమిటంటే ఇవన్నీ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయలేవు.

**శాయశక్తులా చేయడం:** ప్రతి ఒక్కరూ దానిని చేయాలి; కానీ మంచి క్రియలు రక్షకుడు కాదు; యేసే రక్షకుడు.

## వారసత్వం, కుటుంబం

**దైవభక్తిగల తలిదండ్రులకు జన్మించడం:** రక్షణ అనేది వారసత్వంగా సంక్రమించింది కాదు. అది రక్తంలో ప్రవహించదు. కానీ, అది ప్రతి వ్యక్తి సువార్తకు వ్యక్తిగత అనుక్రియను చూపాల్సినట్టిది.

**కుటుంబంలో యాజకుడ్ని లేదా బోధకుడ్ని లేక సువార్తికుడిని కలిగివుండడం:** ఏ ఒక్కరూ వేరేవారి వృత్తి ద్వారా విశ్వాసి కాలేడు. మనం మన మానవసంబంధ బాంధవ్యాలచే రక్షణ పొందలేము.

**మంచి తండ్రిగా లేక తల్లిగా ఉండటం లేక మంచి కుటుంబాన్ని నిర్మించడం ద్వారా:** చాలా మెచ్చదగినదే కాని ఇది సరిపోదు. మనం చేయగలిగిన ఏ మంచిపని ద్వారానూ మనం రక్షణపొందలేం.

పైవాటిలో ఏ ఒక్క లక్షణం లేక ఏవైనా రెండు లక్షణాల్ని కలిగుండడం ఒక వ్యక్తిని రక్షించలేదు. అవి రక్షించగలిగితే, క్రీస్తు మరణించాల్సిన అవసరం లేదు. ఆయన చనిపోవడానికి, సమాధి చేయబడడానికి, తిరిగి లేవడానికి గల కారణం ఆయనయందలి విశ్వాసం ద్వారా తప్ప మరొక రక్షణపొందే విధానం లేదు.

మీరు పై పట్టికను పరిశీలిస్తే, దానిలో ఒక్క అంశం కూడా ప్రపంచంలోని ప్రతిఒక్కరికీ అందుబాటులో లేదు. నిజానికి ఏ ఒక్కరూ తప్పిపోకుండా ప్రతిఒక్కరూ చేయగల మంచిపని అని చెప్పుకునే దాని గురించి నీవు ఆలోచించలేవు. నీవు చేతులు లేదా పాదాలు లేని వారి గురించి, లేక గ్రుడ్డి వారి గురించి, బీద వారి గురించి, లేక మరణానికి ఒక్క నిమిషం దూరంలో ఉన్న వారి గురించి ఆలోచించినపుడు క్రియల ద్వారా రక్షణ పొందడమనేది అల్పమైన సువార్త అని నీవు గ్రహిస్తావు. అందులో ఎటువంటి శుభవార్త లేదు.

శతాబ్దాలుగా ప్రజలు పరలోకాన్ని ప్రవేశించడానికి మానవ

మనస్సు కనిపెట్టగల, యోచింపగల ప్రతి యత్నాన్ని చేశారు. ధ్యానం, ఆత్మ, ఉపేక్ష, కఠోర శ్రమ, భౌతిక శ్రమ (అంటే మోకాళ్ళపై మెట్లెక్కడం లాంటివి) తీర్థయాత్రలు, మఠాలలో సన్యాసులుగా ఉండడం లేక డబ్బు చెల్లించడం మొదలైనవి.

ఇదంతా వృధా ప్రయాసే క్రీస్తు రక్తం తప్ప పాపపు మరకల్ని కడిగివేసేది ఏది లేదు.

## యేసు+ అనే నిర్హేతుకమైన వాదం

చాలామంది క్రీస్తునందు విశ్వాసం అవసరమని ఒప్పుకొంటారు, కానీ వారు వెంటనే మరొకటి కలుపుతారు. సంఘపు ఆరంభదినాలలో, కొందరు సున్నతి కూడా అవసరమని బోధించారు. ఇప్పుడు ప్రజలు బాప్తిస్మాన్ని, భాషలలో మాట్లాడడాన్ని, సబ్బాతు దినాన్ని ఆచరించడాన్ని, ఆజ్ఞలు పాటించడాన్ని, ఇంచుమించు అటువంటి పనుల్ని కలుపుతున్నారు. ఇది పూర్తిగా అసత్యమైనది. ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే సరిపోయిన, ఒకే ఒక్క రక్షకుడు. ఆయన తన రక్షణ ఘనతను ఎవరితోను లేక దేనితోను పంచుకోడు. రక్షణ అనేది కృపద్వారా విశ్వాసం తప్ప ఇంకేమి లేదు. కృప ఆయనవైపు ఉంది; విశ్వాసం మనది.

## అసత్యసువార్త వెల్లడి అయింది

అసత్య సువార్త దుష్పరిణామాలకు దారితీస్తుంది. బైబిల్ ఏ ఒక్కరూ ఆజ్ఞల్ని పాటించడం లేక సత్క్రియల ద్వారా ఎప్పటికీ రక్షణ పొందలేరని పదే పదే చెబుతోంది.[4] ఇవి పాపాలకు ప్రాయశ్చిత్తం చేయలేవు.

మరో ప్రక్క బైబిలులో చాలా వచనాలు క్రీస్తునందలి విశ్వాసం ద్వారా మాత్రమే రక్షణ లభిస్తుందని క్రియల ద్వారా కాదని తెలియజేస్తున్నాయి.[5]

తన క్రియల ద్వారా రక్షణను వెదుకుతున్న వ్యక్తి తాను రక్షించబడ్డానని ఎప్పటికీ తెలుసుకోలేడు. అతడు తగినన్ని మంచి పనులు చేశాడో లేదో లేక సరియైనవి చేశాడో లేదో అతనికి తెలియదు. కానీ నీవు కృప ద్వారా విశ్వాసంచే రక్షించబడినపుడు, దేవుని వాక్యపు అధికారం క్రింద నీవు రక్షింపబడ్డావని నీకు తెలుస్తుంది. బైబిలు క్రింది విధంగా చెప్పినప్పుడు, దాని అర్థం యిదే "ఈ హేతువుచేత....విశ్వాసము గల వారికి కూడ దృఢము కావలెనని కృపననుసరించినదై యుండునట్లు, అది విశ్వాసమూలమైనదాయెను."[6]

ధర్మశాస్త్రం క్రింద ఉన్న వ్యక్తి నిత్యమైన భద్రతను ఎప్పటికీ కలిగి వుండలేడు. కారణం భవిష్యత్‌లో అతడేమి చేస్తాడో అతడికి తెలియదు. దుష్పరిమాణాలకు దారితీసే క్రియల సువార్త అనేది ప్రతీదీ స్వంతంపై ఆధారపడి ఉంటుంది.

క్రీస్తు గొఱ్ఱెలు ఎప్పటికీ నశించిపోవని కృపా సువార్త ఋజువు చేస్తోంది. ఈ విశ్వాసాన్ని జాన్ కెంట్ రచించిన కీర్తన ప్రతిబింబింపచేస్తోంది.

> శాశ్వతమైన బంధకాలతో బంధింపబడిన
> ఆత్మను క్రీస్తునుండి వేరుపరచేదేమిటి?
> ఒక్కసారి ఆయనలో ఉన్నానంటే, ఎప్పటికీ ఆయనలోనే...
> నిత్యమైన నిబంధన ఇలా నిలబడుతుంది:
> ఎవరూ నిన్ను పెరికివేయలేరు–
> రక్షకుని శక్తిగల చేతులలోనుండి.

వారి రక్షణకొరకు పనిచేయాలని లేక సంపాదించాలని ప్రయత్నిస్తున్న ప్రజలు అంతం లేకుండా పోరాడుతారు కానీ ఎప్పటికీ సాధించలేని బానిసలు. యేసు విశ్వాసులను వారిని స్వేచ్ఛగా చేసినపుడు, వారెప్పటికీ స్వతంత్రులే అని వాగ్దానం చేశారు.

అసత్య సువార్త యొక్క కీలకమైన పదం "చెయ్యి" అని. కృప యొక్క కీలకమైన పదం "చేయబడినది" అని; క్రీస్తు విమోచన కార్యాన్ని ముందే పూర్తిచేశాడు కాబట్టి, నీవు చేయనక్కరలేదు.

స్వభావసిద్ధంగా ప్రజలు కృపను యిష్టపడరు. అది వారికి అక్కర్లేదు, దేవుడు ఇతరులకు దానిని చూపడం వారికిష్టం లేదు; ఈ పరిస్థితిలో వారెలా ఉన్నారంటే, పశువుల తొట్టెలోని కుక్కవలె వున్నారు. అది గడ్డి తినదు, గడ్డి తినడానికొచ్చే ఏ జంతువునైనా వెళ్ళగొడుతుంది. యేసుప్రభుని దినాలలో వున్న మతాధికారులు ప్రజలకు వ్యతిరేకంగా దేవుని రాజ్యపు తలుపును మూసివేశారు. వారు తమంతట తాము ప్రవేశించలేరు, ఇతరుల్ని వెళ్ళనీయరు. న్యాయ నిపుణులతో కూడ ఇదే సమస్య! వారు దేవుని వాక్యాన్ని ప్రజలనుండి తీసుకొంటారు; దానిలో తమకు తాముగా ప్రవేశించరు, ప్రవేశించాలని ప్రయత్నించేవారిని ఆటంకపరుస్తారు.

ధర్మశాస్త్రం కృపను హింసిస్తుంది. పాతనిబంధన కాలంలో ఇష్మాయేలు ఇస్సాకును పరిహసించాడు, పౌలు ఆ సంఘటనలో ఈ సత్యానికి ఒక దృష్టాంతాన్ని చూశాడు.[7] అది క్రీస్తు ప్రభుని సిలువ దృశ్యంలో మరింత తేటగా కనపడింది. కృపను, సత్యాన్ని తెచ్చిన యేసు క్రీస్తును చంపడానికి పథకం రచించినవారు ధర్మశాస్త్ర సంబంధికులే!

ఏడవ అధ్యాయం

# నిజ విశ్వాసి ఎవరో చెప్పడం సులభం

నీవు ఒక వ్యక్తిని "నీవు రక్షింపబడ్డావా?" లేక "నీవొక క్రైస్తవుడివా?" అనే సరళమైన ప్రశ్నల్ని అడిగినపుడు అతడు ధర్మశాస్త్రము లేక కృప అనే రెండు వేదికలలో ఏ వేదికపై వున్నాడో ఆ విషయాన్ని నీవు చెప్పగలవు.

నిజమైన విశ్వాసి క్రింది విధంగా చెబుతాడు. "అవును, నేను రక్షించబడ్డాను కానీ దేవుని కృపవలనే రక్షింపబడ్డాను, నేను చేసిన ఏ పనివల్లనైనా కాదు."

కృప పట్ల మంచి ప్రశంసగల ప్రజలకు బైబిలులో గుర్తింపతగిన కొన్ని ఉదాహరణలున్నాయి.

రూతు తృణీకరింపబడిన, ఉగ్రతకు గురి అయిన స్వల్పజనానికి చెందినది. బోయజు అను పేరుగల వ్యక్తి ఆమె పట్ల అసాధారణమైన, అనుకోని దయను చూపించినపుడామె ఇలా అంది. "ఏమి తెలిసి పరదేశినైన నాయందు లక్ష్యముంచునట్లు నీకు కటాక్షము కలిగెనో?[1] ఆమె కృపను అర్థం చేసుకొంది.

ప్రభువు దావీదుతో షరతులు లేని నిబంధనను చేసుకొన్న తర్వాత, దావీదు ఇలా చెప్పాడు. "నా ప్రభువా యెహోవా ఇంతగా నీవు నన్ను

హెచ్చించుటకు నేనెంతటివాడను? నా కుటుంబము ఏపాటిది?" [2] దేవుని కృపకు తాను అర్హుడు కాడని దావీదుకు తెలుసు.

దావీదు యోనాతాను యొక్క కుంటికాళ్ళతో నున్న కుమారుడిని దత్తత తీసుకొన్నప్పుడు "చచ్చిన కుక్క వంటివాడనైన నా యెడల నీవు దయ చూపుటకు నేను ఎంతటివాడను అనెను."[3] మెఫీబోషెతు, తాను దావీదును చంపడానికై అవిశ్రాంతంగా వెదికిన సౌలు మనుమడైన తనను రాజు చంపి ఉండవచ్చును కదా! అని గ్రహించాడు.

పౌలు గతంలో సంఘాన్ని హింసించిన తాను అపొస్తలునిగా పిలువ బడతానని ఎన్నడూ అనుకోలేదు:

> "శోధింపశక్యము కాని క్రీస్తు ఐశ్వర్యమును అన్యజనులలో ప్రకటించుటకును, సమస్తమును సృష్టించిన దేవునియందు పూర్వకాలము నుండి మరుగైయున్న ఆ మర్మమును గూర్చిన యేర్పాటు ఎట్టిదో అందరికిని తేటపరచుటకును, పరిశుద్ధులందరిలో అత్యల్పుడనైన నాకు ఈ కృప అనుగ్రహించెను."[4]

అతడు పిలుపుకు తానెంత మాత్రము అర్హుడు కాడనే విషయాన్ని సంతోషంగా ఒప్పుకున్నాడు.

## దానిని చక్కగా వ్యక్తపరచే కీర్తనలు

చాలా క్రైస్తవ కీర్తనలు దేవుని నమ్మిన వారికి ఆయన చూపిన కృపను గురించి కృతజ్ఞతా హృదయంతో గట్టిగా, స్పష్టంగా వ్యక్తం చేసేవిగా ఉన్నాయి.

అటువంటి కీర్తనలలో జాన్ న్యూటన్ వ్రాసినది అందరికీ బాగా తెలిసినది. మరణం లేని ఆ పల్లవిని ఒక్కసారి చూద్దామా!

అద్భుతమైన కృప! ఆహా ఎంత మధురం ఆ స్వరం
నావంటి నీచుడను రక్షించిన కృప!
ఒకప్పుడు తప్పిపోతిని, ఇప్పుడు దొరికితిని,
అంధునిగా ఉంటిని, ఇప్పుడు చూడగలను నేను.

(ఎంతోమంది ఈ పాటను ఇష్టపడడం, పాడడం చేస్తారు, అయినా వారు తమ మంచి జీవితంద్వారానే రక్షించబడ్డామని నమ్మడం ఆశ్చర్యం కాదా?)

పైన చెప్పిన విధంగానే ఐజక్ వాట్స్ వ్రాసిన పాట కూడా వుంది:

అయ్యో! నా రక్షకుడు రక్తం కార్చాడా?
నా సార్వభౌముడు చనిపోయాడా?
పవిత్రమైన తన శిరమును అప్పగించాడా?
పురుగువంటి నా కోసం!

ఛార్లెస్ గాబ్రియేల్ తన రక్షణ కేవలం కృపవలనేనని గుర్తించాడు:

యేసు నాపై కురిపించే ప్రేమను చూసి ఆశ్చర్యంతో నిలబడిపోయాను,
ఎంతో ఉచితంగా నాకనుగ్రహించిన కృపను చూచి కలవరపడ్డాను;
నా కోసమే ఆయన సిలువవేయబడెనని, పాపినైన నాకోసమే ఆయన
శ్రమపడి, రక్తం చిందించి, మరణించాడని తెలిసి వణికిపోతున్నాను.

ఛార్లెస్ సిమియోను జాన్‌వెస్లీని మొదటిసారిగా కలుసుకొన్నపుడు జరిగిన వాస్తవ సంభాషణ ఇక్కడ ఇవ్వబడింది:[5]

**సిమియోను:** నీవొక ఆర్మేనియుడవని[6] అనుకొంటున్నాను. నేను కూడ కొన్నిసార్లు కేల్వినిస్ట్‌గా పిలువబడ్డాను, కాబట్టి మనం కత్తులు దూయాలేమోననుకొంటున్నాను. కానీ యుద్ధానికి సన్నద్ధమయ్యే ముందు నేను నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. దేవుడు కృపను మొదట నీ హృదయంలో నిలుపకపోతే నీవెంత నిర్భాగ్యుడివో, ఎన్నడూ దేవునివైపుకు తిరుగలేనంత నిర్భాగ్యుడవోనని నీకు అనిపించిందా?

**వెస్లీ:** అవును, నేను నిజంగా అలాగే భావించాను.

**సిమియోను:** నీవు చేయగలిగిన దేనితోనైనా నిన్ను నీవు దేవుని దృష్టికి యోగ్యునిగా కనబరచుకొనుటలో పూర్తిగా నిరాశచెందావా? మరియు రక్షణ కొరకై పూర్తిగా క్రీస్తు ప్రభుని రక్తంపై నీతిపైననే ఆధారపడుతున్నావా?

**వెస్లీ:** అవును, కేవలం క్రీస్తుపైనే ఆధారపడుతున్నాను.

**సిమియోను:** కానీ, నీవు మొదట క్రీస్తు ప్రభువు చేతనే రక్షింపబడిన తరువాత, ఏదో విధంగా నీ స్వశక్తితో నిన్ను నీవు రక్షించుకోవాలని అనుకోవడం లేదా?

**వెస్లీ:** లేదు, నేను మొదటినుండి చివరి వరకూ క్రీస్తుతోనే రక్షింపబడాలి.

**సిమియోను:** ఉదాహరణకు, నీవు మొదట కృపద్వారానే దేవుని దగ్గర కొచ్చావు; ఏదో విధంగా నీ స్వంత శక్తి ద్వారా నిన్ను నీవు నిలుపుకోవాలని అనుకోవడం లేదా?

**వెస్లీ:** లేదు.

**సిమియోను:** అప్పుడు నీవు ప్రతి నిమిషం, ప్రతి గంటా దేవునిచే పైకి లేవనెత్తబడుతున్నావా? (తల్లి చేతులలో వున్న చంటి బిడ్డలా)

**వెస్లీ:** అవును, పూర్తిగా అలా చేయబడుతున్నాను.

**సిమియోను:** దేవుని కృపా, కటాక్షాలపై వున్న నీ నిరీక్షణ అంతా నిన్ను ఆయన పరలోక రాజ్యానికి భద్రపరుస్తుందా?

**వెస్లీ:** అవును, ఆయనపై తప్ప, మరి దేనిపైనా నిరీక్షణలేదు.

సిమియోను వెస్లీ జవాబులతో తృప్తిపరచబడ్డాడు. పోరాడటానకతడికే కారణం దొరకలేదు. అతడు తన అలంకారిక చురకత్తిని తీసి ఒరలో పెట్టాడు.

ఈ ఇద్దరు వ్యక్తులు కృపా వేదికపైనే స్థిరంగా నిలబడ్డారు.

## ఎనిమిదవ అధ్యాయం

# నీ మాటలే నిన్ను అప్పగిస్తాయి

క్రియలు అనే వేదికపై ఆధారపడివున్న వారు వారి స్థానాన్ని, క్రింద ఇవ్వబడిన విషయాలు చెప్పడం ద్వారా అసంకల్పితంగా వెల్లడి చేస్తారు.

"నేను నా శాయశక్తులా కృషి చేస్తున్నాను."

ఈ వాక్యంలో వున్న కష్టమేమిటంటే, నీకున్న శ్రేష్ఠమైనది సరిపోదు. నీవు అర్పించే నీ "శ్రేష్ఠమైన"దంతా దేవుని దృష్టిలో మురికిగుడ్డలతో సమానం.

"చెడిపోయిన ఎంతోమందితో పోల్చుకుంటే, నేనంత చెడ్డవాడినేమి కాదు."

ఇది నిజమే కావచ్చు. కానీ నీవు దేవుని ఉన్నత ప్రమాణాల పరిపూర్ణతకు సరితూగవు. నీవు రక్షణ పొందాల్సిన అవసరం ఉంది.

"నేను క్రైస్తవునిగా వుండడానికి ప్రయత్నిస్తున్నాను. నేను నా పొరుగవారిపట్ల దయతో వ్యవహరిస్తూ మంచి జీవితాన్ని జీవిస్తున్నాను".

ప్రయత్నాలు చేయడం ద్వారా నీవు క్రైస్తవుడివి కాలేవు. ప్రభువైన యేసునందు విశ్వాసముంచడం ద్వారానే నీవు నిజ క్రైస్తవుడివి కాగలవు.

ఒక పాత కీర్తన ఇలా చెబుతోంది:

మనస్సాక్షి నిన్ను ఊగిసలాడనీయకు,
అర్హతకోసం ఆశగా కలలుగనకు;
ఆయన కోరుకునే అర్హత అంతా
ఆయన నీకవసరమని నీవు భావించడమే!
–హెచ్. స్మార్ట్

"నేను నిజాయితీగా ఉంటే సరిపోదా?"

ఒక వ్యక్తి నిజాయితీగా వుండొచ్చు. అయినా, నిజాయితీగా తప్పయి ఉండొచ్చు. అర్ధరాత్రి సమయంలో దొంగ వచ్చిన శబ్దాన్ని విన్నానని, మెట్లు దిగి క్రిందికి వచ్చిన తండ్రి కథను మీరు చదివారా? అతడు క్రిందికి వచ్చి ఒక్క క్షణం ముందుగదిలోనికి చూసి, ఎవరో కదిలాడటం చూసి తుపాకి పేల్చాడు. తీరా చూస్తే, చనిపోయింది తన ముద్దుల చిన్న కుమార్తె. అతడు నిజాయితీ గలవాడే కానీ, భయంకరంగా పొరపాటు పడ్డాడు.

"నేనెప్పుడూ చాలా భక్తిగా ఉంటాను."

కొన్నిసార్లు ఒకవ్యక్తిలోని చెడువిషయమేమిటంటే, మతం; అది అతడికి "క్రీస్తు" అవసరమనే సత్యాన్నుండి అతడిని దాచేస్తుంది. వారెన్ వియర్స్‌బి ఇలా అంటున్నారు.

> "నేడు ఎంతోమంది భక్తిగల ప్రజలు అనుకొంటున్నట్టుగానే, పౌలుకు కూడా తనను కష్టం నుండి బయటపడేలా చేసుకోవడానికి తగినంత నైతికత ఉంది. కానీ పరలోకానికి అతడిని తీసుకొని వెళ్ళడానికి తగినంత నీతి లేదు. పౌలును క్రీస్తుకు దూరంగా ఉంచినవి అతడి చెడుపనులు కాదు:– అతడు మంచివి అనుకొనే పనులు కూడా! అతడు రక్షణను కనుగొనడానికి, తన మతాన్ని కోల్పోవాల్సి వచ్చింది.[1]

"నేను పరలోకానికి వెళ్తానని అనుకొంటున్నాను".

అలా అనుకోవడం, ఆశించడం సరిపోవు; ఆ విషయాన్ని నీవు ఖచ్చితంగా తెలుసుకొని తీరాలి; ఎందుకంటే, నీవలా అనుకొనేది తప్పు కావచ్చు.

"మా తాతగారు దైవ సేవకులు."

ఇలాంటి మాటలు "రక్షణ"–పూర్తిగా వ్యక్తిగతమైనది అనే విషయాన్ని పూర్తిగా దాటవేస్తున్నాయి. మీ తాతగారి స్థానం నీకు రక్షణ కలుగచేయదు. కృప జన్యువుల ద్వారా పరుగెట్టదు. రక్షణ వంశపారంపర్యంగా వచ్చే విషయం కాదు.

"దేవుడు ఆయన కొలమానాన్ని తెలిపేవరకూ ఆ విషయాన్ని నీవు తెలుసుకోలేవు."

నీవు నీ పనులపై ఆధారపడుతూ ఉంటే, అప్పుడు చాలా ఆలస్యమైపోతుంది. దేవుని కృపావరమైన నిత్యజీవాన్ని ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నీవు స్వీకరిస్తే, ఇప్పుడే దానిని నీవు తెలుసుకొనగలవు.

"నాకు మంచి అవకాశముందని నేననుకుంటున్నాను."

నీవు రక్షకునిపై కాక నీ మీద నీవు ఆధారపడినంతవరకూ నీకెలాంటి అవకాశం ఉండదు.

"నేను రక్షణపొందానని చెప్పడం నాకు ఋజువులేకుండా దానిని వాస్తవమని ఒప్పుకోవడం లాంటిది."

రక్షణ క్రియల ద్వారా లభిస్తే, అది నిజం కావచ్చు. కానీ అది సాధారణ విశ్వాసంపై ఆధారపడిన స్వేచ్ఛావరం అయినపుడు అది ఊహాజనితమైనది కాదు. దేవుడు పశ్చాత్తాపపడి, నమ్మినవారు రక్షింపబడతారని చెప్పాడు. దానిని నమ్మడం ఊహాజనితమా? కాదు, అది ఆయన మాటను సందేహించడం అక్కడే నిజమైన వాస్తవాన్ని అంగీకరించడం ఉంటుంది.

"నా జీవితాన్ని నేను మొదట శుద్ధిచేసుకోవాలి, కదూ?"

లేదు, నీవు చేసుకోలేవు. దేవుడు నిన్ను నీ పాపములన్నిటిలో ఉన్నపాటున రమ్మని ఆహ్వానిస్తున్నాడు. నీవింగా మంచిగా అయ్యేవరకూ వేచివుంటే, నీవెన్నటికీ రాలేవు. దేవుడు మంచివారికోసం లేదా తమని తాము శుద్ధిచేసుకోవడానికి ప్రయత్నించే వారికోసం కానీ చూడడం లేదు. ఆయన దుష్టులైన పాపుల్ని రక్షించడానికి, నీతిమంతులుగా తీర్చడానికి, మహిమపరచడానికి చూస్తున్నాడు.

"పట్టుకొని వుండలేక తొట్రిల్లతానేమోనని భయంగా ఉంది".

రక్షణ అనేది పూర్తిగా కృపవలననే అని నీవు గ్రహించగానే, నీ కెలాంటి భయం ఉండదు. మొదటిగా నిన్ను నీవు రక్షించుకోవాలని అనుకున్న దానికన్నా మించి నీవు తొట్రిల్లవు. కానీ, నీకు రక్షణను ఉచితవరంగా ఇచ్చిన అద్భుతమైన రక్షకుడే నిన్ను "తొట్రిల్లకుండ మిమ్మును కాపాడుటకును, తన మహిమ యెదుట ఆనందముతో మిమ్మును నిర్దోషులనుగా నిలువబెట్టుటకును..."[2]

పైన పేర్కొనబడిన ప్రతి ఉపశీర్షికలో వున్న పదాలన్నీ ఆధారపడి వుండడాన్ని గమనించండి. తమ 'స్వంతం'పై వున్నట్టుగా తెలియచేస్తున్నాయి. వాటిలో ఒక్క పదం కూడా రక్షకుని గురించి లేదు. ఆ వ్యక్తి ప్రతీదీ తనంటే ఏమిటో దానిపైనా లేక అతడేం చేశాడో దానిపైనా ఆధారపడి ఉంటుందని అనుకొంటాడు.

## తొమ్మిదవ అధ్యాయం

# క్రియలతో వచ్చిన సమస్యేంటి?

మనం చెప్పినదానిని బట్టి మనం క్రియల్ని నమ్మటం లేదనిపిస్తుంది. మనం క్రియల ద్వారా రక్షింపబడలేమని అన్నపుడు, మనం చెప్పేదేమిటంటే యోగ్యమైన పనుల గూర్చి అని. ఇతర మాటల్లో చెప్పాలంటే క్రియలు, దేవునిని మనల్ని రక్షించేలా చేసే పనులు. మనమనుకొనేదేమిటంటే,-మనం పరలోకంలో స్థానాన్ని సంపాదించుకోవడానికి లేక అర్హత పొందడానికి చేసే క్రియలని అర్థం.

వాస్తవానికి, పశ్చాత్తాపం, విశ్వాసం కూడా క్రియలే అని చెప్పడంలో అర్థముంది. కానీ అవి యోగ్యతనిచ్చేవి కాదు. పశ్చాత్తాపమంటే నీ ముఖం దేవుని వైపు నీ వీపు పాపం వైపుకు త్రిప్పి ఉంచడం. విశ్వాసమంటే కేవలం అబద్ధమాడని దేవుని వాక్యాన్ని నమ్మడమే! పశ్చాత్తాపమనేది లేక విశ్వాసమనేది మీరేది అతిశయించగలిగేవేమి కాదు. ఇవి ప్రతి ఒక్కరూ సరియైన ఆలోచనతో తీసుకోవలసిన సహేతుకమైన చర్యలు.

పాపి చేయగలిగిన మొదటి మంచిపని క్రీస్తునందు నమ్మికయుంచడం. యూదులు "మేము దేవుని క్రియలు జరిగించుటకు ఏమి చేయవలెనని ఆయనను అడుగగా" యేసు ఇలా జవాబు చెప్పాడు. "ఆయన పంపినవాని యందు మీరు విశ్వాసముంచుటయే దేవుని క్రియ"[1]

అతడది చేసే వరకూ, దేవుని దృష్టిలో అతడి మంచి పనులన్ని చెడ్డపనులే! ప్రభువుకు సంబంధించినంత వరకూ వారు అర్పించదగిన శ్రేష్టమైనది కేవలం మురికి గుడ్డలే![2] కానీ ఒక వ్యక్తి తిరిగి జన్మించినపుడు అదంతా మారిపోతుంది. అప్పట్నుండి, దేవుని వాక్యానికి విధేయతగా అతడు ఏది చేసినా, ఇప్పుడది మంచిపనే! అతడు ప్రభువు కోసం ఏం చేసినా, ప్రభువు దానిని నాణ్యంగా యెంచుతాడు. అతిసాధారణమైన, ఎన్నతగని పనులు కూడా, వాటిని ప్రభువును సంతోషపెట్టే ఉద్దేశంతో చేస్తే అవి మంచిపనులవుతాయి. కొన్నిసార్లు మనం మంచిపనులను ఔదార్యంతో, దయతో చేసే క్రియలకు, వివిధ రకాల క్రైస్తవ సేవకు సంబంధిన పనులకే పరిమితం చేస్తాం. కానీ మన అనుదిన జీవితంలో మనం పనిచేసే చోట, మరియు ఇంట్లో మనం చేసే విధులను కూడా దేవుడు లెక్కించి క్రీస్తు న్యాయ పీఠంపై కూర్చున్నపుడు బహుమానాల నిస్తాడు.

సత్క్రియలు అనేవి రక్షణ ఫలాలే గాని మూలాలు మాత్రం కాదు; ఫలితమే గాని, కారణం కాదు. బైబిలంతటిలో విశ్వాసులు సత్క్రియలు చేయాలనే బోధ ఉంది.[3] వాటిని రక్షణ పొందడం కోసం కాదు కానీ, రక్షణ పొందారు కనుకనే చేయాలని వుంది. ఎందుకంటే మనం మంచిపనుల ద్వారా రక్షింపబడలేదు కానీ మంచి క్రియల కోసం రక్షించబడ్డాం. అవి రక్షణ ధృవీకరణకు కనిపించే ఫలితంగా ఉన్నాయి.

దేవుడు జతపరచినవాటిని మనం వేరుచేయకూడదు. ఆయన విశ్వాసాన్ని, రక్షణను జతపరిచాడు, క్రియలను, బహుమానాన్ని జతపరిచాడు. ఈ రెండు వివాహాలను గుర్తుంచుకోండి చాలు, అప్పుడంతా చక్కగా ఉంటుంది.

## పదవ అధ్యాయం

# ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి

నీవు పాపం చేస్తే, నీ రక్షణను పోగొట్టుకొంటావు, అవును కదూ?

ఎలాంటి మార్పులేకుండా, ఎప్పుడూ వచ్చే ప్రశ్నేమిటంటే "ఒక విశ్వాసి పాపం చేసినప్పుడు, అతడు తన రక్షణను పోగొట్టుకోడా?" పోగొట్టుకోడు. క్రింద ఇవ్వబడిన వాక్యాలను పరిశీలించండి.

యేసు 'నా గొఱ్ఱెలు ఎన్నటికీ నశించవు'[1] అని చెప్పాడు. పై ప్రశ్నను నిమ్మళింపచేయడానికి అది సరిపోతుంది. రక్షణ ఒక కృపావరం. దేవుడు ఒక వరమిస్తే ఆయన దానినెన్నటికీ వెనక్కి తీసుకోడు.[2] రక్షించే కృప కాపాడుతుంది కూడ.[3]

దేవుని కృపావరము నిత్యజీవము.[4] నిత్యము అంటే "ఎప్పటికీ" అని అర్థం. ఒక వ్యక్తి రక్షింపబడినప్పుడు, అతడు లేక ఆమె నూతన జన్మ ద్వారా దేవుని బిడ్డ అవుతాడు/అవుతుంది.[5] ఒక్కసారి నూతన జన్మ ద్వారా సంభవిస్తే, అది ఎన్నటికీ మారదు లేదా తుడిచివేయబడదు. అది ఎప్పటికీ ఉంటుంది. సంబంధమనేది తెగిపోని గొలుసువంటిది.

ఒకడు నీతిమంతునిగా తీర్చబడటం ఎంత ఖచ్చితమైనదో ఆ వ్యక్తి ఒక దినాన మహిమపరచబడతాడనేది కూడా అంతే ఖచ్చితం.[6] విశ్వాసిలో

పరిశుద్ధాత్మ ఎప్పటికీ నివాసం చేస్తాడు[7] అతడు పాపం చేసే వరకూ మాత్రమే కాదు. పరిశుద్ధాత్మ విశ్వాసికి సంచకరువుగా లేక పరలోకానికి వాగ్దానముగా ఇవ్వబడింది.[8] పొందబోయే మహిమకు పరిశుద్ధాత్మ హామీ ఇస్తున్నాడు. ప్రభువే అతడి యజమాని అనే విషయానికి ఋజువుగాను, అతడు పరలోకంలో మహిమాశరీరాన్ని పొందేవరకూ అతడికి భద్రతగాను ముద్రగాను వున్నాడు పరిశుద్ధాత్మ.[9]

మనము శత్రువులమై యుండగా ప్రభువైన యేసు మనలను దేవునితో సమాధానపరచాడు. పరలోకంలో ప్రస్తుతం ఆయన చేసే పరిచర్య ద్వారా ఇంకెంత ఎక్కువగా ఆయన మనల్ని కాపాడగలడు![10] మనం పరలోకానికి వెళ్ళేలా చేయడానికి మనకోసం ఆయన ఎంతో గొప్ప వెలను చెల్లించాడు.

విశ్వాసి ఎప్పటికీ దోషిగా యెంచబడడు.[11] దేవుడిప్పుడతని తండ్రి; ఇక న్యాయాధిపతి/తీర్పరి ఎన్నటికీ కాదు. క్రైస్తవుని పాపాలకు క్రీస్తు శిక్షను చెల్లించాడు.[12] దీని అర్థం ఆ వెలను అతడెన్నడూ చెల్లింపనక్కరలేదని; ఒక్క చెల్లింపు ఎప్పటికీ దానిని స్థిరపడేటట్లు చేసింది. ప్రభువైన యేసు "పనిని పూర్తి చేశాడు".[13] పూర్తిచేసిన పనికి నీవేమి కలుపలేవు. నీవలా చేయనక్కరలేదు కూడా! విశ్వంలో ఏదీ విశ్వాసిని దేవుని ప్రేమనుండి వేరు చేయలేదు.[14]

బైబిలులో కొన్నివచనాలు ఒక వ్యక్తి రక్షింపబడి, తరువాత అతడు/ఆమె చేసిన పాపం వల్ల మళ్ళీ నశించిపోవచ్చునని చెప్పేటట్టు కనిపించడం నిజమే! ఇలా కనిపించే చాలా వచనాలు తిరిగి జన్మించిన విశ్వాసుల గురించి కాక, నామాకార్థ క్రైస్తవుల గురించి చెబుతున్నాయి. ఇతర వాక్యభాగాలు రక్షణను గూర్చి కాక, సేవకు సంబంధించినవిగా వున్నాయి. కొన్ని విశ్వాసాన్ని త్యజించిన వారి గురించి వర్ణిస్తున్నాయి-అంటే ఒక్కసారి క్రీస్తునందు విశ్వాసాన్ని ప్రకటించిన వారే, కాని తరువాత క్రీస్తును

విస్మరించినవారు, ఇది వారు ఎప్పుడూ నిజముగా మారుమనస్సు పొందని వారని తెలియజేస్తోంది.

## అవును, కానీ ఒకవేళ విశ్వాసి పాపం చేస్తే?

విశ్వాసి పాపం చేసినప్పుడేమవుతుంది? దేవునితో అతని సహవాసం తెగిపోతుంది.[15] అతడికింకా దేవుడే తండ్రి[16] కానీ దేవునితో అతడి ఏకత్వం విచ్ఛిన్నమవుతుంది. తోటి విశ్వాసులతో అతడి సహవాసం తెగిపోతుంది.[17]

అతడు తన రక్షణానందాన్ని పోగొట్టుకొంటాడు.[18] అతడు తన శక్తిని పోగొట్టుకొంటాడు.[19] అతడు ప్రభావానిన చూపే తన సాక్ష్యాన్ని పోగొట్టుకుంటాడు.[20] అతడి నోరు మూతపడుతుంది. క్రీస్తు పూర్తి చేసిన పనిని బట్టి అతడింకా పరలోకానికి వెళ్ళగలిగే అర్హతను కలిగున్నాడు, కానీ ఈ లోకంలో సేవచేయడానికి అతడు పనికిరాడు.

అతడు చేసిన పాపం బహిరంగమైనదైతే, అతడు ప్రభువైన యేసు నామానికి అవమానం తెస్తాడు. రక్షకుని శత్రువులకు ఆయనను దూషించడానికి కారణమౌతాడు.[21] అతడు సజీవ అసత్యంగా ఉన్నాడు. అతడి చర్యలు అతడసలు నిజంగా మారాడా? అనే సందేహాన్ని కలుగ చేస్తాయి. 22 అదెలా వుంటుందంటే మాటలు కోటలు దాటినట్లు, నడక మాత్రం చాలా క్రింది స్థాయిలో ఉన్నట్టు ఉంటుంది. అతడు పాల మీగడలా తియ్యగా మాట్లాడడతాడు కానీ మీగడలేని పాలలా జీవిస్తాడు.

పాపము అతని ప్రార్థనా జీవితాన్ని అడ్డగిస్తుంది.[23] అతడి క్రియలన్ని కాలిపోతాయి, కానీ అతడు మాత్రం మిగిలి ఉంటాడు.[24] అతడు తన ఆరోగ్యాన్ని కోల్పోవచ్చు.[25] తన జీవితపు ఓడను బ్రద్దలు చేసుకోనే అపాయంలో అతడు వుంటాడు.[26] వెనక్కిజారిన విశ్వాసి చేసుకొన్న ఒక్క

నిర్ణయం ద్వారా, అతడి శేషజీవితాన్ని ప్రభువు సేవకు పనిరాకుండ అటకెక్కించినవాడవుతాడు.

అతడీ భువిపై తన భౌతిక జీవితాన్ని కోల్పోవచ్చు.[27] క్రీస్తుప్రభుని న్యాయపీఠం ఎదుట అతడు తన బహుమానాన్ని కోల్పోవచ్చు.[28]

అయినప్పటికీ అతడి పరిస్థితి నిరాశాజనకమైనది కాదు. దేవుని దగ్గరకు తిరిగి వచ్చే మార్గముంది. అతడు తన పాపాన్ని ఒప్పుకొని, విడిచిపెట్టగానే, [29] అతడు తన తండ్రియైన దేవుని నుండి క్షమాపణను పొందుతాడు. యోహాను వ్రాసిన మొదటి పత్రిక 1:9వ వచనం ఈ అంశాన్ని నొక్కి చెబుతోంది. ఆ వచనం ఇలా చెబుతోంది. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును." పాపము చేస్తున్న పరిశుద్ధుని బాధ్యత ఏమిటంటే, తన పాపాలను ఒప్పుకోవడం, వాటిని పేరుపేరు వరుసనా ఒప్పుకొని, ఆయన సన్నిధిలో కుమ్మరించుకోవడం. అతడు దేవుడిని క్షమించమని అడుక్కోనక్కరలేదు; వాటి గురించి విలపించనవసరం లేదు అది చాలా క్రమంతో కూడినదైనా సరే! అతడు కేవలం తన హృదయంలోనుండి ఒప్పుకోవాలి.

దేవుడు క్షమించడానికి నమ్మతగినవాడు, ఎందుకంటే తానలా చేస్తానని ఆయన వాగ్దానం చేశాడు. ఆయన క్షమించడానికి నీతిగల వాడు, ఎందుకంటే క్రీస్తు చేసిన ప్రత్యామ్నాయపు పని, అతడికావిధంగా చేయడానికి నీతిగల మార్గాన్ని అందిస్తుంది. ఆయన క్షమించడమే కాదు, సమస్త దుర్ణీతినీ శుద్ధిచేస్తాడు. రికార్డు స్పష్టంగా ఉంటుంది; అపరాధం వెళ్ళిపోతుంది. నేరారోపణ చేసే మనస్సాక్షి స్వరం నిశ్శబ్దమైపోతుంది.

రక్షింపబడని వ్యక్తి అతడి పాపాలకు పశ్చాత్తాపపడి, ప్రభువైన

యేసు క్రీస్తునందు విశ్వాసముంచితే, అతడి పాపాలకు న్యాయపరమైన క్షమాపణను పొందుతాడు. క్రైస్తవుడు తన పాపాలను ఒప్పుకొన్నపుడు, అతడు తండ్రి క్షమాపణను పొందుతాడు.

ఇక్కడ, ఒక ముఖ్య విషయాన్ని చేర్చాలి. ఒక విశ్వాసి తన పాపాల్ని ఒప్పుకొన్న మరుక్షణమే క్షమింపబడినా, తరచుగా పాప ఫలితాలు నిలిచే ఉంటాయి. అంటే అతడు పాపం చేసి దాని ఫలితాలను తప్పించుకోలేడన్న మాట.

**రక్షించబడిన తరువాత, నశించిపోయిన ఒక వ్యక్తి సంగతి నాకు తెలుసు. దాని సంగతి ఏమిటి?**

అనేక వాస్తవాలను పరిగణలోనికి తీసుకోవాలి. మొదట, కేవలం తాము క్రైస్తవులమని చెప్పుకొనేవారికి, నిజంగా తిరిగి జన్మించిన అనుభవం గల వారికి తేడా ఉంది. నామకార్థ విశ్వాసులున్నారు, నిజమైన విశ్వాసులున్నారు. ఒక వ్యక్తి తాను రక్షింపబడ్డానని చెప్పి, పాప జీవితంలో కొనసాగుతూ ఉంటే, అతడు చెప్పేదానిని సందేహించడానికి మంచి కారణం ఉంది. క్రీస్తు లోనికి వచ్చినప్పుడు, ఆ జీవితంలో ఆయన మార్పును తెస్తాడు.

తరువాత, వెనక్కి జారిపోయినవారున్నారు. వారు నిజంగా మారుమనస్సు పొందినవారే కానీ ప్రభువునుండి దూరమై తిరుగుతున్నారు. దీనికి పేతురే ఉదాహరణ. అతడు ప్రభువును నిజంగా ప్రేమించాడు కానీ పాపంలో పడ్డాడు. వెనక్కిజారినవారు దేవుని క్రమశిక్షణ ద్వారా పూర్వస్థితికి పునరుద్ధరింపబడతారు లేదా పరలోకానికి కొనిపోబడతారు.

విశ్వాసభ్రష్టులు అనబడే మరొక తరగతికి చెందినవారున్నారు. వీరు తమ స్వంత నాయకుని వదిలిపెట్టి, వ్యతిరేకవర్గం పక్షాన చేరేవారు. దీనికి ఇస్కరియోతు యూదా ఒక ఉదాహరణ. ఇలాంటి వారెన్నడూ క్రొత్తగా జన్మించరు. కానీ వారు విశ్వాసుల వలె నటిస్తారు. వారిలో కొందరు

బాప్తిస్మం తీసుకుని స్థానికి సంఘంలో సభ్యులుగా స్వీకరించబడిన వారున్నారు. కానీ, తరువాత వారు ద్వేషంతో క్రీస్తును నిరాకరించి, క్రైస్తవ సత్యాన్ని విడిచిపెట్టారు. ఇలాంటి వ్యతిరేక పక్షాన చేరేవారు మారడం అసాధ్యం.

ఈ విషయాలన్నింటిలోను, మన సిద్ధాంతాన్ని మనం అనుభవంపై లేక ఉద్వేగాలపై ఆధారపడి చేయకూడదు. పరీక్ష ఏమిటంటే, "బైబిల్ ఏమి చెబుతుంది?" అనేది. బైబిలు నిజమైన విశ్వాసి ఎప్పటికీ రక్షణపొందిన వాడని చెబుతోంది.

**ఇది మరీ సులువైనది. రక్షణ అనేది ఉచిత వరమని అనుకోవడం సహేతుకం కాదు. నీ సువార్త చాలా చౌకబారుగా లేదా?**

దీనికి బైబిల్ జవాబేమిటంటే, మనకది చౌకైనదిగా అన్పించవచ్చు. కానీ రక్షకునికది చౌకగా అన్పించదు. అది ఆయనను సమస్తము చెల్లించేదిగా చేసింది. అది ఆ వరం యొక్క స్వభావంలోనే వుంది. దాతకు వెల ఉంటుంది కానీ స్వీకర్తకు వెల చెల్లించే అవసరం లేదు. కానీ, ప్రజలు పుట్టినరోజు కానుకలను, పెళ్ళికానుకలను, లేక క్రిస్మస్ కానుకలను తిరస్కరించరు. అలాంటప్పుడు, అన్ని కానుకలకన్నా గొప్ప కానుకను ఎందుకు తిరస్కరించాలి?

"మరీ చౌకగా ఉంది" అనే అభ్యంతరం వెనుక మానవ గర్వం ఉంది. ప్రజలు పరలోకానికి వారి స్వంత టికెట్టును కొనుక్కోవడానికి ఏదైనా ప్రశంసింపతగినది వారు చేయగలరనే ఆలోచనకు బాగుచేయలేనంతగా అలవాటు పడిపోయారు. ఎందుకంటే, కృప అటువంటి సాధ్యతను కొట్టిపారేస్తుంది, అది వారికిష్టం లేదు. వారు దానిని తిరస్కరిస్తారు.

పదకొండవ అధ్యాయం

# దుర్వినియోగపరచబడి, తప్పుగా వాడబడిన కృప

ఇతర మంచి విషయాలన్నిటివలె "కృప" కూడా దుర్వినియోగపరచబడగలదు. అగ్ని, నీరు గొప్ప ఆశీర్వాదాలే కావచ్చు కానీ, అవి తప్పుగా ఉపయోగంచబడ గలవు. ప్రజలు దేవుని సార్వభౌమత్వాన్ని ఖర్మసిద్ధాంతంగా మార్చగలరు: 'జరిగేదేదో జరుగుతుంది. దాని గురించి నీవు చేయగలిగిందేమీ లేదు.' దేవుడు ముందుగానే కొందరిని రక్షణకు ఏర్పరచుకొంటాడు అని చెప్పే సిద్ధాంతాన్ని వక్రీకరించడం ద్వారా కొన్నిసార్లు సౌవార్తీకరణ అనేది సమయాన్ని, శక్తిని వృధా చేసుకోవడమే అనిపిస్తుంది.

దేవుని కృపను నిర్లక్ష్యంగా జీవించడానికి సాకుగా ఉపయోగించుకొనే సాధ్యత ఉండడం విచారకరం. ఒక విశ్వాసికి ఆమె లేక అతడి స్వేచ్ఛను అన్నిరకాల ఆనందాల్ని /కోర్కెల్ని పూర్తిగా అనుభవించడానికి ఒక అల్ప కారణంగా ఉపయోగించుకొనే అవకాశం ఉంది. దీని అర్థం సిద్ధాంతం తప్పుతో కూడిందని కాదు. ఇది కొందరు ప్రజలు తమ భక్తిహీనమైన ప్రవర్తనను సమర్థించుకోవడానికి చేసే విశ్వప్రయత్నం. దానికి లేఖనాలను ఉపయోగించుకోగలిగితే ఇంకా బావుంటుందని వారనుకొంటారు.

విశ్వాసులు ధర్మశాస్త్రం క్రింద కాక, కృప క్రింద వున్నారనేది వాస్తవం.[1] కానీ, అలా అని చెప్పి, వారు చట్టం లేకుండ ఉండాలని అర్థం కాదు. వారు శిక్షావిధిని, నేరారోపణను కల శాసనం క్రింద లేరు. కానీ, వేరు క్రీస్తు కోసం ధర్మశాస్త్రం క్రింద వున్నారు.[2] అంటే, వారు క్రీస్తుకు ప్రేమబంధాలచే కట్టబడి, ఆయన దృష్టికి ఇష్టమైన పనులు చేయడానికి ఖైదుచేయబడ్డారు. ఈ సంబంధాన్ని కలిగి ఉండడం క్రింది వచనంలో చక్కగా వ్యక్తీకరించబడింది.

నీకు బందీగా నన్ను పట్టించేందుకు
ధర్మశాస్త్రం కావాలా నాకు?
ఆనందంగా బందీ అయ్యింది నా హృదయం నీకు.
ఎన్నటికీ విడుదలపొందే అవసరం లేదిక.

ప్రభువు ఒక వ్యకిని స్వేచ్ఛాపరునిగా లేక స్వతంత్రునిగా చేసినపుడు, అతడు నిజంగా స్వతంత్రుడే[3] అనేది సత్యం. కానీ దాని అర్థం పాపం చేయడానికి స్వతంత్రత అని కాదు. స్వేచ్ఛ అనుమతి పత్రం కాదు. విమానం నడిపే వ్యక్తి అంతరిక్షాన్ని పరిశోధించే స్వేచ్ఛను కలిగున్నాడు, కానీ అతడు తన గమ్యస్థానాన్ని క్షేమంగా చేరుకోవాలంటే అతనికి కేటాయించిన విమానమార్గాన్ని వెంబడించడం అతడికి మంచిది. పౌలు గలతీయులకు (మరియు విశ్వాసులందరికీ) ఇలా బోధించాడు. "సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒక మాట, ఆ స్వాతంత్ర్యమును శారీర క్రియలకు హేతువు చేసికొనిన..."[4]

జాన్ మెకార్థర్ ఈ విషయాన్ని చక్కగా తెలియచేస్తున్నాడు: "ధర్మశాస్త్రం నుండి స్వేచ్ఛను పొందడమంటే, పాపపు దాస్యం నుండి ధర్మశాస్త్రపు శిక్షనుండి స్వతంత్రులు కావడమే తప్ప నైతిక హద్దుల నుండి స్వతంత్రత పొందడం కాదు. కృప అంటే మనకిష్టమైన దానిని

మనం చేయడానికి అనుమతి పొందామని అర్థం కాదు, దాని అర్థం దేవునికిష్టమైన దానిని చేయడానికి మనకి శక్తి వుందని; కృప యొక్క ముఖ్య ఉద్దేశం మనల్ని పాపం నుండి విముక్తులుగా చేయడం గనుక, దేవుని కృప మనకు పాపం చేయడానికి అనుమతినిస్తుందనే సూచన లేక ఆలోచన స్వయం-విరుద్ధమవుతుంది. కృపను పొందిన మనము పాపంలో ఎలా కొనసాగగలం?"[5]

నిర్లక్ష్యంతో కూడిన జీవితాన్ని జీవించడానికి ప్రజలు కృప అనే పదాన్ని సాకుగా ఎందుకు వాడతారు? బహుశా వారు నిజంగా రక్షణ పొందలేదేమో! మార్డి గ్రాస్‌ను జరుపుకొనే భక్తిగల ప్రజల్ని గురించి ఆలోచించండి. వారా మంగళవారం రాత్రివరకు త్రాగడంలో, అనైతిక చర్యలతో గడిపి, భస్మ బుధవారం రోజు క్షమాపణ కోరాలని ప్రణాళిక వేసుకుంటారు; లెంటు సమయంలో ఆ పాపాలకు దూరంగా ఉండాలని ఆశిస్తారు.

ఇతరులు మరికొందరు, విశ్వాసులైనా నిజమైన కృపా సిద్ధాంతాన్ని ఎరుగని స్థితిలో ఉంటారు. బహుశా వారు దేవుని పరిశుద్ధతా సత్యాన్ని అర్థం చేసుకోకపోవడం వలన కావచ్చు. లేదా పాపాన్ని గురించి వారి అభిప్రాయం లోతులేనిదై వుండి వుండొచ్చు. ఒక వ్యక్తి రక్షింపబడి వుండొచ్చు; అయినా సరియైన బోధ సక్రమంగా విని వుండకపోవచ్చు.

కొందరి విషయంలో అది కావాలని తెచ్చుకొన్న తెలియని తనం కావచ్చు. వారి కవసరమైన దేమిటో వారికి తెలుసు. అయినా వారు ప్రభువుతో సహవాసంలో ఉండరు. వారు వెనక్కిజారిన స్థితిలో వుండి, దేవుడు తమ చిన్న పాపాల్ని లెక్కలేనితనంతో చేసిన తప్పుల్ని, చూసి చూడకుండా ఉంటాడులే అనే ధైర్యంతో ఉంటారు.

లేకపోతే, వారు విశ్వాసభ్రష్టులై యుండవచ్చు. ఇటువంటివారిని గురించి, యూదా "వారు భక్తిహీనులై మన దేవుని కృపను కామాతురత్వమునకు

దుర్వినియోగపరచుచు, మన అద్వితీయనాధుడును, ప్రభువునైన యేసు క్రీస్తును విసర్జించుచున్నారు...."[6] అంటున్నాడు.

పన్నెండవ అధ్యాయం

# దేవుడు పరిశుద్ధతనెలా కలుగచేస్తాడు?

రక్షణ అనేది విశ్వాసం ద్వారా కృప చేతనే కలిగిందని, క్రియల వలన కాదని చూశాము. కానీ "రక్షింపబడినవారి జీవితాల్లో పరిశుద్ధత ఎలా సాధించబడుతుంది?" అనే ప్రశ్న మిగిలే ఉంది. ఒక వ్యక్తి క్రైస్తవుడయ్యాక అతడి జీవితంలో మార్పు ఉండాలి. ప్రశ్న ఏమిటంటే, "ఈ మార్పును సాధించే ప్రక్రియ ఏమిటి అది ఎలా ఉంటుంది?"

నిజానికి, ఆలోచింపతగిన మార్గాలు రెండు వున్నాయి. అవి ధర్మశాస్త్రం ద్వారానైనా లేక కృప ద్వారానైనా అయ్యుండాలి; ప్రజలు పరలోకానికి వెళ్ళడానికి ఆశించే మార్గాలు ఈ రెండే కావడంతో, వారి జీవితాల్లో పరిశుద్ధత కలిగుండడానికి కూడా ఈ రెండు మార్గాలేనని ప్రజలు అనుకుంటారు.

అత్యంత స్వాభావికమైని, మానవసంబంధమైన విధానమేమిటంటే, ప్రజల్ని ధర్మశాస్త్రం క్రింద నిలపడం. చేయాల్సినవి, చేయకూడనివి లాంటి కొన్ని నియమాలను పాటించమని చెప్పడం. ఈ నియమాలను వారు తమ స్వంతబలంతో పాటించాలని చెప్పడం. ధర్మశాస్త్రానికి ఇంకా పదును రావాలంటే దాన్ని పాటించి, విధేయత చూపకపోతే, వారు తమ రక్షణను

పోగొట్టుకుంటారని చెప్పడం. పరిశుద్ధ జీవితాలను జీవించడానికిది ఖచ్చితంగా సహేతుకమైన తర్కింపతగిన మార్గంగా కనపడుతుంది. లేకపోతే, ప్రజలు బయటకు వెళ్ళి, అన్ని రకాల పాపసంబంధమైన ప్రవర్తనలో మునిగిపోతారు అనేది ఒక కనీస వాదం.

ధర్మశాస్త్రమే పరిశుద్ధతకు రాజమార్గమని చెప్పడంలో గల సమస్య ఏమిటంటే, అది పనిచేయకపోవడం. ప్రజలు తమ స్వశక్తితో మొదటిగా తమని తాము రక్షించుకోలేరు. అలా రక్షించుకోలేరు కనుకనే తమ స్వంతబలంతో ఎంతమాత్రం పరిశుద్ధ జీవితాలు జీవించలేరు. "మీరింత అవివేకులైతిరా? మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, యిప్పుడు శరీరానుసారంగా పరిపూర్ణలగుదురా"[1] అని పౌలు గలతీయులను అడగడంలోని అర్థమిదే! ధర్మశాస్త్రం ప్రజలకు ఏమి చేయాలో చెబుతుంది. కానీ అలా చేయడానికి శక్తినివ్వదు. అలా చేయని వారిని శిక్షిస్తుంది. పరిశుద్ధతకు నడిపించబడ్డానికి బదులుగా చట్టం దానికి వ్యతిరేకంగా ప్రవర్తించే వారిని తప్పుచేసినట్టు నిర్ధారిస్తుంది. నిషిద్ధఫలం ఎలా తీయగా ఉంటుందో, అదే విధంగా, ఒక వ్యక్తికి ఫలానా పని చేయవద్దని నీవు చెప్పినపుడు, అది అతడి పడిపోయిన స్వభావంలో ఆశను రగిలిస్తుంది. కనుక ధర్మశాస్త్రం ఎన్నటికీ పరిశుద్ధతను కలుగచేయలేదు. అది చేయగలిగినదంతా, పాపాన్ని వెల్లడి చేసి, దోషుల్ని శిక్షించడమే.

పరిశుద్ధతను కృప ద్వారా ఉత్పన్నం చేయడం దేవుని విధానం. దీనిని దేవుడెలా వివరిస్తున్నాడో నన్ను విశదీకరించనివ్వండి. "ఇటు చూడు, నా కృప ద్వారా నేను నిన్ను రక్షించాను. ఇప్పుడు నీ రక్షకునికై ప్రేమతో కదిలింపబడి, బయటికి వెళ్ళి నీ విశ్వాసానికి తగినట్లు జీవించు."

కృపకు పాత్రులు కావడం, పరిశుద్ధ జీవితాన్ని జీవించడానికి ప్రేమతో కూడిన ప్రేరణ కావడాన్ని గమనించు. శిక్షాభయంతో ఎన్నడూ చేయలేనిదానిని ప్రజలు ప్రేమ ఉన్నప్పుడు చేస్తారు. భయం కన్నా ప్రేమ

బలమైన ప్రేరణగా ఉంటుంది. ప్రభువుకొరకు గల ప్రేమ పరిశుద్ధ జీవితాన్ని కలిగిస్తుంది; భయం ఎప్పటికీ అలా చేయలేదు.

క్రీస్తు చేసిన పనిని ఆధారం చేసుకొని విశ్వాసి దేవుని యెదుట సంపూర్ణంగా నిలిచేలా "కృప" సహాయపడుతుంది. తరువాత ఇది విశ్వాసికి ఈ స్థితికి సరిపోయేటట్టుగా పెరుగుతూ వస్తుంది. అతడి అభ్యాసం అతడి 'స్థానం"వలె మరింతగా తయారుకావాలి. అతడు దేవుని కుమారుడని పిలువబడతాడు కనుక అతడి నడక రాజకుటుంబానికి చెందిన సభ్యుని నడకవలె ఉండాలి. జె.ఎఫ్. స్ట్రోమ్‌బెక్ ఇలా చెబుతున్నారు. "దేవుడు మొదట కృపలో ఆయన ఏం చేశాడో దానిని గుర్తుచేస్తాడు; తరువాత దానిపై ఆధారపడి, ఆయన చేసిన పనితో కలిసి ముందుకు వెళ్ళే జీవితాన్ని జీవించమని కోరుతాడు."[2]

దేవుని బిడ్డయొక్క స్థానం, అతడు క్రీస్తులో ఏమైయున్నదో దానిని బట్టే ఉంటుంది. "క్రీస్తులో" అనే పదాలు, దేవుని యెదుట అతడి స్థానాన్ని అర్థం చేసుకోవడానికవసరమైన కీలక పదాలు. అతడు ప్రభువైన యేసును తన రక్షకుడిగా అంగీకరించాడు కాబట్టి ఇదేవిధంగా దేవుడతడిని చూస్తాడు. అతడి అభ్యాసం అనుదిన జీవితంలో అతడెలా జీవిస్తున్నాడు అనేది.

దురదృష్టవశాత్తూ, ఒక క్రైస్తవుని స్థితి, అతడి హోదాకు (క్రీస్తులో అతడి హోదాకు) తగినట్టుగా ఈ జీవితంలో పరిపూర్ణంగా ఎప్పటికీ సరితూగడం లేదు. కానీ, అది ఆ దిశలోనే పెరుగుతూ చలిస్తూ ఉండాలి. అతడు పరలోకంలో క్రీస్తునందు మహిమపరచబడినప్పుడు, అతడి అభ్యాసం పరిపూర్ణమవుతుంది, కానీ, ఇక్కడ వున్నప్పుడే గొప్ప అభివృద్ధిని సాధిస్తే అది దేవునికి మరింత మహిమను కలిగిస్తుంది.

క్రీస్తులో నున్న క్రైస్తవుని హోదాను వివరించే విశేషణాలలో కొన్ని పునర్జన్మ; క్షమించబడడం; సమాధానపరచబడడం; విమోచింపబడడం;

అంగీకరించబడడం; పూర్ణులు కావడం; నీతిమంతులుగా తీర్చబడడం; పరిశుద్ధపరచబడడం, మహిమపరచబడడం మొదలైనవి.

అభ్యాసాన్ని వర్ణించే క్రియా పదాలలో కొన్ని: ఉండు, చేయు, నడువు, అప్పగించు, అర్పించు, ఇవ్వు, లెక్కించు, నిలువు, పోనివ్వు, విసర్జించు, ధరించు, లోబరుచుకొను మొదలైనవి.

దేవుని పద్ధతి ఏమిటంటే, తన యెదుట విశ్వాసికి పరిపూర్ణ స్థానాన్ని ఇవ్వడం, ఆ మార్గంలో చక్కగా నడుచుకోమని బోధించడం. ఇది ధర్మశాస్త్రానికి పూర్తిగా వ్యతిరేకమైనది. ధర్మశాస్త్రం/చట్టం, "నీవొక ప్రత్యేక స్థాయిని చేరుకొంటే, నీ హోదాను నీవు సంపాదించుకొంటావు" అని చెబుతుంది. ఇది అసాధ్యం, అది అలా చేయలేనిది. కృప "నీకు నేను స్థానాన్ని/హోదాను ఉచితవరంగా ఇచ్చాను; నీవిప్పుడు అందులో యోగ్యంగా నడచుకో!" అని చెబుతుంది. ఇది అంతరంగంలో నివాసం చేసే పరిశుద్ధాత్మ శక్తి వలన జరుగగలదు.

భార్య చనిపోయిన వ్యక్తి తన ఇంటిని, పిల్లలను చూడడానికి ఒక హౌస్ కీపర్ (గృహ నిర్వాహకురాలిని) ని జీతం మీద కుదుర్చుకోవడాన్ని గురించి బహుశా మీరు వినే వుంటారు. అతడామెకు రెఫ్రిజిరేటరు డోర్‌పై కొన్ని విధులను వ్రాసి అంటించాడు,-అలా విధులను చూపించడం ద్వారా ఆమెకు తన బాధ్యతలేమిటో స్పష్టంగా తెలుస్తాయని అతడు భావించాడు.

తరువాత ఏమయిందో తెలుసా? అతడా రమ్యమైన స్త్రీతో ప్రేమలో పడ్డాడు. వారు వివాహం చేసుకోగానే అతడామెనుద్ధేశించి వ్రాసిన విధులను రిఫ్రిజిరేటరు నుండి తీసివేశాడు. ఆమె తనపనిని ఇంకా నాణ్యతతో చేస్తూ వచ్చింది; కానీ ఆమె దానిని ప్రేమతో చేస్తోంది, కానీ తన ఉద్యోగాన్ని కోల్పోతానేమోననే భయంతో కాదు.

సరియైన విధంగా అర్థంచేసుకుంటే, పరిశుద్ధ జీవితానికి బలమైన ప్రేరణనిచ్చేది ప్రేమే! దాని గురించి ఈ విధంగా ఆలోచించండి. ప్రభువైన యేసు విశ్వాసుల పాపాలను తీసివేయడానికి తనను తాను త్యాగం చేసుకోవడం ద్వారా మరణించాడు. ఆయన మరణానికి కారణమైన దానిలో కొనసాగాలని ఇప్పుడు వారు అనుకుంటారా? ఆయన తన ప్రజల ప్రియాతి ప్రియమైన స్నేహితునిగా తనను తాను ఋజువు చేసుకొన్నాడు. వారు వారు చెప్పేది, చేసేది-అంతటినీ ఆయనకెంతో యిష్టమైనదిగా ఉండేలా తమ జీవితోద్దేశాన్ని చేసుకోరా?

ఆయన మరణించినపుడు ఆయన వారి స్థానంలో మరణించాడు. ఆయన మరణించినపుడు, వారు మరణించారు. స్థానాన్ని బట్టి వారు పాపానికి మరణించారు. అభ్యాసంలో వారు తమని తాము పాపానికి మరణించినట్టుగా పరిగణించుకున్నారు. రోమా 6వ అధ్యాయంలో పౌలు ఈ విషయాన్ని చర్చించారు. ఆయన ఇలా అడుగుతున్నారు. "కృప విస్తరింపవలెనని పాపమందు నిలిచియుందుమా?[3] తరువాత వెంటనే ఆయన తీవ్రంగా ఇలా జవాబు చెప్తున్నారు. "అట్లనరాదు, పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట ఏలాగు దానిలో జీవించగలము?"[4] ఒక వ్యక్తి కృప ద్వారా రక్షింపబడక ముందు, అతడు పాపానికి బానిస. ఇప్పుడతడు నీతికి బానిస. అతడు ఈ పరిశుద్ధమైన దాస్యానికి తనను తాను అప్పగించుకోవాలి.

ఎవరో ఇలా చెప్పారు. ఒక్కసారి వెనక్కి తిరిగి-ఎంతో గొప్ప త్యాగానికి విస్తారమైన పాపాన్ని గూర్చి ఆలోచన చేసి, అప్పుడు పాపంతో ఇక ఎప్పటికీ సంబంధంలేనట్టుగా నిశ్చయించుకో!

ఈ విషయాన్ని జాన్ బన్యన్ ఇంకా తీవ్రంగా, బలంగా వ్యక్తం చేశాడు.

> "దేవుని న్యాయాన్ని ఎదిరించడం; ఆయన కృపారసాన్ని పీల్చి పిప్పిచేయడం; ఆయన సహవాసాన్ని వేళాకోళం చేయడం; ఆయన శక్తిని నిర్లక్ష్యపెట్టడం; ఆయన ప్రేమను ధిక్కరించడమే పాపం."

దేవుని ప్రజల్ని పాపం నుండి వేరుచేసే వంతెన వారు తిరిగి వెనక్కి ఆ వంతెనపై నడవలేనంత గొప్పదైన వెలతో కొనబడింది.

## యోగ్యమైన నడక అంటే ఏమిటి?

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, "యోగ్యమైన నడకంటే ఏమిటో నాకెలా తెలఎస్తుంది?" దీనికి జవాబు దేవుని వాక్యంలో ఆచరించడాని కివ్వబడిన ఆదేశాలలో ఇవ్వబడింది. క్రొత్త నిబంధనలో అటువంటి ఆజ్ఞలు వందల కొలదిగా వున్నాయి, కానీ ఇక్కడ మనం వివరణకు చెందిన ఒక పదాన్ని త్వరగా చేర్చాలి. అక్కడ ఇవ్వబడిన ఆజ్ఞలు శిక్షావిధితో కూడిన ధర్మశాస్త్రపు ఆజ్ఞలుగా ఇవ్వబడలేదు. బదులుగా అవి నీతికి సంబంధించినవై యుండి, "కృప ద్వారా రక్షింపబడిన వ్యక్తికి ఎటువంటి ప్రవర్తన అవసరం!" అనే ప్రశ్నకు జవాబు చెబుతుంది. ఒకే ఒక్క వాక్య భాగంలో వున్న కొన్ని ఉదాహరణలు క్రింద ఇవ్వబడ్డాయి.[5]

> "...మీరు అబద్ధమాడుట మాని, ప్రతివాడును, తన పొరుగువానితో సత్యమే మాట్లాడవలెను..." "కోపపడుడి గాని పాపము చేయకుడి" "దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడవలెను." "...దుర్భాష ఏదైనను మీ నోట రానియ్యకుడి." "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి." "సమస్తమైన దోషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి."

కాబట్టి రక్షణను తెచ్చిన అదే కృప క్రిందివిధంగా కూడా బోధిస్తుందని

మనం చూస్తున్నాం. "మనము భక్తిహీనతను, ఇహలోకసంబంధమైన దురాశలను విసర్జించి....ఈ లోకములో స్వస్థబుద్ధితోను నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెను."[6]

స్ట్రోమ్‌బెక్ ఇలా నొక్కి చెబుతున్నాడు.

> ...ప్రస్తుతమున్న తక్కువ స్థాయి క్రైస్తవ గుణానికి ముఖ్యకారణం కృపను గూర్చిన అసంపూర్ణ బోధలే. కృప దాని పరిపూర్ణతలో బోధింపబడి, గ్రహింపబడినపుడు, కృప పాపం చేయడానికి అనుమతినిస్తుందనే దురభిప్రాయాల నుండి ఎంతోమంది తొలగించబడతారు.[7]

## నా దాగుచోటు

పతనమైన మనిషిని రక్షించే పథకానికి
నాంది పలికిన సార్వభౌమ ప్రేమకు జయం!
నా ఆత్మకు దాగుచోటునిచ్చిన సాటిలేని,
ఉచితమైన శాశ్వత కృపకై జయం.

ఆకాశాన్ని నిర్మించిన దేవునికి వ్యతిరేకంగా
నేను చేతులు పైకెత్తి పోరాడాను,
ఆయన కృప ప్రస్తావనను హీనంగా చూశాను
దాగుచోటును వెతకలేనంత గర్వించాను.

దట్టమైన ఐగుప్తు చీకటిచే పూర్తిగా కప్పివేయబడి
వెలుగుకన్నా చీకటినే ఇష్టపడుతూ
పాపపు పందెంలో పిచ్చిగా పరుగెట్టాను
దాగుచోటులేకుండా-భద్రంగా ఉన్నాననుకొన్నాను

కానీ, నిత్యమైన ఆదేశం వెలువడింది:
సర్వశక్తుని ప్రేమా, ఆ వ్యక్తిని బంధించుమని!
దు:ఖకరమైన బాణాలు గ్రుచ్చుకున్నట్టనిపించింది
నాకెలాంటి దాగుచోటు లేదని తెలిసింది.

ఆగ్రహిస్తున్న న్యాయమూర్తి ఎదురుగా నిలిచివున్నాడు:
మండుతున్న సీనాయి పర్వతంపైకి నేనెగిరిపోయాను;
కానీ న్యాయమూర్తి ముఖం చిట్లించి అరిచాడు
ఈ పర్వతం దాగుచోటు కాదని!

అంతలోనే, ఓ పరలోక స్వరాన్ని నేను విన్నాను
కరుణ యొక్క దేవదూత త్వరగా ప్రత్యక్షమయ్యాడు.
వెలుగుతున్న ముఖంతో నన్ను నడిపించాడు
నా దాగుచోటైన యేసు నొద్దకు.

ఆయనపై సర్వశక్తుని ఉగ్రత పడింది
అది ప్రపంచాన్నే నరకంలో ముంచెత్తగల తీవ్రమైనది
పాపిష్టి జాతి కోసమే ఆయన దాన్ని భరించాడు
ఆ విధంగా ఆయన వారికి దాగుచోటు అయ్యాడు

ఉరుములతో కూడిన ఏడంతల తుపాను వచ్చినా
భూగోళాన్నది ఒక ధృవం నుండి మరో ధృవానికి కుదిపేసినా,
ఏ పిడుగూ నా ముఖాన్ని భయపెట్టలేదు,
ఎందుకంటే యేసే నా దాగుచోటు గనుక

బహుశా, మరికొన్ని సూర్యాస్తమయాలు నన్ను
ప్రకాశవంతమైన కానాను తీరాన నిలబెట్టవచ్చు;
అక్కడ నేను కృపగీతాన్ని పాడతాను,
మహిమాన్వితమైన నా దాగుచోటును కళ్లార చూస్తాను.

మేజర్ జాన్ ఆంద్రే, క్రీ.శ.1780, సెప్టెంబరు 23వ తేదీన ఖైదీగా పట్టబడినపుడు అతని దగ్గర ఈ వచనాలు దొరికాయి. ఈ కవితను రాసింది అతడో కాదో తెలియదు.

## పదమూడవ అధ్యాయం

# అంతా కృపయే!

ఆది నుండి అంతం వరకూ క్రైస్తవజీవితం కృపామయం! ఆయనను ప్రేమించేవారిపై సర్వకృపానిధియగు దేవుడు తన దయను కుమ్మరించడం ఎన్నటికీ మానడు. కొన్నిసార్లు ఆయన దయ కంటికి కనబడకుండా దాగి ఉంటుంది. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆయన దయ చూపించడం ఎన్నడూ మరిచిపోలేదనే విషయం స్పష్టమౌతుంది.

విశ్వాసులు అద్భుతమైన తమ భద్రతలో దైవకృపను చూస్తారు. ప్రబలుతున్న వ్యాధులన్నిటినీ, ప్రమాదాలు జరిగే అసంఖ్యకమైన అవకాశాలను, ప్రయాణంలో ఎదురయ్యే చిక్కులను, హింసాత్మక వ్యక్తుల నుండి ఎదురయ్యే బెదిరింపులను గురించి ఆలోచించండి. వీటన్నిటి నుండి తప్పింపబడి జీవితం సాఫీగా సాగడం అత్యద్భుతానికి తక్కువైనది కాదు కదా!

నడిపింపులో ప్రభువు కృపను గురించి ఆలోచించండి. ఎంతోమంది నడిపించడానికి వుండొచ్చు. అయినా ఆయన దానిని అనంతమైన శ్రద్ధతో, సమగ్రమైన పూర్తి నైపుణ్యంతో చేస్తాడు. కాబట్టి ప్రతి ఒక్కరూ క్రింది విధంగా చెప్పగలరు:

కరుణతో, న్యాయంతో
నా జీవితపు వలను ఆయన అల్లినాడు.

"నా యేసు సమస్తాన్ని చక్కగా చేశాడు" అని ప్రతి ఒక్కరూ పాడగలరు. కొన్నిసార్లు మార్గం జాడలేని ఎడారిలా ఉంటుంది. మరికొన్నిసార్లు, అది సహజవనరులు సమృద్ధిగా లభించే గనిలా ఉంటుంది. అయినా, జీవిత అధ్యాయాలన్నిటిలో ఆయన తీయని, అలసిపోని శ్రద్ధతో తాను రక్తం చిందించిన మందను చక్కగా నడిపిస్తాడు.

తరువాత దైనందిన అవసరాలను తీర్చడంలో ఆయన కృప. దయగల దేవుడు తన ప్రియుల ప్రతి అవసరాన్ని తరిగిపోని తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో తీరుస్తాడు. "అతి శ్రేష్టమైన గోధుమల ననుగ్రహించి నేను వారిని పోషించుదును. కొండ తేనెతో నిన్ను తృప్తిపరచుదును."[1]

తాత్కాలిక లేక తక్షణ అవసరాన్ని ఆయన తీర్చేవిధానం పరిస్థితుల్ని ఆయన పూర్తిగా తన ఆధీనంలోనికి తీసుకోవడంలోను, ఒక దాని తరువాత ఒకటిగా జరిగే సంఘటనల క్రమంలోను, ఆయన సమయంలో జరగడంలోను ఋజువు జేయబడుతుంది. ఆయన కృపలో జరిగేదేదీ యాధృచ్ఛికంగా జరగదని ఆయన హామీ ఇస్తున్నాడు. దానికి విరుద్ధంగా ఆయనను ప్రేమించేవారికి మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరిగేటట్టు చేస్తాడు. ఎందుకంటే ఆయన పిల్లలు ఆయన కనుపాపలు. "వారికి విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్ధిల్లదని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. న్యాయవిమర్శలో నీకు దోషారోపణచేయు ప్రతివానికి నీవు నేరస్థాపన చేస్తావు.[2] ఆయన తన ప్రజల క్షేమం కోసం ఆయన మహిమకోసం, తన అధికారాన్నుపయోగించి దుష్టుల చెడుతనాన్ని అణచివేస్తాడు.

ఆయన క్షమాగుణంలో ప్రకాశించినంత గొప్పగా కాంతివంతంగా ప్రభుని కృప దేనిలోనూ ప్రకాశించదు. దాని పరిమాణాన్ని ఎవ్వరూ కొలువలేరు. దావీదు అని పిలువబడే రాజు విషయం ఆలోచించండి. మొదట, అతడు బత్షెబతో ఆమె భర్త ఊరియా యుద్ధంలో దూరంగా ఉన్నపుడు వ్యభిచారం చేశాడు. నమ్మకస్తుడైన ఈ సైనికుడిని (అంటే పై అధికారికి బదులుగా యుద్ధంచేసే సహాయకుడిని) దావీదు యుద్ధం నుంచి వెనక్కి పిలిపించి, పుట్టబోయేబిడ్డకు ఊరియానే తండ్రి అయ్యేటట్లు కనిపించే పరిస్థితుల్ని కల్పించడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం విఫలం కావడంతో దావీదు ఇంకా హీనమైన ప్రణాళిక వేసి, ఊరియాను శత్రువు కంటికి దగ్గరగా కనిపించేటట్టు, అతడికి చావు ఖచ్చితంగా సంభవించేటట్టు పథకం వేశాడు. రాజు చేసిన అవినీతి నమ్మక ద్రోహం అటువంటి సార్వభౌమాధికారానికి తగనిది. అయినా, అతడు పశ్చాత్తాపపడగానే అతడు అన్ని నిర్బంధాలనుండి విడుదల కలిగించే ఈ మాటల్ని విన్నాడు. "...యెహోవా నీ పాపమును పరిహరించెను". ఇటువంటి అసాధారణమైన క్షమాగుణమే సామ్యూల్ డేవిస్‌ను క్రింది విధంగా వ్రాసేలా చేసింది:

అద్భుతాలు చేసే గొప్ప దేవా!
నీ మార్గములన్నీ నీ దైవలక్షణాలను కనుపరుస్తున్నాయి
కానీ, నీ కృపా మహిమ ప్రకాశాలు
నీవు చేసే ఇతర అద్భుతాలకన్నా మిన్నగా ప్రకాశిస్తాయి.
నీలా క్షమియించే దేవుడెవరున్నారు?
ఇంత సమృద్ధిగా ఉచితమైన కృపను చూపేదెవరు?

ఎంతటి తీవ్రమైన దోషాలనైన క్షమించడం,
ఎంతటి అపరాధులు, ఎదిరించే పురుగులనైన వదిలేయడం!
ఇదే నీ గొప్ప విశేషాధికారం
ఈ ఘనతలో ఎవరూ పాలుపొందలేరు

నీలా క్షమియించే దేవుడెవరున్నారు?
ఇంత సమృద్ధిగా ఉచితమైన కృపను చూపేదెవరు?

అవసరమైన ప్రతిసమయంలో మన దేవుడు తన ప్రజలకు చేయూతనిచ్చే కృప ననుగ్రహిస్తాడు. శస్త్రచికిత్సను ఎదుర్కొంటున్నప్పుడు క్రైస్తవులు తమ స్వశక్తికి మించిన శాంతిని తెలుసుకోగలరు. వ్యాధిగ్రస్తులైనప్పుడు వారు తమ క్రిందనున్న శాశ్వతహస్తాల నుండి మాత్రమే ధైర్యాన్ని మరో ప్రపంచం నుండి అందుకుంటారు. అంతేకాదు, దేవుడు తన స్వంత వారికి ఈ లోకంలో వారి పని ముగియగానే చనిపోవడానికి కృపననుగ్రహిస్తాడు, కానీ, ఆ సమయం వరకూ వారా కృపను పొందలేరు.

కృప యొక్క గొప్ప బహిరంగ ప్రదర్శనేమిటంటే లెక్కించలేని ఐశ్వర్యం గల గొప్ప దేవుడు, అయోగ్యులైన పాపుల్ని ఊహకందనంత ధనికులుగా చేయడానికి దరిద్రుడయ్యాడు.

"తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక, వీరిని క్షమించుము"[3] అని కల్వరి నుండి ప్రార్థించింది ఈ చెప్పశక్యముకాని కృపయే.

కొంత కాలం క్రితమే- మానవ శరీరాకారంలో పంపిన తన కుమారుడు ఎక్కడ హత్యగావింపబడ్డాడో, అక్కడికే తన పరిశుద్ధాత్మను పంపేలా దేవునిని కదిలించింది దైవికమైన కృపయే!

సాటిలేని కృపను పంచి ఇచ్చింది దేవుడే కనుక, కీర్తనాకారుడు క్రింది వాక్యంలో "దేవా, నీ తలంపులు నా కెంత ప్రియమైనవి . . . అవి యిసుక కంటెను ఎక్కువై యున్నవని[4], ఆయన సత్యసంధత్వము అంతరిక్షాన్ని అంటుచున్నదని[5] చెప్పగలిగాడు. వారి పాపాల్ని బట్టి ఆయన ప్రతికారము చేయలేదని, దోషాలనుబట్టి ప్రతిఫలమియ్యలేదని[6] విశ్వాసులు ఎంత సంతోషంగా ఉండగలరో. "ఆయన వాత్సల్యత ఎడతెగక నిలుచునది; అనుదినము నూతనముగా ఆయనకు వాత్సల్యత పుట్టుచున్నది."[7]

ప్రకృతి సంబంధమైన జీవితం నుండి ఆధ్యాత్మిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితం నుండి నిత్యజీవానికి నడిపించేది అవధులు లేని ఆ కృపయే. అది స్తుతికి సంబంధించిన ముఖ్యాంశంగా ఎప్పటికీ, మరెప్పటికీ ఉంటుంది.

పద్నాలుగవ అధ్యాయం

# సింహావలోకనం

మనమిప్పుడు దేవుని కృపా మహదైశ్వర్యాన్ని ధ్యానించడంలో గల ప్రముఖ అంశాలను సమీక్షిద్దాం.

మొదటిగా మనం చూసే ప్రశ్న ఇదే: రక్షణ ప్రణాళికను రచించడంలో పరిశుద్ధుడు, నీతిమంతుడైన దేవుడు పాపులను క్షమించి, ఆ విధంగా చేయడంలో ఇంకా న్యాయంగా ఎలా ఉండగలడు?

దీనికి జవాబు "ప్రత్యామ్నాయం" అనే ఒకే ఒక పదంలో ఇమిడి ఉంది. దేవుడు తన ఏకైక కుమారుడైన ప్రభువైన యేసుక్రీస్తును కల్వరి సిలువపై పాపులకు బదులుగా మరణించడానికి పంపించాడు. ఆయన ఆ కఠినశిక్షను పూర్తిగా చెల్లించి, ఆయనయందు విశ్వసించిన వారందరికీ ఇప్పుడు నిత్యజీవాన్ని ఉచితవరంగా ఇస్తున్నాడు.

ఇది కేవలం కృప– నిజానికది దేవుని కృపకు అర్హులు కాని వారిపట్ల, అర్హతను చూడని దేవుని మంచితనం. ఆ కృపను ప్రశంసించడానికి, యేసు ఎవరో, దానిని మనం గ్రహించి తీరాలి; ఆయన (ఏం చేశారు) ఎవరికోసం ఆయన దాన్ని చేశారు? ఆయనను విశ్వాసంతో అంగీకరించిన వారికి – దొరికే ఆశీర్వాదాల ప్రవాహాన్ని గ్రహించాలి.

లోకంలో, కేవలం ఒకే ఒక ఇతర మతం ఉంది. అది మరో సువార్త, అని పిలువబడుతుంది. కానీ, అదెంతమాత్రం మంచివార్త కాదు. అది ప్రజలకు వారి స్వంత మంచితనం ద్వారా మరియు సాధించిన వాటి వల్లా పరలోకాన్ని చేరవచ్చుని చెబుతుంది. ఇది చాలా ప్రజారంజకమైన మతం; ఎందుకంటే, అది మానవుల గర్వాన్ని తృప్తిపరుస్తుంది; అది దానికి బ్రహ్మాండమైన ఆడంభరాలెన్నో వున్నాయని చెప్పుకొన్నా, అది రక్షణ నిశ్చయతను కానీ ప్రస్తుత భద్రతను కానీ నిత్యజీవాన్ని కానీ ఇవ్వలేదు. చివరికది నరకానికి దారితీస్తుంది.

కృపద్వారా రక్షింపబడిన ప్రజలు ప్రభువైన యేసుకే ఘనతను ఆపాదిస్తారు. క్రియల ద్వారా రక్షణ దొరుకుతుందని నమ్మేవారు తమకి మాత్రమే మహిమను వెదుకుతారు లేదా అందులో కొంత మహిమనైనా తమకే ఆపాదించుకుంటారు. ఆ విధంగా నీవు ఒక వ్యక్తి దేన్ని ఆధారం చేసుకొని పరలోకానికి వెళ్లాలనుకుంటున్నాడో నీవు చెప్పగలవు.

క్రియల ద్వారా రక్షణ కలుగదని మనం చెప్పినపుడు, దాని అర్థం మనం మంచిపనులకు వ్యతిరేకులమని కాదు. అలా ఎన్నటికీ కాదు. మేము నొక్కి చెప్పేదేమిటంటే, క్రియలనేవి రక్షణకు ఆధారమైన వేర్లు కాదని; అవి ఫలాలు, మనం సత్క్రియల ద్వారా రక్షింపబడలేదు కానీ, సత్క్రియలు చేయడానికి రక్షింపబడ్డాం. వాటిని శ్రమచేసి సంపాదించుకొంటేనే అని కాదు, కానీ అవి రక్షింపబడిన తరువాత వచ్చే ఫలితమై వుంది. అది మూలం కాదు; కనిపించే ఫలితమది.

సాధారణంగా వచ్చే ప్రశ్నేమిటంటే, "ఒక వ్యకి రక్షింపబడిన తరువాత పాపం చేస్తే, అతడు తన రక్షణను కోల్పోతాడా?"అని. సమన్వయంగా వున్న లేఖనాల సాక్ష్యం, మరియు కృప యొక్క నిజస్వభావం దీనికి జవాబు "కాదు" అని నొక్కిచెప్పే అవసరముంది. పాపం సహవాసాన్ని పోగొడుతుంది. కానీ సంబంధాన్ని కాదు. సహవాసం సన్నని దారం

లాంటదయితే, సంబంధం విడగొట్టలేని గొలుసువంటిది. ఒక విశ్వాసి తన పాపాన్ని ఒప్పుకోగానే, అతడు క్షమించబడతాడు; ప్రభువుతో అతడి సహవాసం పునరుద్ధరించబడుతుంది.

తాను క్రైస్తవుడనని చెప్పుకొనే ప్రతి ఒక్కరూ నిజానికి రక్షించబడినట్లు కాదు. ఎవరి జీవితంలో నైనా పాపం ఆధిపత్య శక్తిగా వుంటే, అతడు లేక ఆమె పాపంలో నివసిస్తే, ఆ వ్యక్తి రక్షణను శంకించడానికి మంచికారణముంది. అతడు రక్షణపొందానని చెప్పుకునేవాడే కానీ, పొందినవాడు కాదు. జీవితంలోనికి క్రీస్తు వచ్చినపుడు, ఆయన తేడాను కలుగచేస్తాడు.

కృపాసువార్తను చాలా చవుకైనదిగా భావించేవారికి, బహుమతినిచ్చే వ్యక్తే, దాని ఖరీదు చెల్లిస్తున్నాడు కాని బహుమతిని స్వీకరించేవాడు కాదనే విషయాన్ని గుర్తుచేయడం చాలు. ఆ బహుమతి స్వభావమే అలాంటిది. దాత దాని ఖరీదును చెల్లిస్తాడు స్వీకర్త కాదు. దాతగా దేవుడు నిత్యజీవాన్ని ఉచితవరంగా ఇవ్వడానికి చాలా ఎక్కువ వెలను చెల్లించాడు.

అన్ని మంచి విషయాలను చేసినట్లే, కృపను కూడా దుర్వినియోగపరచే అవకాశముంది. ప్రజలు కృపను సాకుగా తీసుకొని స్వేచ్ఛగా తమ చెడు కోర్కెలను అనుభవిస్తూ వాటిని మన్నించుకోగలరు. అటువంటి ప్రతి విషయంలో సమస్య వ్యక్తులదే కానీ కృపాసిద్ధాంతానిది కాదు.

పరిశుద్ధజీవితానికి బలమైన సుసాధ్యతగల ప్రేరణను కలిగించేది కృపయే కానీ, ధర్మశాస్త్రం కాదు. ధర్మశాస్త్రం విధులను సరిగ్గా పాటించాలనీ, వాటిలో విఫలులైతే శిక్ష తప్పదని అధికారంతో చెబుతుంది. కృప క్రీస్తు ఏమి చేశాడో దానిగురించి చెప్పి, దానికి తగినట్లుగా పరిశుద్ధ జీవితం జీవించమని ప్రోత్సహిస్తుంది. కృపగల దేవుడు తన యెదుట సంపూర్ణమైన దయతో ఒక స్థానంలో నిలబెడతాడు, ఆ పై ఆ స్థానానికి

తగినట్లు ఆ స్థానంతో ఐక్యమైన జీవితాన్ని జీవించమని చెబుతాడు. క్రొత్త నిబంధనలోని ఆదేశాల వివరణ యోగ్యమైన నడక అంటే ఏమిటో, దానిని స్పష్టంగా వివరిస్తుంది.

దేవుని బిడ్డ యొక్క జీవితం ఆది నుండి అంతం వరకూ దైవికమైన కృపను వ్యక్తీకరించేదిగా ఉంటుంది. మనిషికి ఏదో ఋణపడని, అతడూహించని ఆశీర్వాదాలను అతనిపై కుమ్మరిస్తున్న దేవుని ప్రత్యక్షత అది. తన తీర్పును దేనికీ అర్హులు కాని వారికి ప్రభువు తన శ్రేష్ఠమైనది ఇవ్వడమే ఈ కథ.

తన అద్భుతమైన కృపను చూపించగల స్త్రీ, పురుషుల కోసం దేవుడింకా వెతుకుతూనే వున్నాడు. శతాబ్దాల వెంబడి మానవులు చూపిస్తున్న అనాసక్తికి, అయిష్టతకు, నిరాకరణకు చలించని సర్వకృపానిధియగు దేవుడు నశించిన గొఱ్ఱెలను వెతుకుతూ సువార్తను ఇంకా పంపిస్తూనే ఉన్నాడు. తాము పాపులమని ఒప్పుకొని, తమను తాము రక్షించుకొనే ప్రయత్నాన్ని మానేసిన వారి కోసం; తన ప్రభువుగా, రక్షకునిగా యేసును నమ్మేవారికోసం ఆయన చూస్తున్నాడు. ఇది ఎంత సరళంగా కన్పిస్తుందో అంతే సరళమైనది.

అంతేకాక, ఈ విషయాన్ని గుర్తుంచుకోండి! ప్రభువైన యేసునందు నిజమైన విశ్వాసం రవ్వంత కన్పించినా దేవుడు ఆ వ్యక్తిని నీతిమంతునిగా పరిగణిస్తాడు. హెచ్.ఎ. ఐరన్‌సైడ్ చెప్పినట్టుగా,

> "ఒక వ్యక్తి గురించి, తన కుమారుని పని గురించి, దేవుడెంతగా ఆలోచిస్తాడంటే, ప్రతి ఒక్కరూ పరలోకంలో ఉండాలనేది ఆయన ఆశ; అందుకు ఏ చిన్న అవకాశం దొరికినా చాలు వారిని అక్కడికి చేర్చడానికి. ఎంత సాటిలేని కృప!"[1]

అఖరి అధ్యాయమింకా వ్రాయబడలేదు. నిత్యత్వమంతా దేవుడు క్రీస్తు యేసులో ఆయన కృపామహదైశ్వర్యాన్ని, మనపట్ల తన కనికరం చూపించడం ద్వారా వ్యక్తపరుస్తాడు.[2] అది ఆయన అద్భుత రక్షణ ప్రణాళిక యొక్క శాశ్వత ఆవిష్కారం- నశించినదానిని వెదకి రక్షించడానికి సాధనంగా తన కుమారుణ్ణి ఈ పాపపు అరణ్యంలోనికి ఎందుకు పంపవలసి వచ్చిందో, కల్వరిలో జరిగిన ఆ అద్భుతకార్యం ద్వారా మనకు ఎన్నెన్ని ఆశీర్వాదాలు లభించాయో వాటన్ని గురించిన శాశ్వత ఆవిష్కారమే ఆ చివరి అధ్యాయం!

బైబిల్ కృపతోనే ముగించబడుతోంది గనుక మనం కూడా అలాగే ముగిద్దాం: "ప్రభువైన యేసు క్రీస్తు కృప మీ అందరికీ తోడైయుండును గాక. ఆమెన్."

# తుది వివరణలు

# తుది వివరణలు

## పరిచయం

1. జాన్ న్యూటన్ వ్రాసిన మాటలు (1725–1807)

## అధ్యాయం 2

1. 1 తిమోతి 2:5
2. యోహాను 1:1
3. 2 కొరింథీ 5:21; 1 పేతురు 2:22; 1 యోహాను 3:5
4. 1 యోహాను 1:7
5. కీర్తనలు 40:8; హెబ్రీ 12:2
6. యెషయా 53:4-6
7. యోహాను 1:29
8. గలతీ 2:20
9. 1 పేతురు 2:24
10. 1 యోహాను 2:2
11. యోహాను 3:16
12. 1 యోహాను 2:2
13. రోమా 3:23
14. మత్తయి 11:28

15. ప్రకటన 22:17
16. యోహాను 3:36
17. కీర్తనలు 85:10
18. ద అప్లాజ్ ఆఫ్ హెవెన్, డల్లాస్; టిఎక్స్: వర్డ్ పబ్లిషింగ్, 1990, పుటలు 175–176
19. జాన్ ఎఫ్. మెకార్థర్, జూనియర్, ఫెయిత్ వర్క్స్, డల్లాస్, టిఎక్స్: వర్డ్ పబ్లిషింగ్, 1993, పుట 99
20. బాప్టిస్ట్ బిబ్లికల్ హెరిటేజ్‌లో ఉటంకించబడినది ఏప్రిల్ 1994, పుట1

**అధ్యాయము 3**

1. హెబ్రీయులకు 4:10
2. యోహాను 1:12; 3:15–16; 3:36; 5:24; 6:40,47; 7:37–38; 11:25–26; 20:31; అపొ.కా 16:31; రోమా 10:9; గలతీ 3:22–26; ఎఫెసీ 2:8; 1 యోహాను 5:10–13.

**అధ్యాయము 4**

1. ఎఫెసీయులకు 2:8–9
2. కీర్తనలు 40:1–3
3. సర్‌ప్రైజ్‌డ్ బై జాయ్ (న్యూ యార్క్: హార్‌కోర్ట్ బ్రేస్ జోవానోవిష్ పబ్లిషర్స్, 1884), పుట 229
4. మత్తయి 20:1–16
5. 1 థెస్సలోనీకయులకు 4:1 కృపను గురించి ఇటువంటి వ్యక్తీకరణలు ఉండడం కూడా గమనించండి: “మిమ్మును బతిమాలుకొనుచున్నాను” (రోమా 12:1).

**అధ్యాయము 5**

1. యెషయా 40:12

2. బాప్టిస్ట్ బిబ్లికల్ హెరిటేజ్‌లో ఉటంకించబడినది ఏప్రిల్ 94, పుట 1
3. యిర్మీయా 17:9
4. రోమీయులకు 3:23
5. ఎఫెసీయులకు 2:2-3,12
6. అవర్ డెయిలీ బ్రెడ్, ఏప్రిల్ 20, 1994
7. ద పవర్ ఆఫ్ స్టోరీలో ఉటంకించబడినది లెయిటన్ ఫోర్డ్, కొలొరాడో స్ప్రింగ్స్; నావ్ ప్రెస్, 1994, పుట 112
8. ద హార్ట్ ఆఫ్ ద గాస్పెల్, వీటన్ III క్రాస్ వే, 1991, 165-66.
9. రోమీయులకు 6:23
10. యోహాను 10:10
11. కొలొస్సయులకు 1:27
12. ఎఫెసీయులకు 1:7
13. కొలొస్సయులకు 2:14
14. 1 పేతురు 1:18
15. ఎఫెసీయులకు 2:5
16. ఎఫెసీయులకు 1:6
17. కొలొస్సయులకు 2:10
18. యోహాను 17:23
19. రోమీయులకు 5:1
20. హెబ్రీయులకు 10:10
21. హెబ్రీయులకు 4:14-16; రోమీయులకు 8:34; 1 యోహాను 2:1; యోహాను 14:16
22. యోహాను 14:16-17
23. 1 కొరింథీయులకు 12:13
24. ఎఫెసీయులకు 1:14
25. ఎఫెసీయులకు 1:14

26. 1 యోహాను 2:27
27. ఎఫెసీయులకు 2:18
28. హెబ్రీయులకు 10:19
29. ఫిలిప్పీయులకు 3:20
30. యోహాను 1:2
31. గలతీయులకు 4:6
32. రోమీయులకు 8:17
33. 1 పేతురు 2:5,9
34. రోమీయులకు 8:37
35. 1 యోహాను 3:2
36. ఎఫెసీయులకు 1:3
37. సి.హెచ్.స్పర్జన్, సెర్మన్స్ ఆన్ ద బుక్ ఆఫ్ డేనియల్, గ్రాండ్ రేపిడ్స్; జోండర్‌వాన్ పబ్లిషింగ్ హౌస్,1996, పుట 54
38. పర్స్వేయేషన్, లండన్; మెక్‌డోనాల్డ్ అండ్ జేన్స్, 1974, పుట 273
39. రోమీయులకు 5:21

**అధ్యాయము 6**

1. సామెతలు 14:12
2. రోమీయులకు 11:6
3. లూకా 18:18
4. రోమీయులకు 3:20,28; 4:5; గలతీయులకు 2:16; 3:10-11; ఎఫెసీ 2:9; 2 తిమోతి 1:9; తీతుకు 3:5
5. రోమీయులకు 3:20,28, 4:1-12; గలతీయులకు 2:16-17; 3:10-14; ఎఫేసీ 2:8-9; 2 తిమోతి 1:9; తీతుకు 3:5
6. రోమీయులకు 4:16
7. గలతీయులకు 4:28-31

**అధ్యాయము 7**

1. రూతు 2:10
2. 2 సమూయేలు 7:18
3. 2 సమూయేలు 9:8
4. ఎఫెసీయులకు 3:8-9
5. విక్టోరియస్ క్రిష్టియన్స్ యు ఖడ్ నో, రచన: వారెన్ డబ్ల్యు. వియర్స్‌బి (గ్రాండ్ రాపిడ్స్, బేకర్ బుక్ హౌస్, 1984), పుట. 63-64
6. ఆర్మీనియన్‌లు రక్షణలో-మానవుని స్వేచ్ఛా చిత్తానికి ప్రాముఖ్యతనిస్తే కేల్వినిస్టులు దేవుని సార్వభౌమత్వాన్ని ఎంపికను నొక్కి చెబుతారు. వీరి సంభాషణ- రెండింటి భావాలు ఒకదానికొకటి పరిగణలోనికి తీసుకోకుండా వదిలివేసేవి కావని తెలియచేస్తుంది.

**అధ్యాయము 8**

1. ద బైబిల్ ఎక్స్‌పొజిషన్ కామెంటరీ, వాల్యూమ్ 2, వీటన్, IL; విక్టర్ బుక్స్ 1989, పుట 84
2. యూదా పత్రిక 24

**అధ్యాయము 9**

1. యోహాను 6:29
2. యెషయా 64:6
3. యోహాను 12:26; 1 కొరింథీయులకు 3:8; ఎఫెసీయులకు 2:10; 6-8; తీతుకు 3:8; హెబ్రీయులకు 6:10; ప్రకటన 22:12

**అధ్యాయము 10**

1. యోహాను 10:27-28
2. రోమీయులకు 11:29
3. 1 పేతురు 1:5, యూదా 1, 24

4. రోమీయులకు 6:23
5. యోహాను 1:12
6. రోమీయులకు 8:30
7. యోహాను 14:16
8. 2 కొరింథీయులకు 1:22; 5:5; ఎఫెసీయులకు 1:14
9. 2 కొరింథీయులకు 1:22; ఎఫెసీయులకు 1:13; 4:30
10. రోమీయులకు 5:10
11. యోహాను 5:24
12. 1 కొరింథీయులకు 15:3
13. యోహాను 19:30
14. రోమీయులకు 8:38-39
15. 1 యోహాను 1:6
16. 1 యోహాను 2:1
17. 1 యోహాను 1:7
18. కీర్తనలు 51:12
19. కీర్తనలు 32:4
20. ఆదికాండము 19:14
21. 2 సమూయేలు 12:14
22. 2 తిమోతి 2:19
23. కీర్తనలు 66:18
24. 1 కొరింథీయులకు 3:15
25. 1 కొరింథీయులకు 11:30
26. 1 కొరింథీయులకు 9:27
27. 1 కొరింథీయులకు 11:30
28. 1 కొరింథీయులకు 3:15
29. సామెతలు 28:13

**అధ్యాయము 11**

1. రోమీయులకు 6:14
2. 1 కొరింథీయులకు 9:21
3. యోహాను 8:36
4. గలతీయులకు 5:13
5. జాన్ ఎఫ్. మెకార్థర్, జూనియర్, ఫెయిత్ వర్క్స్, డల్లాస్, టిఎక్స్; వర్డ్ పబ్లిషింగ్, 19993, పుట 120
6. యూదా 4

**అధ్యాయము 12**

1. గలతీయులకు 3:3
2. జె.ఎఫ్. స్ట్రోమ్‌బెక్, డిసిప్లిన్‌డ్ బై గ్రేస్, మోలిన్ IL. గ్రేస్ అండ్ ట్రూత్, 1946, పుట 102
3. రోమీయులకు 6:1
4. రోమీయులకు 6:2
5. ఎఫెసీయులకు 4:25-32
6. తీతుకు 2:12
7. జె.ఎఫ్. స్ట్రోమ్‌బెక్, డిసిప్లిన్‌డ్ బై గ్రేస్, పుట 20

**అధ్యాయము 13**

1. కీర్తనలు 81:16
2. యెషయా 54:17
3. లూకా 22:34
4. కీర్తనలు 139:17-18
5. కీర్తనలు 36:5
6. కీర్తనలు 103:10
7. విలాపవాక్యములు 3:22-23

**అధ్యాయము 14**

1. హెచ్.ఎ. ఐరన్‌సైడ్, ద లెవిటికల్ ఆఫరింగ్స్, నెప్ట్యూన్, ఎన్‌జె: లోయి జియాక్స్, 1982, పుట 64
2. ఎఫెసీయులకు 2:7